https://prajapratibha.com
RNI : APTEL 2013/54721

# ప్రజా ప్రతిభ

ప్రతి అక్షరం ప్రజా పక్షం
తెలుగు దినపత్రిక

సంపుటి 13 | సంచిక 195 | prajapratibha.2013@gmail.com | ఎడిటర్ : దానూరి శ్రీనివాస్ | 9441500341 | వెల రూ. 5.00 | పేజీలు 13

ఆంధ్రప్రదేశ్ | Published from Andhra Pradesh & Telangana | మంగళవారం, మార్చి 24, 2026

ఆందోళనకరంగా
## పశ్చిమాసియా పరిస్థితి
యుద్ధంతో భారత్‌కు ఎన్నో సవాళ్లు
లోక్‌సభలో ప్రధాని మోడీ వెల్లడి

02



ఇరాన్‌లోని 'గౌరవనీయ వ్యక్తి'తో
## చర్చలు జరుపుతున్నాం
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**న్యూయార్క్, మార్చి23 (ప్రజా ప్రతిభ):** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో తాము రహస్యంగా చర్చలు జరుపుతున్నామని, ఆ దేశంలోని ఒక 'గౌరవనీయ వ్యక్తి'తో నేరుగా మాట్లాడుతున్నామని వెల్లడించారు. అయితే, ఆ వ్యక్తి కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ కాదని చెప్పారు. అసలు ఆయన బతికున్నాడో లేడో కూడా తమకు తెలియదంటూ వ్యాఖ్యానించారు. ఫ్లోరిడాలోని మిగతా 2లో..

డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా
## పార్టీలకు ప్రచారం
కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం
దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో ఉచిత ప్రచారం

02

రైలు ప్రమాదాలకు
## 'కవచ్' అడ్డుకట్ట...
కీలక మార్గంలో సేవలు ప్రారంభం



**న్యూఢిల్లీ, మార్చి23 (ప్రజా ప్రతిభ):** రైలు ప్రయాణాన్ని మరింత సురక్షితంగా, వేగవంతంగా మార్చే దిశగా భారతీయ రైల్వే కీలక ముందడుగు వేసింది. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఢిల్లీ-హౌరా కారిడార్‌లోని ప్రయాగ్‌రాజ్-కాన్పూర్ సెక్షన్‌లో స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్' ఆటోమేటిక్ రైలు భద్రతా వ్యవస్థను సోమవారం విజయవంతంగా ప్రారంభించినట్లు రైల్వే మిగతా 2లో..



ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు..
# స్టీల్ సిటీకి ఫౌండేషన్
ఈజ్ ఆఫ్ డూయింగ్ కాదు..
## స్పీడ్ ఆఫ్ డూయింగ్

ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడి ఓ గొప్ప మలుపు
ఉత్తరాంధ్ర సరికొత్త చరిత్రరాయబోతోంది
స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనలో సీఎం చంద్రబాబు




**అనకాపల్లి, మార్చి23 (ప్రజా ప్రతిభ):** ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో సరికొత్త చరిత్ర రాయబోతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ పెట్టుబడి ఓ గొప్ప మలుపు కాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. నక్కపల్లి మండలం రాజయ్యపేటలో విశాఖ ఉక్కు కంటే అతిపెద్ద ప్లాంట్ రాబోతోందని, సోమవారం ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా ప్లాంట్‌కు భూమి పూజ జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'ప్రపంచానికి ఏపీ సత్తా చాటిచెప్పే ప్రాజెక్ట్ ఈ స్టీల్‌ప్లాంట్. ప్రధాని మోదీ సహకారంతోనే ప్లాంట్ ఏర్పాటు సాధ్యమైంది. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటులో మంత్రి లోకేశ్ కృషి ఎంతో ఉంది. అన్నివిధాలా సహకరిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారబోతున్నాయి. ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు.. స్టీల్ సిటీకి ఫౌండేషన్. అని అన్నారు. ఉత్తరాంధ్రలోని నక్కపల్లిలో కొత్తచరిత్ర లిఖిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకంటే.. అతిపెద్ద మిగతా 2లో..

విజయమ్మ
# లేఖ నిజం..
దమ్ముంటే జగనే సమాధానం చెప్పాలి: వైఎస్ షర్మిల

కుటుంబ ఆస్తుల వివాదంపై స్పందించిన వైఎస్ షర్మిల
వివేకా హత్య కేసును పక్కదారి పట్టించేందుకే ఈ గొడవ అని ఆరోపణ
దమ్ముంటే జగనే నేరుగా మాట్లాడాలంటూ సవాల్
విజయమ్మ లేఖలోని సంతకం నిజమని.. వైసీపీ ప్రచారం అబద్ధమని వెల్లడి
వైసీపీ నేతలపై అత్యంత కఠిన పదజాలంతో విరుచుకుపడ్డ షర్మిల



**ఏపీ స్టేట్ బ్యూరో, మార్చి23 (ప్రజా ప్రతిభ):** తమ కుటుంబ ఆస్తుల వివాదంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో స్పందించారు. తన సోదరుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై సంచలన ఆరోపణలు చేశారు. వివేకానంద రెడ్డి హత్య కేసును పక్కదారి పట్టించేందుకే వైసీపీ నేతలు ఆస్తుల వివాదాన్ని తెరపైకి తెస్తున్నారని ఆమె మండిపడ్డారు. తన తల్లి వైఎస్ విజయమ్మ విడుదల చేసిన లేఖలోని ప్రతి అక్షరం నిజమని, దమ్ముంటే ఆ లేఖపై జగనే నేరుగా మాట్లాడాలని మిగతా 2లో..

మత్స్యకారుల
## రక్షణకు చర్యలు
ఏప్రిల్ 15 నుంచి సముద్రంలో వేట నిషేధం: ఆనం




**నెల్లూరు, మార్చి23 (ప్రజా ప్రతిభ):** ఆంధ్రా ప్రాంత మత్స్యకారుల రక్షణకు ఎంతటి వరకైనా వెళ్తామని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. తమిళనాడు, పుదుచ్చేరి మత్స్యకారుల దాడులు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఏపీ మత్స్యకారులకు సంపూర్ణంగా అండగా ఉంటామన్నారు. నెల్లూరు మిగతా 2లో..



హాస్టల్ పరిస్తితులపై
## మంత్రి సవిత తనిఖీ
నేరుగా పరిశీలిచి..
విద్యార్థులతో ఆరా

**రాజమండ్రి, మార్చి23 (ప్రజా ప్రతిభ):** విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, హాస్టళ్లలో వసతుల కల్పనలో రాజీపడే ప్రసక్తే లేదని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం మిగతా 2లో..

ఇంటిపై దాడి, ధ్వంసంపై
## అంబటి ఫిర్యాదు
ఇంతవరకు కేసు నమోదు చేయకపోవడం దారుణం
న్యాయం చేయకపోతే సుప్రీం కోర్టు గడప తొక్కుతా



**గుంటూరు, మార్చి23 (ప్రజా ప్రతిభ):** తన ఇల్లు, ఆఫీసుపై జరిగిన దాడిపై చర్యలు తీసుకోవాలంటూ మాజీ మంత్రి అంబటి రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడి కేసులో విచారణ అధికారిని మార్చాలని, నల్లపాడు పోలీస్ స్టేషన్ లో కస్టోడియల్ టార్చర్ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని రెండు ఫిర్యాదులు చేశారు. టీడీపీ నాయకుల దాడికి పోలీసులు పూర్తిగా సహకరించారని ఆరోపించారు. ఇలాంటి ఘటనలపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయాలని తాను ఫిర్యాదు మిగతా 2లో..

## ఐకానిక్ టవర్‌గా అసెంబ్లీ నిర్మాణం
మంత్రి నారాయణ వెల్లడి

**అమరావతి, మార్చి23 (ప్రజా ప్రతిభ):** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులపై రాష్ట్ర మున్సిపల్, పరిపాలన శాఖ మంత్రి పొంగూరు నారాయణ కీలక అప్‌డేట్స్ ఇచ్చారు. అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ టవర్లను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఐకానిక్ కట్టడాలుగా నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా నిర్మిస్తున్న ఐకానిక్ భవనాల విశిష్టతను, నిధుల సమీకరణను మంత్రి నారాయణ వివరించారు. అమరావతి అసెంబ్లీ భవనాన్ని 250 మీటర్ల ఎత్తులో నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ భవనంపైకి ప్రజలు వెళ్లి మొత్తం అమరావతి నగరాన్ని మిగతా 2లో..



## మిట్టల్ స్టీల్‌తో పారిశ్రామిక హబ్‌గా విశాఖ
రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్



**అమరావతి, మార్చి23 (ప్రజా ప్రతిభ):** ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ రాకతో విశాఖ ప్రాంతం పరిశ్రమల హబ్‌గా మారుతోందని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్, యువ నేత, మంత్రి నారా లోకేశ్ కష్టానికి ప్రతిఫలం ఈ ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అని ఆయన పేర్కొన్నారు. సోమవారం రాజధాని అమరావతిలో మంత్రి అనగాని సత్య ప్రసాద్ విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి చరిత్రలో నేడు ఓ గొప్ప మైలురాయి అని ఆయన అభివర్ణించారు. ఉక్కు రంగంలో రాష్ట్రానికి రూ. 1.36 లక్షల కోట్ల పెట్టుబడితో మిగతా 2లో..

డ్రగ్స్ కేసులో 'నా కుమారుడు
## నిరపరాధి'
మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



**కడప, మార్చి23 (ప్రజా ప్రతిభ):** డ్రగ్స్ కేసులో 'నా కుమారుడు నిరపరాధి' అని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. తెలంగాణ రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసు వివాదంపై కడప జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం కడప జిల్లాలో మీడియాతో ఆయన మాట్లాడారు. తన కుమారుడు, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ డ్రగ్స్ కేసులో చిక్కుకోవడంపై క్లారిటీ ఇచ్చారు. మొయినాబాద్ ఫాంహౌస్ ఘటనపై సుధాకర్ యాదవ్ స్పందించారు. తన కుమారుడిపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నానని మిగతా 2లో..

https://prajaprathibha.com
RNI: APTEL 2013/54721
ప్రజా ప్రతిభ
ప్రతి అక్షరం ప్రజా పక్షం
తెలుగు దినపత్రిక


## ఇది స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపన కాదు..

# స్టీల్ సిటీకి ఫౌండేషన్

(మొదటిపేజీ తరువాయి)
పరిశ్రమ రాజయ్యపేటలో ఏర్పాటు కాబోతోందన్నారు. ఆర్సెలార్ మిత్తల్ పెట్టుబడిని గొప్ప మలుపుగా అభివర్ణించారు. భారత్‌లోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్ నక్కపల్లిలో ఏర్పాటు కాబోతోంది. ప్రపంచంలోనే నెంబర్‌వన్ ఉక్కు పరిశ్రమగా ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్ కాబోతోంది. కేంద్రం సహకారం ఉండటం వల్లే ఈ ప్లాంట్ సాధ్యమవుతోందని అన్నారు. రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన చేస్తామని హామీ ఇచ్చాం. ఇచ్చిన హామీలను 20 నెలల్లో పూర్తి చేశాం. ఏ పని తలపెట్టినా బేషరతుగా మద్దతిస్తున్న పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు. ఈ ప్రాజెక్టు తీసుకొచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేసిన లోకేశ్‌కు అభినందనలు. 5,465 ఎకరాల్లో ఆర్సెలార్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి లభిస్తుంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేస్తాం. ఇవాళ స్టీల్‌ప్లాంట్‌కే కాదు.. స్టీల్ సిటీకి పునాది వేశాం. 2028 డిసెంబర్ నుంచి స్టీల్ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. ఈ ప్లాంట్ ద్వారా ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు వెళ్తున్నాం. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా రికార్డు స్థాయిలో భూ సేకరణ చేశాం అని అన్నారు. దేశంలోనే పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానం. ఏపీలో ఉన్నన్ని




వనరులు ఎక్కడా లేవు. అద్భుత విజయాలకు పెట్టుబడిదారులు ఏపీని కేంద్రంగా చేసుకోవాలి. ఇప్పటికే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించాం. మూడేళ్లలో 22 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. విశాఖను ప్రపంచస్థాయి నగరంగా చేస్తాం. విశాఖ, అమరావతి, తిరుపతిని మూడు రీజియన్లుగా అభివృద్ధి చేస్తాం. రేర్ ఎర్త్ మినరల్స్ హబ్‌గా విశాఖ తయారవుతుందని చంద్రబాబు అన్నారు. ఏపీలో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అందిస్తున్నాం. కేంద్రం సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతోంది. ప్లాంట్ ఏర్పాటుతో లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. ప్రాజెక్టుకు భూములు ఇచ్చిన రైతులకు రుణపడి ఉంటాం. అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం. క్వాంటమ్ వ్యాలీకి కేరాఫ్‌గా అమరావతి మారబోతోంది. ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రాబోతోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వల్లే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రజలకు అధిక ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఆర్సెలార్ పెట్టుబడులు తమలో విశ్వాసం మరింత పెంచాయని అన్నారు. చంద్రబాబు వంటి దార్శనిక నేత ఉంటేనే పెట్టుబడులు వస్తాయని, చంద్రబాబు వల్లే ఏపీకి పెట్టుబడులు వస్తున్నాయని అమిత్ షా కూడా చెప్పారని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని తెలిపారు. భూమిపూజలో పాల్గొనడం సంతోషంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఏపీలో పెట్టుబడులు పెడుతున్న స్టీల్‌ప్లాంట్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ద్వారా లక్షమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అధికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. 'ఆర్సెలార్ స్టీల్‌ఎ÷-లాంట్ పెట్టుబడులు మాలో విశ్వాసాన్ని పెంచాయి. పెట్టుబడులు రావాలంటే దార్శనికత ఉన్న నేత కావాలని ఎన్నికల్లో చెప్పాను. లక్ష్మి మిత్తల్‌ను ఒప్పించి పెట్టుబడులు తీసుకురావాలంటే చంద్రబాబు వల్లే సాధ్యం. రాజకీయ ధురంధరుడు చంద్రబాబు వల్లే పెట్టుబడులు వస్తున్నాయి. అదే విషయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా చెప్పారు. అత్యాధునిక సాంకేతికతతో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని పవన్ కల్యాణ్ తెలిపారు.

## మత్స్యకారుల రక్షణకు చర్యలు

(మొదటిపేజీ తరువాయి)
కలెక్టరేట్‌లో అధికారులతో మంత్రి ఆనం సమీక్ష నిర్వహించారు. మత్స్యకారుల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామన్నారు. మత్స్యకారుల సమస్యపై సీఎం ప్రత్యేక దృష్టి పెట్టారు. హైపవర్ బోట్లతో మన సంపదను పొరుగురాష్ట్రాల మత్స్యకారులు దోచుకుంటున్నారు. సముద్ర జలాలపై గస్తీ కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశాం. ఏప్రిల్ 14 వరకు సముద్ర జలాల్లో గస్తీ ఉంటుంది. ఏప్రిల్ 15 తర్వాత రెండు నెలల పాటు వేట నిషేధం అమల్లో ఉంటుంది. సీఎం ఆదేశాలతో రేపు ప్రత్యేక బృందం నెల్లూరు జిల్లాకు వస్తోంది' అని మంత్రి తెలిపారు.

## హాస్టల్ పరిస్థితులపై మంత్రి సవిత తనిఖీ

(మొదటిపేజీ తరువాయి)
చేశారు. సోమవారం రాజమండ్రిలోని గణేశ్ చౌక్‌లో ఉన్న బీసీ ప్రభుత్వ బాలికల కళాశాల హాస్టల్‌ను ఆమె ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సవిత హాస్టల్‌లోని ప్రతి గదిని పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడారు.

అక్కడ అందుతున్న వసతులు, ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఫార్మసీ, పారామెడికల్ తదితర కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థినులు, తమకు ప్రభుత్వం నుంచి అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలతో జాప్యం జరుగుతోందని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హాస్టల్ మెస్‌ను తనిఖీ చేసిన మంత్రి, విద్యార్థునుల కోసం వండిన ఆహార పదార్థాలను స్వయంగా రుచి చూశారు. అనంతరం విద్యార్థినులలో కలిసి కూర్చుని కాసేపు ముచ్చటించారు. భోజనం నాణ్యతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ..'బీసీ హాస్టళ్లలో పరిస్థితులను మెరుగుపరిచేందుకు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తాం. విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీ హాస్టళ్లకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నాం. విద్యార్థినులు ఎదుర్కొంటున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిశీలించి తగిన చర్యలు తీసుకోంటోంది' అని అన్నారు.

## ఇంటిపై దాడి, ధ్వంసంపై అంబటి ఫిర్యాదు



(మొదటిపేజీ తరువాయి)
చేసే వరకూ కేసు నమోదు చెయ్యలేదన్నారు. ఏడేళ్ల లోపు శిక్షపడే సెక్షన్లతో కేసు నమోదు చేసినా జైలులు పంపి తన ఇంటిపై దాడి చేసినవారికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపారన్నారు. పట్టాభిపురం సీఐ వెంకటేశ్వర్లు నా కేసు వ్యవహారంలో దారుణంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఇక్కడ న్యాయం జరగకపోతే హైకోర్టు, అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తామని తేల్చిచెప్పారు. జనవరి 31న తన ఇల్లు, కార్యాలయంపై సుమారు 7 గంటల పాటు దాడి జరిగిందని ఆరోపణ చేశారు. దాడి తర్వాత తనను అరెస్ట్ చేసి 18 రోజుల తర్వాత బెయిల్‌పై విడుదల చేసినట్లు వెల్లడించారు. పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయలేదని విమర్శలు చేశారు. పిర్యాదు చేసిన తర్వాతే కేసు నమోదు చేశారని ఆరోపణలు చేశారు. తన ఇంటిపై దాడి, హత్యాయత్నం, ఆస్తి నష్టం కేసులు నమోదు చేయాలన్నారు. సిట్ ఏర్పాటు చేసి దర్యాప్తు జరపాలని, నల్లపాడు పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజ్ స్వాధీనం చేసుకోవాలన్నారు. ఈ ఘటన వెనుక ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఉన్నారని ఆయన ఆరోపించిన అంబటి రాంబాబు.. అలాగే టీడీపీ నేతలతో పోలీసులు కుమ్మక్కయ్యారని కూడా విమర్శించారు. తనపై నమోదైన కేసులు, అరెస్ట్ విధానంపై ఇప్పటికే హైకోర్టులో రిట్ పిటిషన్ వేసినట్లు తెలిపారు. అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు.

## డ్రగ్స్ కేసులో 'నా కుమారుడు నిరపరాధి'

(మొదటిపేజీ తరువాయి)
ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. మొయినాబాద్ ఫాంహౌస్‌లో జరిగిన పార్టీకి ఎంపీ మహేశ్‌కుమార్ యాదవ్ వెళ్లిన మాట నిజమేనని పుట్టా సుధాకర్ యాదవ్ అంగీకరించారు. అయితే, తన కుమారుడికి ఎలాంటి చెడు అలవాట్లు లేవని, ముఖ్యంగా డ్రగ్స్ తీసుకునే అలవాటు అస్సలు లేదని స్పష్టం చేశారు. మహేశ్ వద్ద నుంచి కనీసం బ్లడ్ శాంపిల్స్ తీసుకోకుండానే రిపోర్టులో పాజిటివ్ అని ఎలా నిర్ధారిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ నిర్ధారణ ప్రక్రియపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన నివేదికను తెలుగుదేశం పార్టీ అధిష్ఠానానికి సమర్పించినట్లు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ వెల్లడించారు. పోలీసుల విచారణ ఇంకా కొనసాగుతోందని, ఇన్వెస్టిగేషన్ ముగిశాక అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తాయని తెలిపారు. పోలీసుల విచారణ పూర్తయిన తర్వాత, మహేశ్ నిరపరాధి అని నిరూపించే అన్ని ఆధారాలతో మీడియా ముందుకు వస్తామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు.

## విజయమ్మ లేఖ నిజం..

(మొదటిపేజీ తరువాయి)
సవాల్ విసిరారు. సోమవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ, వైసీపీ నేతలపై అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేశారు.

### ఆస్తుల కోసం కాదు.. న్యాయం కోసమే పోరాటం

వివేకానంద రెడ్డిది హత్య అని తాను నిజం మాట్లాడటమే నేరమైందని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. "నిజం చెప్పినందుకే నాపై ఇంతగా విరుచుకుపడుతున్నారు. వివేకా హత్య కేసులో సాక్షి మీడియా ఏడు గంటల పాటు గుండెపోటు అని ఎందుకు ప్రచారం చేసిందో చెప్పే ధైర్యం వైసీపీ నేతలకు లేదు. దానికి సమాధానం చెప్పాల్సింది అవినాష్ రెడ్డి, సాక్షిని నడుపుతున్న భారతీ రెడ్డి. ఆ విషయంపై మాట్లాడలేక, ఆస్తులంటూ కొత్త వివాదాన్ని సృష్టిస్తున్నారు," అని షర్మిల విమర్శించారు. తాను ఆస్తుల కోసం పాకులాడుతున్నట్టు, చంద్రబాబు చేతిలో కీలుబొమ్మగా మారినట్టు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని అన్నారు. తన పోరాటం ఆస్తుల కోసం కాదని, ఒకవేళ అదే తన అజెండా అయితే తెలంగాణలో కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోనే పార్టీ పెట్టేదాన్నని స్పష్టం చేశారు. జగన్‌తో తాను సంతకం చేసిన ఎంఓయూ పత్రాలను ఇన్నాళ్లూ కోర్టుకు సమర్పించలేదని, కేవలం జగన్ తన తల్లిపై కేసు వేయడం వల్లే ఆ పత్రాలు బయటకు వచ్చాయని వివరించారు.

### విజయమ్మ లేఖ వాస్తవం.. దమ్ముంటే కాదనమనండి

తన తల్లి విజయమ్మ విడుదల చేసిన లేఖపై వైసీపీ సైతాన్ సైన్యం చేస్తున్న దుష్ప్రచారాన్ని షర్మిల తిప్పికొట్టారు. "విజయమ్మ అంటే రాజశేఖర్ రెడ్డి గారిలో సగం. ఆయన ఆశయాలకు సజీవ రూపం. అలాంటి వ్యక్తి, నలుగురు బిడ్డలకు ఆస్తి సమానంగా పంచాలన్నది రాజశేఖర్ రెడ్డి గారి ఆదేశమని, జగన్ అన్యాయం చేస్తున్నాడని లేఖలో స్పష్టంగా రాశారు. ఈ గోబెల్స్ ప్రచారం ఆపాలని కూడా చెప్పారు. ఇకనైనా డీసెన్సీ ఉన్నవాళ్లు ఎవరూ ఈ విషయం మాట్లాడరు. ఇంకా మాట్లాడుతున్నారంటే, మొరగడం కుక్కల నైజం అనుకోవాలి" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ లేఖలోని సంతకం తన తల్లిది కాదని, ఒత్తిడితో పెట్టించానని వైసీపీ ప్రచారం చేస్తోందని, నిజంగానే ఆ సంతకం ఆమెది కాకపోతే విజయమ్మే స్వయంగా మీడియా ముందుకు వచ్చి ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. జగన్ అయినా తన తల్లితో మాట్లాడించి నిజానిజాలు చెప్పించొచ్చు కదా అని నిలదీశారు.

### దమ్ముంటే జగనే మాట్లాడాలి

ఈ ఆస్తుల వివాదం పూర్తిగా వ్యక్తిగతమైనదని, దీనిపై మాట్లాడాల్సింది జగన్మోహన్ రెడ్డి అని షర్మిల అన్నారు. "ఇది జగన్ వ్యక్తిగత, ఆస్తులకు సంబంధించిన విషయం. దీనిపై ఆయన పార్టీ నేతల చేత, సోషల్ మీడియా సైన్యం చేత ఎందుకు మాట్లాడిస్తున్నారు? రాజశేఖర్ రెడ్డి గారి ఆదేశం, ఇద్దరం కలిసి సంతకాలు చేసిన ఎంఓయూ గురించి తెలిసిన జగన్ మాట్లాడాలి కదా? అంటే, ఆయనకు మాట్లాడే దమ్ము లేక ఇతరుల వెనుక దాక్కుంటున్నారని అనుకోవాలా?" అని షర్మిల ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం ప్రత్యేక హోదాను, పోలవరాన్ని తాకట్టు పెట్టి మోదీకి దత్తపుత్రుడిగా మారింది జగనేనని, తాను కాదని ఆమె ఆరోపించారు.

### వైసీపీ నేతలపై తీవ్ర వ్యాఖ్యలు..

రాజశేఖర్ రెడ్డి ఆశయాల కోసమే తాను, తన తల్లి రాజకీయాల్లో ఉన్నామని, జగన్‌లా స్వార్థ రాజకీయాలు చేయడం లేదని షర్మిల అన్నారు. ఫ్రంట్ పేజీలో రాజశేఖర్ రెడ్డి గారి ఫోటో వేసుకుని సత్యమేవ జయతే అని చెప్పుకునే సాక్షి పత్రికకు నిజం పట్ల గౌరవం లేదని విమర్శించారు. జగన్‌కు నిజం వైపు నిలబడే ధైర్యం లేకపోవడం వల్లే తన పార్టీలోని నాయకులతో తనపై విమర్శలు చేయిస్తున్నారని షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వాళ్లను నాయకులు అనాలో, కుక్కలు అనాలో మీరే అనుకోండి అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్నది జగనే అని, ఆయన దర్శకత్వంలోనే ఈ నాటకం నడుస్తోందని ఆమె ఆరోపించారు.

## ఆందోళనకరంగా పశ్చిమాసియా పరిస్థితి

### యుద్ధంతో భారత్‌కు ఎన్నో సవాళ్లు

### లోక్‌సభలో ప్రధాని మోడీ వెల్లడి

**న్యూఢిల్లీ, మార్చి23 (ప్రజా ప్రతిభ):** పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. సోమవారం ఆయన లోక్‌సభలో మధ్యప్రాచ్యంలో యుద్ధం గురించి ప్రసంగించారు. మూడు వారాలుగా యుద్ధం కొనసాగుతోందన్న ప్రధాని మోదీ.. భారత్ ఇంధన అవసరాలను పశ్చిమాసియా తీరుస్తోందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ యుద్ధం భారత్‌కు ఎన్నో సవాళ్లు తీసుకొచ్చిందని మోదీ అన్నారు. ప్రజలపై యుద్ధం తీవ్ర ప్రభావం చూపిస్తోందని కూడా ప్రధాని మోదీ వెల్లడించారు. పశ్చిమాసియాలో కోటి మందికిపైగా భారతీయులు ఉన్నారని, గల్ఫ్‌లో ఉన్న భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టామని ప్రధాని మోదీ లోక్‌సభలో చెప్పారు. 24 గంటలూ కంట్రోల్ రూమ్స్, హెల్ప్‌లైన్స్ ఏర్పాటు చేశామని, 3.75 లక్షల మంది భారతీయులు క్షేమంగా వెనక్కి వచ్చారని మోదీ తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత లేకుండా చర్యలు చేపట్టామన్నారు. పశ్చిమాసియా పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని చెప్పారు. ఆయిల్, గ్యాస్, ఎరువుల సరఫరాకు హోర్ముజ్ జలసంధి కీలకమని మోదీ చెప్పారు. ఇంధన భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని, దేశంలో 60 శాతం ఒఖఉ ఉత్పత్తి చేస్తున్నామని, 41 దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తున్నామని మోదీ స్పష్టం చేశారు. దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నుల పెట్రోల్ రిజర్వ్ ఉన్నాయని, హోర్ముజ్ నుంచి మరిన్ని నౌకలు భారత్‌కు వస్తున్నాయని మోదీ వెల్లడించారు. రైల్వేల విద్యుదీకరణతో 180 కోట్ల లీటర్ల డీజిల్ ఆదా అయిందని కూడా మోదీ లోక్ సభలో చెప్పారు. ప్రపంచానికి ఆర్థికమాంద్యం ముప్పు పొంచి ఉందన్న ప్రధాని, భారత్‌పై మాంద్యం ప్రభావం పడకుండా చూస్తున్నామని, ఎలాంటి సంక్షోభాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని మోదీ అన్నారు. ఖరీఫ్‌లో రైతులకు డీజిల్ కొరత లేకుండా చూస్తున్నామని, పవర్ ఎ÷-లాంట్స్‌కు కావాల్సినంత బొగ్గు నిల్వలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. గల్ఫ్ సంక్షోభంపై పార్లమెంట్ మొత్తం ఒకే గళం వినిపించాలని మోదీ ఈ సందర్భంగా కోరారు. పశ్చిమాసియా సంక్షోభం.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై, ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. భారత్‌కు కూడా సవాళ్లు ఎదురవుతున్నాయి. మనకు ఎక్కువగా గల్ఫ్ నుంచే ముడిచమురు, గ్యాస్ వస్తోంది. యుద్ధం వల్ల ఇతర దేశాలతో జరిగే వాణిజ్యం దెబ్బతింటోంది. పశ్చిమాసియా ప్రాంతంలో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తున్నారు. వాణిజ్య నౌకల్లోనూ అనేకమంది భారతీయ సిబ్బంది పనిచేస్తున్నారు. వారికి అవసరమైన సాయం అందిస్తున్నాం. భారత దౌత్య కార్యాలయాలు సాధ్యమైనంత తోడ్పాటు అందిస్తున్నాయి. ఈ ప్రాంతంలోని దేశాధినేతలతో ఇప్పటికే రెండుసార్లు మాట్లాడాను అని అన్నారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో భారతీయుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. యుద్ధం మొదలైనప్పటి నుంచి 3.75 లక్షల మంది భారతీయులు అక్కడి నుంచి స్వదేశానికి చేరుకున్నారు. అదేవిధంగా దాదాపు వెయ్యిమంది విద్యార్థులు తిరిగి వచ్చారు. పశ్చిమాసియా పరిణామాల విషయంలో కేంద్రం ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. అన్ని విధాలా సహాయం అందించడానికి సిద్ధంగా ఉందని అన్నారు.

## రైలు ప్రమాదాలకు 'కవచ్' అడ్డుకట్ట...

(మొదటిపేజీ తరువాయి)
మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ప్రయాగ్‌రాజ్, కాన్పూర్ మధ్య సుమారు 190 కిలోమీటర్ల మార్గంలో ఈ వ్యవస్థను యాక్టివేట్ చేశారు. రైలు నంబర్ 14163 ద్వారా ఈ వ్యవస్థను అమలులోకి తీసుకురాగా, జనరల్ మేనేజర్ స్వయంగా సుబేదార్‌గంజ్ నుంచి మనౌరీ స్టేషన్ వరకు ఫుట్‌ప్లేట్ తనిఖీ నిర్వహించి పనితీరును సమీక్షించారు. డివిజనల్, హెడ్ క్వార్టర్స్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'కవచ్' వ్యవస్థ, మానవ తప్పిదాల వల్ల జరిగే ప్రమాదాలను నివారించడానికి రూపొందించబడింది. లోకో పైలట్ పొరపాటున రెడ్ సిగ్నల్ దాటినా, ఈ వ్యవస్థ ఆటోమేటిక్‌గా బ్రేకులు వేసి రైలును నిలిపివేస్తుంది. రైలు వేగాన్ని, సిగ్నళ్లను నిరంతరం పర్యవేక్షిస్తూ భద్రతను నిర్ధారిస్తుంది. ఈ వ్యవస్థతో గంటకు 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడపడం సాధ్యమవుతుంది.

తొలి దశలో చౌరీ చౌరా ఎక్స్‌ప్రెస్‌తో సహా 8 జతల రైళ్లకు ఈ సేవలను అందిస్తారు. రాబోయే నెలల్లో వందే భారత్ సర్వీసులతో పాటు మరిన్ని రైళ్లకు దీన్ని విస్తరించనున్నారు. ఈ వ్యవస్థను ప్రారంభించడానికి ముందు, రైల్వే శాఖ విస్తృతమైన ట్రయల్స్ నిర్వహించింది. వ్యాప్-7 ఇంజిన్లు, ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు, 20 కోచ్‌ల వందే భారత్ రైలుతో ట్రయల్స్ జరిపి, విశ్వసనీయతను నిర్ధారించుకున్నారు. 20,000 కిలోమీటర్లకు పైగా ప్యాసింజర్ ట్రయల్స్ కూడా ఎలాంటి సమస్యలు లేకుండా విజయవంతంగా పూర్తిచేశారు.

ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఢిల్లీ-ముంబై, ఢిల్లీ-హౌరా కారిడార్‌లలోని కీలక సెక్షన్లతో కలిపి 1,450 కిలోమీటర్ల మార్గంలో 'కవచ్' వెర్షన్ 4.0ను ఏర్పాటు చేశారు. 'మిషన్ రఫ్తార్'లో భాగంగా తదుపరి దశలో ఘజియాబాద్-తుండ్లా సెక్షన్‌లో ఈ వ్యవస్థను ప్రవేశపెట్టనున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు.

## ఇరాన్‌లోని 'గౌరవనీయ వ్యక్తి'తో చర్చలు జరుపుతున్నాం

(మొదటిపేజీ తరువాయి)
పామ్ బీచ్‌లో తన అధికారిక విమానం 'ఎయిర్ ఫోర్స్ వన్' ఎక్కే ముందు ఆయన మీడియాతో మాట్లాడారు. ఇరాన్‌తో యుద్ధానికి ముగింపు పలికే ఒక ఒప్పందం కుదిరేందుకు బలమైన అవకాశం ఉందని ట్రంప్ తెలిపారు. ఈ ఒప్పందం కోసం ఇరు దేశాల మధ్య 15 అంశాలపై చర్చలు జరుగుతున్నాయని, ఇందులో ఇరాన్ అణు ఆయుధాలను పూర్తిగా వదులుకోవడం తమ మొదటి మూడు ప్రాధాన్యతలలో ఒకటిగా ఉందని ఆయన వివరించారు. "ఒప్పందానికి చాలా బలమైన అవకాశం ఉంది, కానీ దేనికీ గ్యారెంటీ లేదు. ఇరు పక్షాల మధ్య చాలా అంశాలపై ఏకాభిప్రాయం కుదిరింది" అని అన్నారు. ఈ చర్చల్లో తన సలహాదారు స్టీవ్ విట్కాఫ్, అల్లుడు జారెడ్ కుష్నర్ కూడా పాలుపంచుకుంటున్నారని తెలిపారు.

ఈ చర్చల కోసం ఇరానే తమను సంప్రదించిందని, తాము కాదని ట్రంప్ స్పష్టం చేశారు. "సుమారు 10 బిలియన్ డాలర్ల వ్యయంతో నిర్మించిన ఇరాన్‌లోని అతిపెద్ద విద్యుత్ కేంద్రాన్ని పేల్చివేయడానికి మేము సిద్ధమయ్యాం. కానీ చివరి నిమిషంలో వారే ఫోన్ చేసి డీల్ కోరారు. మేం కూడా ఒప్పందానికి సిద్ధంగా ఉన్నాం. కానీ అది మంచి ఒప్పందమై ఉండాలి. ఇకపై యుద్ధాలు, అణు ఆయుధాలు ఉండకూడదు. ఒప్పందం కుదిరితే ఇరాన్ వద్ద ఉన్న యురేనియం మేం తీసుకుంటాం" అని ట్రంప్ అన్నారు.

చర్చల పురోగతిని చూసేందుకు ఇరాన్‌పై దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. "ఈ ఐదు రోజుల్లో చర్చలు సఫలమైతే అంతా సర్దుకుంటుంది. లేదంటే, మా పని మేం చేసుకుంటూ బాంబులు వేస్తూనే ఉంటాం" అని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఈ ఒప్పందం గనుక కార్యరూపం దాల్చితే, అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు బాగా పడిపోతాయని అన్నారు. మధ్యప్రాచ్యంలోని తమ భాగస్వామ్య దేశాల ప్రయోజనాలను కూడా ఈ చర్చల్లో దృష్టిలో ఉంచుకున్నామని ట్రంప్ పేర్కొన్నారు.

## డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా పార్టీలకు ప్రచారం

### కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

### దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో ఉచిత ప్రసారం

**న్యూఢిల్లీ, మార్చి23 (ప్రజా ప్రతిభ):** నాలుగు అసెంబ్లీ ఎన్నికల వేళ భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలకు ఉచిత ప్రసార సమయం కోసం డిజిటల్ వోచర్లను కేటాయిస్తున్నట్టు ప్రకటించింది. దూరదర్శన్, ఆల్ ఇండియా రేడియోలో మాత్రమే ఈ ఉచిత ప్రసార అవకాశం ఉంటుంది. త్వరలో అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ ఉచిత ప్రసార అవకాశం కల్పించింది.

ప్రజాప్రాతినిధ్య చట్టం 1951లోని 39ఏ సెక్షన్ కింద రాజకీయ పార్టీలకు ఈ అవకాశం కల్పిస్తున్నట్టు ఈసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలకు ఐటీ ఎ÷-లాట్‌ఫాం ద్వారా ఈ డిజిటల్ టైమ్ వోచర్లు జారీ చేస్తున్నట్టు పేర్కొంది. ఈ బ్రాడ్‌కాస్ట్ విండో అభ్యర్థుల జాబితా విడుదలైన తేదీ నుంచి ప్రారంభమై పోలింగ్‌కు రెండ్రోజుల ముందు వరకూ కొనసాగుతుందని తెలిపింది. రాష్ట్ర/యూటీ స్థాయిలో పారదర్శకంగా డ్రా నిర్వహించడం ద్వారా బ్రాడ్‌కాస్ట్ స్లాట్‌లు నిర్ధారిస్తారు. ప్రతి పార్టీకి దూరదర్శన్, అల్ ఇండియా రేడియాలో 45 నిమిషాల ఉచిత ప్రసార సమయం కేటాయిస్తారు. గత అసెంబ్లీ సమయంలో పార్టీల పనితీరు ఆధారంగా కూడా అదనపు ప్రసార సమయం కేటాయించే వీలుంటుంది. సాంకేతిక, రెగ్యులేటరీ ప్రమాణాలకు అనుగుణంగా రాజకీయ పార్టీలు ట్రాన్స్‌క్రిప్టులు, రికార్డింగ్‌లను ముందుగానే సమర్పించాల్సి ఉంటుంది. ఆయా రాజకీయ పార్టీలు తమ అభిప్రాయాలను సమష్టిగా వ్యక్తం చేసేందుకు వీలుగా ప్రసార భారతి ప్యానల్ డిస్కషన్లు, డిబేట్లను కూడా నిర్వహిస్తుంది. చిత ప్రసార సమయం కేటాయింపు ద్వారా రాజకీయ పార్టీలు తమ విధానాలను, ప్రచారాన్ని ప్రజల్లోకి సులభంగా తీసుకువెళ్లవచ్చని ఈసీఐ భావిస్తోంది. ఇది

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పెంచి, సమాన అవకాశాలు కల్పించే డిజిటల్ చొరవగా పేర్కొంటోంది. ఇటీవల ఐదు రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ ప్రకటించింది. కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఒకే దశలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుండగా, తమిళనాడులో ఏప్రిల్ 23న పోలింగ్ జరుగుతుంది. పశ్చిమబెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ ఉంటుంది. నాలుగు రాష్ట్రాలు, పుదుచ్చేరిలో మే 4న ఫలితాలు వెలువడతాయి.

## ఐకానిక్ టవర్‌గా అసెంబ్లీ నిర్మాణం

(మొదటిపేజీ తరువాయి)
వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రపంచంలోని ఉత్తమ అసెంబ్లీ భవనాల్లో ఒకటిగా ఇది నిలుస్తుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

అసెంబ్లీ, హైకోర్టుతో పాటు మరో ఐదు ఐకానిక్ టవర్లను అత్యద్భుతంగా నిర్మిస్తున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. ఐకానిక్ భవనాలు కాబట్టి సాధారణ భవనాల కంటే వీటికి ఖర్చు కొంత ఎక్కువగా

ఉంటుందని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోని ఐకానిక్ భవనాల రేట్లతో పోల్చి వీటిని చూస్తున్నామని, ఎస్ఆర్ (÷ూఖీ) రేట్ల ప్రకారం నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాజధాని పనుల కోసం భారీ ఎత్తున నిధులను ప్రభుత్వం సమకూర్చుకుంటోందని మంత్రి నారాయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 15 వేల కోట్లు, హడ్కో ద్వారా మరో రూ. 11 వేల కోట్లు సమకూర్చుకుంటున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.

## మిట్టల్ స్టీల్‌తో పారిశ్రామిక హబ్‌గా విశాఖ

(మొదటిపేజీ తరువాయి)
ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన జరిగిందని మంత్రి అనగాని వివరించారు. అనకాపల్లి జిల్లా రాజయ్యపేటలో సోమవారం మధ్యాహ్నం కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామితో కలిసి సీఎం చంద్రబాబు ఈ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో పలువురు కేంద్ర మంత్రులతోపాటు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొనున్నారు. ఈ స్టీల్ ప్లాంట్ ద్వారా లక్ష మందికిపైగా ఉపాధి కలగనుంది. ఈ స్టీల్ ఎ÷-లాంట్‌కు అనుబంధంగా రూ.11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్ట్ ఏర్పాటు చేయనున్నారు. దీంతో మరో 6 వేల ఉద్యోగాలు క్యాప్టివ్ పోర్ట్ ద్వారా రానున్నాయి. ఇక ఈ స్టీల్ ఎ÷-లాంట్ ద్వారా లక్ష మందికిపైగా ఉపాధి కలగనుంది.

https://prajaprathibha.com
RNI: APTEL 2013/54721
ప్రజా ప్రతిభ
ఆంధ్రప్రదేశ్ జిల్లాలు
AndhrapradeshDistricts
Praja Pratibha News
మంగళవారం
24 మార్చి 2026

# భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమాలు చేస్తాం

**- యువత ఆదర్శప్రాయుడు భగతసింగ్**

**- భగత్ సింగ్ ఆశయాలను సాధిస్తాం**

**- విప్లవ కెరటాలు భగత్ సింగ్ రాజ్ గురు, సుఖదేవ్‌ల**

**95 వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు**

**అర్పించిన పి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ .ఎం .డి .రఫీ**



**నంద్యాల, మార్చి 23,(ప్రజా ప్రతిభ )**

స్థానిక నంద్యాల పట్టణం సాయిబాబా నగర్ సమీపంలో ఉన్న పి.డి.ఎస్.యు కార్యాలయంలో సోమవారం సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ ల వర్ధంతి సందర్భంగా పి.డి.ఎస్.యు నంద్యాల పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వారి చిత్ర పటాలకు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించా రు. ఈ సందర్భంగాపి.డి.ఎస్.యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్.యం.డి.రఫీ మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదులను గడగడలాడించిన వ్యక్తి సర్దార్ భగత్ సింగ్ అని స్వాతంత్రం మా జన్మహక్కుని బ్రిటిష్ పార్లమెంట్ మీద ఒక మందు గుండు బాంబును విసిరి తన నిరసన తెలిపిన వ్యక్తి భగత్ సింగ్ అని ఉద్ఘట్టించారు,అత్యంత చిరుప్రాయంలో 22 ఏళ్ల వయసులో భారతదేశం కోసం తన ప్రాణాల సైతం లెక్కచేయకుండా ఉరి కంబాన్ని ముద్దాడిన విప్లవ వీర కిశోరాలు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్, ఆశయాల కోసం పి.డి.ఎస్.యు నిరంతరం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. బ్రిటిష్ సామ్రాజవాదుల నుండి మాతృభూమి విముక్తి కోసం ఎందరో వీరులు తమ ప్రాణాలను తృణపాయంగా అర్పించారని, వారిలో అగ్ర ఘన్యులు కామ్రేడ్ భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవ్ లని, 1931 మార్చి 23న బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వీరి ముగ్గురిని క్రూరంగా ఉరితీసారన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు నాడు ప్రవేశపెట్టిన మోకాలే విద్యా విధానమే నేటికీ కొనసాగుతుందన్నారు. విద్య సామాజిక అవసరాలకు కాకుండా కార్పొరేట్ కాషాయ శక్తుల అవసరాలకు అనుకూలంగా నేడు విద్యారంగాన్ని కాషాయ పాలకుల మారుస్తున్నారుని కేంద్ర 20 శాతం రాష్ట్ర బడ్జెట్ 30 శాతం జీడిపిలో 6శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా ఆ నిధులను కేటాయించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షులు షైక్ షాహీద్, పట్టణ కార్యదర్శి లక్ష్మీకాంత్ ,నంద్యాల పట్టణ నాయకులు సుభాన్, హరి, నాయక్, కిరణ్, వినయ్, బాలాజీ, ధను, తదితరులు పోల్గొన్నారు .

# పరీక్షా కేంద్రాల తనిఖీ చేసిన ఐటీడీఏ పీఓ

**- జీలుగుమిల్లిలో 10వ తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్ష**

**- బర్రింకలపాడు, జీలుగుమిల్లి కేంద్రాల సందర్శన**

**- సౌకర్యాలు, భద్రత, నిర్వహణపై అధికారుల పరిశీలన**



**జీలుగుమిల్లి, మార్చి 23 (ప్రజా ప్రతిభ) :**

జీలుగుమిల్లి మండలంలో నిర్వహిస్తున్న 10వ తరగతి ప్రజా పరీక్షల నిర్వహణను పరిశీలించేందుకు ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ కె. రాములు నాయక్ పరీక్షా కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎ.పి.టి.డబ్ల్యు.ఆర్ పాఠశాల, బర్రింకలపాడు మరియు జిల్లా పరిషత్ పాఠశాల, జీలుగుమిల్లి కేంద్రాలను పరిశీలించారు. పరీక్షలు సక్రమంగా జరుగుతున్నాయా అనే అంశంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు.సందర్శనలో భాగంగా పరీక్షా కేంద్రాలలో చేపట్టిన ఏర్పాట్లు, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, ప్రశ్నాపత్రాల భద్రతా చర్యలు, పరీక్షల నిర్వహణ విధానం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించబడుతున్నాయని ఆయన గమనించారు. కేంద్రాల వద్ద నిర్వహణ సంతృప్తికరంగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పరీక్షా సిబ్బంది తమ విధులను నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా నియమ నిబంధనలను పాటిస్తూ పరీక్షలను నిర్వహించాల్సిందిగా ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.అలాగే పరిశుభ్రత, త్రాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్షలు రాసే వాతావరణం కల్పించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ మెరుపుదాడులు

**- అనధికార నగదు స్వాధీనం**

**- ఫోన్‌పే లావాదేవీలు బట్టబయలు**







**నంద్యాల, మార్చి 23, (ప్రజా ప్రతిభ )**

నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సంచలన మెరుపుదాడులు నిర్వహించారు. విజయవాడ, కర్నూలు నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు సమన్వయంతో కార్యాలయాన్ని చుట్టుముట్టి ఆకస్మికంగా సోదాలు చేపట్టడంతో ఒక్కసారిగా కలకలం రేగింది.అక్రమ రిజిస్ట్రేషన్లు, అనుమానాస్పద లావాదేవీలు జరుగుతున్నాయన్న పలు ఫిర్యాదుల నేపథ్యంలో ఈ దాడులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. భూముల కొనుగోలు, అమ్మకాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘించి అవినీతి జరిగిందన్న ఆరోపణలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు.సోదాల సమయంలో కార్యాలయంలో అనధికారికంగా ఉంచిన రూ.16 వేల నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఫోన్‌పే ద్వారా జరిగిన పలు లావాదేవీలను గుర్తించి వాటిపై విచారణ చేపట్టారు. కార్యాలయంలో ముగ్గురు అనధికార సిబ్బంది పనిచేస్తున్నట్టు గుర్తించారు.కార్యాలయంలో మొత్తం 12 మంది డాక్యుమెంట్ రైటర్లు ఉన్నట్లు ఏసీబీ డీఎస్పీ సోమన్న మీడియాకు తెలిపారు. కీలక రికార్డులు, పత్రాలు, కంప్యూటర్ డేటాను స్వాధీనం చేసుకుని అధికారులు లోతుగా పరిశీలిస్తున్నారు. పలువురు సిబ్బంది, సంబంధిత వ్యక్తులను ప్రశ్నిస్తూ లావాదేవీల వివరాలను ఆరా తీస్తున్నారు.దాడుల సమాచారం బయటకు రాగానే కార్యాలయం పరిసరాల్లో ఉన్న స్టాంప్ రైటర్లు, డాక్యుమెంట్ రైటర్లు హడావుడిగా షాపులు మూసివేసి వెళ్లిపోవడం గమనార్హం.ఈ దాడులతో నంద్యాలలో రిజిస్ట్రేషన్ శాఖలో జరుగుతున్న అక్రమాలపై తీవ్ర చర్చ మొదలైంది. కీలక ఆధారాలు వెలుగులోకి వచ్చే అవకాశముండడంతో మరిన్ని వివరాలు త్వరలో బయటపడనున్నాయి.

# ఫేక్ లోన్ యాప్స్, నకిలీ లింకులపై అప్రమత్తంగా ఉండాలి

**- వాట్సాప్, ఆర్టీఏ చలానా, ఎస్బీఐ యాప్ పేరుతో వచ్చే నకిలీ లింకులపై హెచ్చరిక**

**- ఫేక్ లోన్ యాప్స్ ద్వారా వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం ప్రమాదం**

**- సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్న పోలీసులు**



**జీలుగుమిల్లి, మార్చి 23 (ప్రజా ప్రతిభ) :**

ఫేక్ లోన్ యాప్స్, అనధికార లింకులు, సోషల్ మీడియా ద్వారా వచ్చే మోసపూరిత మెసేజ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీలుగుమిల్లి ఎస్ఐ వి. క్రాంతి కుమార్ సూచించారు. ముఖ్యంగా వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా లేదా ఆర్టీఏ చలానా చెల్లించాలంటూ, ఎస్బీఐ యాప్ పేరిట వచ్చే నకిలీ లింకులను ఎవరు ఓపెన్ చేయవద్దని హెచ్చరించారు. ఇటువంటి లింకుల ద్వారా వ్యక్తిగత సమాచారం దొంగిలించి సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయని తెలిపారు.తక్షణ రుణాల పేరుతో వచ్చే ఫేక్ లోన్ యాప్స్ ప్రజలను ఆకర్షించి, వారి వ్యక్తిగత వివరాలను సేకరించి దుర్వినియోగం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ యాప్స్ ద్వారా అధిక వడ్డీ రేట్లు విధించడం, బెదిరింపులు చేయడం, ఫోన్‌లోని కాంటాక్ట్స్, ఫోటోలు వంటి సమాచారాన్ని దుర్వినియోగం చేయడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. అందువల్ల అధికారిక బ్యాంకులు లేదా గుర్తింపు పొందిన ఆర్థిక సంస్థల ద్వారా మాత్రమే రుణాలు పొందాలని సూచించారు.సైబర్ మోసాల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండడం అత్యంత అవసరమని ఎస్ఐ పేర్కొన్నారు. అనుమానాస్పద కాల్స్, మెసేజ్‌లు, లింకులపై స్పందించకూడదని, ఎలాంటి మోసం జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా సమాచారం, ఓటీపీ వంటి వివరాలను ఎవరితోనూ పంచుకోకూడదని, డిజిటల్ లావాదేవీల్లో జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# భద్రాచలం పాదయాత్రికులకు మజ్జిగ పంపిణీ - భద్రతపై అవగాహన





**జీలుగుమిల్లి, మార్చి 23 (ప్రజా ప్రతిభ) :**

భద్రాచలం రామాలయానికి కాలినడకన వెళ్తున్న భక్తులకు మజ్జిగ పాకెట్లను పంపిణీ చేశారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని భక్తులకు శీతల పానీయంగా మజ్జిగ అందించడం ద్వారా వారికి ఉపశమనం కల్పించారు. ఈ సేవా కార్యక్రమానికి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా భక్తులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కాలినడకన ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వాహన రాకపోకల సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంపులుగా ప్రయాణించడం, రోడ్డు పక్కన నడవడం వంటి సూచనలు ఇచ్చారు.జీలుగుమిల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు మరియు సబ్ ఇన్స్పెక్టర్ వి. క్రాంతి కుమార్ మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. భక్తులు తమ ప్రయాణాన్ని సురక్షితంగా కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొని భక్తులతో మాట్లాడి అవగాహన కల్పించారు. భక్తుల భద్రత కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలను వారు అభినందించారు.

# భగత్ సింగ్ ఆశయాలను కొనసాగిద్దాం

**- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా వర్ధంతి వేడుకలు**

**కుక్కునూరు, మార్చి 23 (ప్రజా ప్రతిభ):**

కుక్కునూరు మండలంలో ఏఐఎస్ఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విప్లవ వీరుడు భగత్ సింగ్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ కుక్కునూరు మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య మాట్లాడుతూ భగత్ సింగ్ ఆశయాలను యువత కొనసాగించాలని, దేశభక్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్య సాధన కోసం భగత్ సింగ్, సుఖ్దేవ్, రాజ్ గురులు బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడి, పిన్న వయసులోనే ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి సారంగి శౌర్యతో పాటు ప్రేమ కుమార్, నాగవంశీ, సాయికిరణ్, రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.



## కొత్తవలస పోలీస్ స్టేషనను ఆకస్మికంగా

# సందర్శించిన జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదం






**శృంగవరపుకోట, మార్చి23. ( ప్రజా ప్రతిభ -ఎం. రమణ)**

విజయనగరం జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ ఆదివారం కొత్తవలస పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా సందర్శించి పోలీస్ స్టేషన్లోని వివిధ రికార్డులు, సీడీ ఫైల్స్ ను , స్టేషన్ ప్రాపర్టీ రూమును, స్టేషన్ లాకప్ గదులను, స్టేషన్ ప్రాంగణంలో సీజ్ చేసి ఉన్న వాహనాలను పరిశీలించి, వాటిని చట్ట ప్రకారము త్వరగా డిస్పోస్ చేయాలని అధికారులను ఆదేశించారు. తర్వాత స్టేషన్లో క్రైమ్ చార్ట్ పరిశీలించి పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారి ప్రమాదాలు ఎక్కడ ఎక్కువ జరుగుతున్నది, బ్లాక్ స్పాట్స్ ఎక్కడున్నవి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కొత్తవలస పోలీసులు చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు విసిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని ప్రజలకు రహదారి భద్రత మహిళలు భద్రత పట్ల, సైబర్ మోసాలు పట్ల అవగాహన కల్పించాలన్నారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటించే విధంగా చూడాలని, హెల్మెట్ ప్రాముఖ్యతను ద్విచక్ర వాహనదారులకు వివరించి, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు, దొంగతనాలు నియంత్రణకు పగలు రాత్రి బీట్లను ఏర్పాటు చేయలని, పెట్రోలింగ్ మమ్మురం చేయాలని అధికారులను ఆదేశించారు పోలీస్ సిబ్బంది తరచూ తమకు కేటాయించిన దత్తత కామన్ గ్రామాలను సందర్శించి గ్రామంలో శాంతి భద్రతలను అక్కడ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకొని సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావా లన్నారు అనుమానస్పద వ్యక్తుల కదలికలపై నిరంతరము నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ అధికారులను ఆదేశించారు ఈ యొక్క కార్యక్రమంలో విజయనగరం జిల్లా డీఎస్పీ ఆర్ గోవిందరావు ఎస్. కోట,సిఐ వి.ఎన్. మూర్తి, కొత్తవలస సీఐ షణ్ముఖరావు,ఎస్సై ఏఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గురునాధరావు విగ్రహం ధ్వంసం చేసిన

# వారిని వెంటనే అరెస్టు చేయాలి

## - వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పైలా శ్రీనివాసరావు డిమాండ్

**పరవాడ మార్చి 23 (ప్రజా ప్రతిభ):**

అనకాపల్లి జిల్లా తగరంపూడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి వర్యులు మాజీ పార్లమెంట్ సభ్యులు కాపు నాయకులు స్వర్గీయ గుడివాడ గురునాధరావు విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం అత్యంత హేయమైన దారుణమైన అమానుషమైన పిరికిపందల చర్య అని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు పైల శ్రీనివాసరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ధ్వంసం చేసిన వారిని పోలీసులు వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు ఈ ఘటనను ఖండిస్తూ సమాజానికి సేవ చేసిన మహనీయుడి విగ్రహం పై దాడి చేయడం అనేది కేవలం ఒక వ్యక్తిపై దాడి కాదు ప్రజల భావోద్వేగాలపై విలువలపై దాడి చేసినట్టేనని ఆయన పేర్కొన్నారు ఇటువంటి ఘటనలు అనకాపల్లి వంటి శాంతియుత ప్రాంతంలో జరగడం బాధాకరం అని అన్నారు. ఈ ఘటన వెనుక కుట్ర కోణం ఉండే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేస్తూ బాధ్యుల్ని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు వారిని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా విగ్రహాన్ని ధ్వంసం చేసిన స్థలంలోనే తక్షణమే పునర్నిర్మాణం చేసి శాంతి భద్రతలను కాపాడాలని కోరారు.ప్రజల్లో కలహాలు రేపడానికి శాంతిభద్రతలను భంగం చేసేందుకు కొన్ని అరాచక శక్తులు ప్రయత్నిస్తున్నాయని అలాంటి దుష్ప్రవర్తనలను ప్రజలు ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం పోలీస్ యంత్రాంగాన్ని ఆయన హెచ్చరించారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే స్థానిక నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పోలీస్ స్టేషన్ను ఆశ్రయించి ఫిర్యాదు చేయడం జరిగిందని, ప్రజాస్వామ్య



పద్ధతిలో న్యాయం సాధిస్తామని ఆయన తెలిపారు. ప్రజలందరూ శాంతిని కాపాడుతూ ఎటువంటి అపోహలకు లోనుకాకుండా బాధ్యతగా వ్యవహరించాలని పైల శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు స్వాగతం

## పలికిన జనసేన నియోజకవర్గ ఇన్చార్జి సూర్యచంద్ర



**నాతవరం, మార్చి,23,(ప్రజా ప్రతిభ)**

నక్కపల్లి ప్రాంతంలో ఆర్సెలర్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ భాగస్వామ్యంతో సుమారు 1.49 లక్షల కోట్లు ఖర్చుతో నిర్మిస్తున్న ఉక్కు కర్మాగార సభ ప్రాంగణానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు కొణిదల పవన్ కళ్యాణ్ విచ్చేశారు. ఈ సందర్భంగా జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీర సూర్యచంద్ర ప్రత్యేకంగా పవన్ కళ్యాణ్ ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ భారీ పారిశ్రామిక ప్రాజెక్ట్ ఉత్తరాంధ్ర ప్రాంతంలో అభివృద్ధికి తోడ్పడే విధంగా, వేలాది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనుందని సూర్యచంద్ర అన్నారు. సూర్యచంద్ర వెంట జిల్లా కార్యదర్శి పంచాడ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్: సీఎం, ఎన్డీయేపై

## నమ్మకంతో భూములిచ్చిన రైతులు

### - హోంమంత్రి అనిత నమ్మకంరి భవిష్యత్ త్యాగం




**నక్కపల్లి, మార్చి 23, (ప్రజా ప్రతిభ) :**

అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు భూసేకరణ వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎన్డీయే ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతోనే రైతులు తమ భూములను త్యాగం చేశారని హోంమంత్రి అనిత వ్యాఖ్యానించారు."తమ బిడ్డల భవిష్యత్ మారబోతుందని అపారమైన విశ్వాసంతోనే రైతులు తరతరాల నుంచి తమ వద్ద ఉన్న భూములను అప్పగించారు" అని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, ఈ ప్రాంత అభివృద్ధికి ఇది దోహదపడుతుందని ప్రభుత్వం తరపున హామీ ఇచ్చారు.అయితే, ఈ భూసేకరణ విషయంలో రైతులకు సరైన పరిహారం, పునరావాసం కల్పించాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. ప్రభుత్వం రైతుల త్యాగాన్ని గుర్తించి, వారికి తగిన న్యాయం చేకూరుస్తుందని, ఆయా కుటుంబాలకు భరోసా కల్పిస్తుందని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా పారిశ్రామిక అభివృద్ధి, ఆర్థిక పురోగతి సాధ్యమవుతాయని, అయితే రైతుల సంక్షేమాన్ని విస్మరించబోమని ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి.ఈ ప్రాజెక్టు అనకాపల్లి జిల్లా రూపురేఖలను మారుస్తుందని, మౌలిక వసతుల కల్పన, ఉపాధి అవకాశాల కల్పనలో కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ఇచ్చే హామీలను ఎంతవరకు నెరవేరుస్తుందో వేచి చూడాలి.

## ఎస్.కోట ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి

## కీలక నిర్ణయాలు తీసుకున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి





**శృంగవరపుకోట మార్చి 23. (ప్రజా ప్రతిభ -ఎం. రమణ )**

శృంగవరపుకోట ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతుల కల్పనపై సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం అందించడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యతని ఎమ్మెల్యే ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆస్పత్రి ప్రగతికి సంబంధించి పలు కీలక తీర్మానాలకు ఈ సమావేశంలో ఆమోదం తెలిపారు. ముఖ్యంగా ఆస్పత్రి మెయిన్ రోడ్డులోని సూర్యుడి ఆలయం నుండి ఆస్పత్రి వరకు పంచాయతీ రోడ్డును నిర్మించాలని, అలాగే ఆస్పత్రి చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం, శానిటేషన్ మెరుగుదల, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ మరియు ఎలక్ట్రికల్ పనులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమం మరియు భద్రతపై కూడా ఎమ్మెల్యే కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కంప్యూటర్ ఆపరేటర్ల వేతనాన్ని రూ. 11,500 నుండి రూ. 14,500కు పెంచుతూ తీర్మానం చేశారు. అలాగే ఆస్పత్రి ప్రాంగణంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు సెక్యూరిటీ గార్డుల సంఖ్యను పెంచాలని నిర్ణయించారు. దీనిపై సంబంధిత సెక్యూరిటీ ఏజెన్సీతో మాట్లాడి తక్షణమే అదనపు సిబ్బందిని కేటాయించాలని గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆస్పత్రిని అన్ని సౌకర్యాలతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని, రోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ గొర్రుపోటు సింహాచలం నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు డోకుల చిన్న అచ్చం నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ రెడ్డి వెంకన్న మరియు హాస్పిటల్ సిబ్బంది అధికారులు, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## అక్కయ్యపాలెం సచివాలయంలో

## లంచం తీసుకుంటూ సెక్రటరీ అరెస్ట్

### - రూ.80 వేల లంచం

### తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పైలా రాజేష్





**విశాఖపట్నం, మార్చి 23 (ప్రజా ప్రతిభ):**

విశాఖపట్నంలోని అక్కయ్యపాలెం సచివాలయం పరిధిలో ఏసీబీ అధికారులు నిర్వహించిన దాడుల్లో వార్డు ఎడ్యుకేషన్ కం డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ పైలా రాజేష్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.లలితా నగర్‌కు చెందిన ద్వారాపురెడ్డి గంగరాజ్యం తన కుమారుడు గణేష్ పేరపై ఉన్న స్థిరాస్తి సెటిల్‌మెంట్ డీడ్ ప్రాసెస్ చేయించుకోవడానికి రాజేష్‌ను సంప్రదించగా, ఆయన రూ.90 వేల లంచం డిమాండ్ చేశాడు. చివరకు రూ.80 వేలకి ఒప్పందం కుదిరింది.లంచం ఇవ్వడం ఇష్టం లేని గణేష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో, వారు పన్నిన ఉచ్చులో రాజేష్ లంచం స్వీకరిస్తుండగా పట్టుబడ్డాడు. అనంతరం అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచనున్నారు.ఈ దాడుల్లో డీఎస్పీలు రమణమూర్తి, హర్షిత, సీఐలు శ్రీనివాస్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. అవినీతి సంబంధిత ఫిర్యాదుల కోసం 1064 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

https://prajaprathibha.com RNI: APTEL 2013/54721
ప్రజా ప్రతిభ
ప్రతి అక్షరం ప్రజా పక్షం   తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ జిల్లాలు
AndhrapradeshDistricts
Praja Pratibha News
మంగళవారం
24 మార్చి 2026

## ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ఇండియా ప్లాంటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన





**నక్కపల్లి, మార్చి 23, (ప్రజా ప్రతిభ) :**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం రాష్ట్రంలో అతిపెద్ద ఉక్కు ప్లాంట్ అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో శంకుస్థాపన చేశారు. ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ఇండియా సంయుక్తంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు రాష్ట్ర పారిశ్రామిక రంగానికి కొత్త ఊపిరి పోయనుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కుమార స్వామి, శ్రీనివాస వర్మ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేష్, టీజీ భరత్, అచ్చెన్నాయుడు, అనితతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.ఆర్సెలార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ నారాయణ మిట్టల్,ఆమ్/ఎన్ఎస్ ఇండియా ఛైర్మన్ ఆదిత్య మిట్టల్, నిప్పన్ స్టీల్ ఇండియా ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ కూడా ఈ చారిత్రక ఘట్టానికి హాజరయ్యారు. శంకుస్థాపన అనంతరం ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఆమ్/ఎన్ఎస్ మినియేచర్ నమూనా స్టీల్ ప్లాంట్ ను ఆసక్తిగా తిలకించారు.

**రాష్ట్రానికి భారీ పెట్టుబడులు, లక్షలాది ఉద్యోగాలు:**
రూ.1.36 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో రాష్ట్రంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్సెలార్ మిట్టల్ ప్రకటించింది. ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మించనున్న ఈ ప్లాంటు ద్వారా లక్ష మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.
రెండు దశల్లో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ను ఏర్పాటు చేయనున్న ఆమ్/ఎన్ఎస్ ఇండియా, దీనికి అనుబంధంగా రూ.11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్ట్ ను కూడా నిర్మించనుంది. ఈ పోర్ట్ ద్వారా అదనంగా 6 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

**విశాఖ ఎకనమిక్ రీజియన్ కు కొత్త శోభ:**
ఆమ్/ఎన్ఎస్ ఇండియా రాకతో విశాఖ ఎకనమిక్ రీజియన్ పారిశ్రామిక హబ్‌గా మారనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ ఉక్కు మార్కెట్‌లో ఆమ్/ఎన్ఎస్ ఇండియా కీలక పాత్ర పోషించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంటుకు అనుసంధానంగా 16వ నెంబరు జాతీయ రహదారితో కలిపేలా 4 లేన్ల రహదారి విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇది రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరచనుంది..

# పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు కల్పించాలి

- కాంగ్రెస్ నేత "జగతా శ్రీనివాస్" డిమాండ్
- పాయకరావుపేటలో నెలకొంటున్న పరిశ్రమల్లో స్థానికులకు అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వ వైఫల్యంపై పీసీసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఆగ్రహం



**నక్కపల్లి, మార్చి 23, (ప్రజా ప్రతిభ) :**
పాయకరావుపేట నియోజకవర్గంలో కొత్తగా ఏర్పాటవుతున్న, ఇప్పటికే కొనసాగుతున్న పరిశ్రమలలో స్థానిక నిరుద్యోగులకే అధిక సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జగతా శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తున్న భారీ రాయితీలకు తగ్గట్టుగా, స్థానిక ప్రజలకు ప్రయోజనం చేకూరడం లేదని తీవ్ర స్థాయిలో విమర్శించారు.

**రాయితీలు పొందుతున్న పరిశ్రమలు, విస్మరించబడుతున్న స్థానికులు:**
నక్కపల్లి మండలంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు కానున్న ఆర్సిల్లర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటును స్వాగతిస్తున్నామని శ్రీనివాస్ తెలిపారు. అయితే, పరిశ్రమలకు ప్రభుత్వం అనేక రకాల రాయితీలు కల్పిస్తున్నప్పటికీ, ఈ పరిశ్రమలు చుట్టుపక్కల గ్రామాల అభివృద్ధికి కానీ, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి కానీ పెద్దగా ఆసక్తి చూపడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏర్పాటు చేసిన డక్కన్, హెటెరో వంటి పరిశ్రమలు కూడా స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వడంలో విఫలమయ్యాయని ఆయన గుర్తు చేశారు. "స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు గుప్పించి పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు, కానీ ఆచరణలో మాత్రం అవి నెరవేరడం లేదు" అని జగతా శ్రీనివాస్ అన్నారు.

**వలసలు పెంచుతున్న నిర్లక్ష్యం:**
పరిశ్రమల యాజమాన్యాలు స్థానికులను విస్మరించి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఉద్యోగాలు ఇస్తున్నాయని, ఫలితంగా స్థానిక యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళాల్సి వస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది స్థానిక ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు.

**ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోవాలి:**
నియోజకవర్గంలో కొత్తగా రానున్న స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పరిశ్రమలతో పాటు, ప్రస్తుతం ఉన్న పరిశ్రమలలోనూ స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా పరిశ్రమల యాజమాన్యాలపై ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని జగతా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, మరియు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తక్షణమే జోక్యం చేసుకోవాలని, స్థానిక నిరుద్యోగులకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ స్థానికులకు మద్దతుగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని ఆయన హెచ్చరించారు.

# ఉరి తాళ్లతో జీడీ రైతుల ఆందోళన

- ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్
- కేజీకి రూ.200 మద్దతు ధర ప్రకటించాలని విజ్ఞప్తి
- పంటల భీమా చెల్లింపులపై రైతుల ఆగ్రహం
- అప్పుల పాలైన గిరిజన రైతుల ఆవేదన



**దేవరాపల్లి, మార్చి 23(ప్రజా ప్రతిభ):**
అకాల వర్షాలు, మంచు తెగుళ్లతో జీడీ పంట పూర్తిగా దెబ్బతినడంతో గిరిజన రైతుల జీవితం సంక్షోభంలో పడింది. ప్రభుత్వం స్పందించకపోతే ఉరి తాళ్లే శరణ్యమని హెచ్చరిస్తూ దేవరాపల్లి మండలం వాలాబు పంచాయతీలో రైతులు అర్ధనగ్నంగా ఉరి తాళ్లు మెడకు వేసుకుని నిరసన చేపట్టారు. ఈ ఘటన ప్రాంతంలో తీవ్ర కలకలం రేపింది. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వెంకన్న, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బిటి దొర రైతులకు మద్దతుగా పాల్గొని మాట్లాడారు. ఈ సంవత్సరం అకాల వర్షాలు, మంచు తెగుళ్లతో జీడీ తోటలు పూర్తిగా నాశనమయ్యాయని,ఏడాది పాటు ఈ పంటపైనే ఆధారపడే గిరిజన రైతులు అప్పుల పాలయ్యారని తెలిపారు. జీడీ పంట నష్టానికి ఎకరాకు కనీసం రూ.30 వేల పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నక్కపల్లి పర్యటన సందర్భంగా ఈ సమస్యపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. జిల్లాలో వరి తర్వాత ప్రధానంగా సాగు చేసే పంట జీడీ అని, అలాంటి పంటను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. జీడీ పిక్కలకు కేజీకి కనీసం రూ.200 మద్దతు ధర ప్రకటించి ఆర్.ఎస్.కే కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని రైతులు కోరారు. ప్రస్తుత ధరలు ఖర్చులకు కూడా సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.గత ఐదేళ్లుగా వాతావరణ మార్పులు, పొగమంచు, తెగుళ్లు కారణంగా పంటలు తీవ్రంగా నష్టపోతున్నప్పటికీ భీమా కంపెనీలు పరిహారం చెల్లించడం లేదని రైతులు ఆరోపించారు. రైతులు లక్షల రూపాయలు ప్రీమియంగా చెల్లించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లింపులు లేకపోవడంతో భీమా సొమ్ములు అందడం లేదన్నారు. ఒక ఎకరాకు రూ.40 వేల వరకు ఖర్చు పెట్టినా పంట నిలబడక రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో అనేక మంది రైతులు జీడీ తోటలను పూర్తిగా తొలగించే దశకు చేరుకున్నారని తెలిపారు.వ్యవసాయ అధికారులు గ్రామాలకు వెళ్లి పంట నష్టాలను అంచనా వేసి వెంటనే పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. పంటల భీమాను ఉచితంగా అమలు చేయాలని, ప్రభుత్వం స్వయంగా జీడీ కొనుగోలు చేయాలని కోరారు. లేనిపక్షంలో మరింత తీవ్రమైన ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ లక్ష్మణ్, కాశి ఈశ్వరరావు, కె. సుధాకర్, చిన దేముడు, నాగేశ్వరరావు, గోపాలుడు, రాము, దేముడు, ఎర్రయ్య, సోమయ్య, మామిడి దేముడు, ఎరకయ్య, శ్రీరామ్, మహాలక్ష్మినాయుడు, కృష్ణ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో గిరిజన జీడీ రైతులు పాల్గొన్నారు.

## కాఫీ రైతుల కాపీ పంటను జిసిసి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి

- పెట్రోల్ బంక్ నుండి జిసిసి కార్యాలయానికి ర్యాలీ నిర్వహించిన గిరిజన రైతులు





**అల్లూరి జిల్లా గూడెం కొత్త వీధి మార్చి 23 ప్రజాప్రతిభ**
కాఫీ రైతులకు న్యాయం చేయాలని కోరుతూ జిసిసి ఆఫీసు ముందు ఆందోళన చేస్తున్న కాఫీ రైతులు జికెవీధి మండలనకు చెందిన కాఫీ రైతులు పెట్రోల్ బంక్ నుంచి జిసిసి ఆఫీసు వరకు ర్యాలీగా వెళ్లి, ధర్నా చేశారు ఈకార్యక్రమంలో పాల్గొన్న గాలి కొండ ఎం పిటిసి అంపురంగి బుజ్జి బాబు మాట్లాడుతూ కాఫీ రైతులు పండించిన కాఫీ కిలోకి 270రూపాయిలు కొనుగోలు చేయాలని ఎపెక్స్, కమిటీ నిర్ణయం చేసారు. కానీ రైతులు దగ్గర జిసిసి అధికారులు కొనుగోలు చేయడం లో నిర్లక్ష్యం చేయడం వలన దాలరిల వద్ద నష్ట పోయారని అన్నారు. జిసిసి అధికారులు వలన రైతులు కేజీకి 40, నుంచి 50రూపాయిలు నష్ట పోయారు. కావున జిల్లా కలెక్టర్, పిఒ, గిరిజన సహకార సంస్థ చైర్మన్ శ్రావణ కుమార్ గారు, తక్షణమే స్పందించి ఎపక్స్, కమిటీ ప్రకటించిన ధరకే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు అలాగే రైతులకు ఇచ్చిన ఋణాలు రద్దుచేయాలని, కోరారు ఈకార్యక్రమంలో కాఫీ రైతులు వండలం బాలయ్య, చంటిబాబు, కాకూరు వెంకటరమణ, బలరాం మూర్తి, కొర్ర భూపతి, విజయప్రసాద్, జనసేన మండల ఉపాధ్యాయులు బత్తూల మార్క్, మరియు వివిధ గ్రామాల నుంచి కాఫీ రైతులు పాల్గొన్నారు.


## అమలగూడ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం చేయాలి

- సిపిఎం పార్టీ మండల నాయకులు, గసబ మాజీ సర్పంచ్ పాంగి. సురేష్ కుమార్ డిమాండ్



**ఆలూరి జిల్లా/ డుంబ్రిగూడ, మార్చి 23(ప్రజా ప్రతిభ)**
ఆలూరి సీతారామరాజు జిల్లా, డుంబ్రిగూడ, మండలం సొవ్వ పంచాయతీ,ఈ సందర్భంగా అమల గూడ గ్రామంలో సందర్శించి మాట్లాడుతూ సొవ్వ పంచాయతీ దేముడు వలస తారు రోడ్డు జంక్షన్ నుండి అమల గూడ గ్రామ సమీపం వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేయాలనీ కోరారు. గతంలో కొంతవరకు సీసీ రోడ్డు నిర్మాణం చేసి మిగతా భాగం వదిలేయడంతో ప్రజలకు కష్టంగా మారిందని చెప్పారు. రోడ్డు సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారనీ చెప్పారు. అధికారులు వెంటనే పరిశీలించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల నాయకులు పాంగి. మత్తు, పంచాయతీ నాయకులు వంతాల. మహేష్, పాంగి. వసంత్ కుమార్, పాంగి. చినబాబు, రెల్లి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం



**గూడెంకొత్తవీధి,మార్చి 23: ప్రజా ప్రతిభ**
కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జీకేవీధి కేజీబీవీ ప్రత్యేక అధికారి నాగలక్ష్మి తెలిపారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం తో పాటు 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల విద్యార్థినుల నుంచి ఆన్లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారని తెలిపారు. ఏప్రిల్ 1 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఏప్రిల్ 13 నుంచి 17 వరకు సంబంధిత కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ధ్రువపత్రాలను పరిశీలించి సీట్లను కేటాయిస్తారని వెల్లడించారు. మధ్యలో చదువు మానేసి మళ్లీ విద్యను కొనసాగించాలనుకునే బాలికలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

# చరిత్రాత్మక ప్రసంగం

## - ఆంధ్రప్రదేశ్‌లో ఉక్కు పారిశ్రామిక విప్లవం ఆరంభం!










**నక్కపల్లి, మార్చి 23, (ప్రజా ప్రతిభ):**

రాష్ట్రంలో ఆర్థిక ప్రగతికి, ఉద్యోగ కల్పనకు ఊతం ఇచ్చే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ పరిశ్రమ శంకుస్థాపన కార్యక్రమంలో కీలక ప్రసంగం చేశారు. కేవలం 20 నెలల స్వల్ప వ్యవధిలోనే 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానం ద్వారా ఈ భారీ పరిశ్రమ ఏర్పాటును సాకారం చేసి చూపించామని ముఖ్యమంత్రి సగర్వంగా ప్రకటించారు. ఈ చారిత్రాత్మక సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ఈ బృహత్ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ ప్రాజెక్టును విజయవంతం చేయడంలో కృషి చేసిన ఆదిత్య మిట్టల్, మంత్రి నారా లోకేష్‌లను అభినందిస్తున్నాను. అలాగే, ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం భూమిని ఇచ్చిన రైతులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను" అని అన్నారు. అనకాపల్లిలో కేవలం స్టీల్ ప్లాంట్ మాత్రమే కాదు, స్టీల్ సిటీ!రెండు దశల్లో నిర్మితమయ్యే ఈ ఉక్కు పరిశ్రమ ద్వారా ఏటా 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. "అనకాపల్లిలో కేవలం స్టీల్ ప్లాంట్‌కు మాత్రమే కాదు, స్టీల్ సిటీకి శంకుస్థాపన జరిగింది" అని పేర్కొన్నారు. ఈ స్టీల్ ప్లాంట్‌తో పాటు, రూ. 11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్టు నిర్మాణం కూడా జరుగుతుందని, ఇది పారిశ్రామిక అభివృద్ధికి మరింత దోహదపడుతుందని వివరించారు. అభివృద్ధి ప్రణాళికలు: • ఉత్పత్తి ఆరంభం: 2028 నాటికి ప్లాంట్‌లో మొదటి దశ ఉత్పత్తి ప్రారంభం లక్ష్యంగా కార్యాచరణ జరుగుతోంది. • బ్లాస్ట్ ఫర్నేస్‌లు: 2030 జూన్ నాటికి మొదటి బ్లాస్ట్ ఫర్నేస్, డిసెంబర్ నాటికి రెండో బ్లాస్ట్ ఫర్నేస్ నిర్మాణం పూర్తవుతుంది. • రహదారి అనుసంధానం: జాతీయ రహదారిని అనుసంధానిస్తూ నాలుగు లేన్ల రహదారి నిర్మాణం కూడా పూర్తి కానుంది. • ముడి ఇనుము సరఫరా: పరిశ్రమకు ముడి ఇనుము సరఫరా కోసం పైప్‌లైన్ వేయబోతున్నారు.

**ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులకు స్వర్గధామం:**

ఉక్కు ఉత్పత్తి ఒక్కటే కాకుండా, ఆర్థిక లావాదేవీలు, విద్య, వైద్యం, ఉద్యోగాలతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయని చంద్రబాబు నాయుడు అన్నారు. "ఇంత వేగంగా పరిశ్రమకు భూసేకరణ, అనుమతులు ఇచ్చిన ఏకైక రాష్ట్రం దేశంలో ఆంధ్రప్రదేశే" అని ప్రశంసించారు. దేశంలో పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన ప్రాంతం ఆంధ్రప్రదేశేనని, పారిశ్రామిక అనుకూల ప్రభుత్వం, నిపుణులైన మానవ వనరులు తమ రాష్ట్రానికే సొంతమని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు.

**భవిష్యత్ ప్రణాళికలు, భారీ పెట్టుబడులు:**

పర్యాటకం నుంచి డేటా సెంటర్ల వరకూ, ఫుడ్ ప్రాసెసింగ్ నుంచి తయారీ రంగం వరకూ అన్నింటికీ ఏపీలో విస్తారమైన అవకాశాలు ఉన్నాయని, కొత్త ఆలోచనలతో వచ్చి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. "రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా 'వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్' అనే నినాదాన్ని విజయవంతం చేస్తాం" అని తెలిపారు.

విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కాబోతోందని, 15 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి రావటం దేశంలో ఇదే తొలిసారని ముఖ్యమంత్రి ప్రకటించారు. బీపీసీఎల్ సహా అనేక పెద్ద పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలల్లో 20.35 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని వివరించారు.

**విశాఖ - కీలకమైన కేంద్రం:**

విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ నాలెడ్జ్ ఎకానమీ, పోర్టులు, స్టీల్, డేటా సెంటర్లు, ఐటీ సెంటర్లతో కీలకమైన కేంద్రంగా మారుతుందని ముఖ్యమంత్రి అన్నారు. టీసీఎస్, కాగ్నిజెంట్, రిలయన్స్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు పెట్టుబడి పెడుతున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్ర రేర్ ఎర్త్ మినరల్ హబ్‌గా మారుతుందని, పరిశ్రమలకు అవసరమైన నీటిని పోలవరం ద్వారా అందిస్తామని హామీ ఇచ్చారు.

**మౌలిక సదుపాయాల కల్పన:**

కొత్తగా పోర్టులు, ఎయిర్‌పోర్టులు వస్తున్నాయని, ఉత్తరాంధ్రలో మూలపేట పోర్టు, జూలైలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమవుతాయని ముఖ్యమంత్రి ప్రకటించారు.

చివరగా, ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ ప్రాజెక్టుగా భావించి వేగంగా నిర్మాణం పూర్తి చేసుకునేందుకు పూర్తి సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పరిశ్రమ నిర్మాణంలో భూములను త్యాగం చేసిన రైతులకు సహకారం అందించాలని కోరారు. ఉక్కు పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తున్నందుకు అభినందనలు తెలియజేస్తూ, మొదటిగా అనకాపల్లి జిల్లా యువతకు ఈ పరిశ్రమలో ఉద్యోగాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆవిష్కరణల కోసం మెటలర్జీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటును అభినందించారు.

**అర్సెలార్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన: కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామి ప్రసంగం**

విశాఖపట్నంలోని అర్సెలార్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన మహోత్సవంలో కేంద్రమంత్రి హెచ్.డి.కుమారస్వామి కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు-పవన్ కల్యాణ్ నాయకత్వాన్ని ఆయన కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని ప్రగతిశీల, పెట్టుబడులకు అనుకూలమైన రాష్ట్రంగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. నారా లోకేష్ తండ్రికి తగ్గ తనయుడిగా సమర్థవంతంగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. అర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ పరిశ్రమ రాకతో ఈ ప్రాంతంలో స్టీల్ ఎకోసిస్టమ్ సాకారమైందని మంత్రి కుమారస్వామి అన్నారు. ప్రధానమంత్రి మోదీ ఆకాంక్షించిన 2047 వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా దేశీయ ఉత్పాదన పెరగాల్సిన అవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. జాతీయ ఉక్కు వినియోగ విధానాన్ని అనుసరించి దేశవ్యాప్తంగా ఉక్కు ఉత్పాదనను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమను తిరిగి గాడిలో పెట్టేందుకు కేంద్రం ఆర్థిక సహకారాన్ని అందించిందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా పూర్తి సహకారాన్ని ఇచ్చిందని కుమారస్వామి గుర్తు చేశారు. అర్సెలార్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఉక్కు ఉత్పాదనకు, ఎంఎస్ఎంఈలకు, ఉద్యోగ కల్పనకు ఒక చోదక శక్తిగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు త్వరితగతిన నిర్మితమై, ఉత్పాదన ప్రారంభించాలని ఆయన ఆకాంక్షించారు.




**ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రసంగం:**
**ఉత్తరాంధ్రలో దేశంలోనే అతిపెద్ద గ్రీన్ స్టీల్ ప్లాంట్!**

అమరావతి: ఉత్తరాంధ్రలో ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ఏర్పాటు చేయనున్న దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ గ్రీన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రసంగించారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రానికి ఒక మైలురాయి అని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికత వల్లే ఇది సాధ్యమైందని ఆయన కొనియాడారు. పవన్ కల్యాణ్ ప్రసంగంలోని ముఖ్యాంశాలు: • పెట్టుబడుల రాకపై హర్షం: ఉత్తరాంధ్రలో రూ.1.35 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో, 17.8 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కావడం సంతోషదాయకమన్నారు. పర్యావరణహితమైన అత్యాధునిక స్టీల్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్న లక్ష్మీనివాస్ మిట్టల్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. పర్యావరణ శాఖ మంత్రిగా, అత్యంత తక్కువ ఉద్గారాలతో ఈ ప్రాజెక్టు నిర్మితమవుతుండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. • చంద్రబాబు దార్శనికత: రాష్ట్రానికి పెట్టుబడులు రావాలంటే చంద్రబాబు లాంటి దార్శనికత ఉన్న, విలువలున్న నాయకుడు అవసరమని ఎన్నికల ముందు తాను కోరుకున్నట్లు పవన్ కల్యాణ్ గుర్తు చేశారు. దేశానికి వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని, ఇది కేవలం విజనరీ నేత చంద్రబాబు ఉండటం వల్లే సాధ్యమవుతోందని పేర్కొన్నారు. • గత పాలనపై విమర్శలు: గతంలో రాష్ట్రం నుంచి పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోయాయని, కానీ ఇప్పుడు అవి వెతుక్కుంటూ వస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. గత పాలకులు రాష్ట్రంలోని పెట్టుబడులను, పారిశ్రామికవేత్తలను తరిమేశారని విమర్శించారు. • ఆధునిక సాంకేతికతతో ప్లాంట్: తొలిదశలో 8.2 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి సామర్థ్యంతో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని, అత్యంత తక్కువ కాలుష్యం ఉండేలా ఆధునిక టెక్నాలజీ వినియోగిస్తున్నారని తెలిపారు. • పారిశ్రామిక ప్రగతికి ఉదాహరణ: 2014-19 మధ్య రాయలసీమకు కియా పరిశ్రమ రాగానే అక్కడి పరిస్థితులు మారిపోయినట్లే, ఇప్పుడు అనకాపల్లిలో రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తే ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయని పవన్ కల్యాణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం 18 నెలల్లో సాకారమైన ఈ పరిశ్రమ 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు నిదర్శనంగా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. • కూటమి ప్రభుత్వంపై విశ్వాసం: గత 21 నెలల్లో పారిశ్రామిక అనుకూల విధానాలు, శాంతిభద్రతల మెరుగుదల వల్ల గూగుల్ డేటా సెంటర్ వంటి ఐటీ పరిశ్రమలు వచ్చాయని, ఇది కూటమి ప్రభుత్వంపై ఉన్న విశ్వాసమని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ ఉక్కు పరిశ్రమ చాలా మంది పెట్టుబడిదారులకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

**ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ పరిశ్రమకు మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన**

అనకాపల్లిలో ప్రతిష్టాత్మక ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ పరిశ్రమ శంకుస్థాపన కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పారిశ్రామిక శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ కేవలం శంకుస్థాపన మాత్రమే కాదని, పారిశ్రామికవేత్తల్లో రాష్ట్రంపై ఉన్న విశ్వాసానికి ఇది నిదర్శనమని అభివర్ణించారు. మంత్రి లోకేష్ తన ప్రసంగంలో కీలక అంశాలను వెల్లడించారు: • ఆదిత్య మిట్టల్‌తో తొలి సంప్రదింపులు: 2019కి పూర్వం తాను ఆదిత్య మిట్టల్‌ను కలిసి ఏపీలో ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరానని తెలిపారు. • ప్రభుత్వ చిత్తశుద్ధి: 2024లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కార్యాచరణ ప్రారంభించిందని, కేవలం 30 నిమిషాల జూమ్ కాల్ ద్వారా దేశంలోనే అతిపెద్ద ఉక్కు పరిశ్రమ ఏపీకి వచ్చిందని పేర్కొన్నారు. • యువతకు ఉద్యోగాలు: రాష్ట్రంలో తాను చేపట్టిన 3,132 కిలోమీటర్ల పాదయాత్రలో ప్రజల ఆకాంక్షలను తెలుసుకున్నానని, అందుకే యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఈ హామీని నెరవేర్చడంలో ఇవాల్టి శంకుస్థాపన కీలక మైలురాయి అవుతుందని పేర్కొన్నారు. • పారిశ్రామికాభివృద్ధి: ఇప్పటికే పారిశ్రామికంగా అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రాలతో పోటీ పడటం లేదని, అయితే ఏపీకి కూడా పరిశ్రమలను ఆకర్షించగల సత్తా ఉందని ఈ ప్రాజెక్ట్ నిరూపిస్తుందని లోకేష్ అన్నారు. ప్రపంచ స్టీల్ మ్యాప్‌లో అనకాపల్లికి స్థానం దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. • సులభతర వాణిజ్యం: ఈ ప్రాజెక్టు సాకారం కావడంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాలను అనుసరించామని, భూమి, అనుమతులను వేగంగా ఇచ్చామని వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు (సీబీఎన్) బ్రాండ్‌తోనే ఈ స్థాయి పరిశ్రమ రాష్ట్రానికి వచ్చిందని, ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు సీబీఎన్ బ్రాండ్ విశ్వాసాన్ని కల్పించిందని తెలిపారు. • పెట్టుబడి వివరాలు: ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ పరిశ్రమ 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల స్టీల్ ఉత్పత్తి చేసేందుకు రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడి పెడుతుందని లోకేష్ వెల్లడించారు. 'డబుల్ ఇంజిన్ బులెట్ ట్రైన్ సర్కార్' విధానాలతో ఈ స్థాయి పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయని అన్నారు. • కేంద్ర సహకారం: కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ మంత్రి కుమారస్వామికి ధన్యవాదాలు తెలియజేస్తూ, స్లరీ పైపులైన్ ఏర్పాటు విషయంలో వేగంగా అనుమతులు ఇచ్చారని, దీనికి ఏపీ ప్రజలు రుణపడి ఉంటారని లోకేష్ అన్నారు. ప్రధాని మోడీ సహా కేంద్రం సహకారంతో ఏపీలో స్టీల్ ఎకోసిస్టమ్ రూపుదిద్దుకుంటుందని పేర్కొన్నారు. • ప్రాంతీయ అభివృద్ధి: ఈ ఉక్కు పరిశ్రమ ఉత్తరాంధ్రకు ఆభూషణంగా నిలిచి, ప్రాంతీయ అభివృద్ధికి సహకారం అందిస్తుందని లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ ప్రభుత్వం కేవలం ఎంఓయూలు సంతకాలు చేయడమే కాకుండా, వాటిని సాకారం చేసి చూపిస్తుందని ఉద్ఘాటించారు. • రైతులకు కృతజ్ఞతలు: ఈ ఉక్కు పరిశ్రమకు భూములు ఇచ్చిన రైతులకు, ప్రజలకు మంత్రి లోకేష్ ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.

**అర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన: లక్ష మందికి ఉపాధి, ఆత్మనిర్భర్ భారత్‌కు ఊతం**

విశాఖపట్నం, మార్చి 23: ఆంధ్రప్రదేశ్‌లో రూ. 38,000 కోట్ల పెట్టుబడితో అర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ భారీ పరిశ్రమకు శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ నివాస్ మిట్టల్ మాట్లాడుతూ, ఇది దేశ ఆర్థిక ప్రగతికి, ప్రధాని నరేంద్ర మోడీ ఆకాంక్షలైన ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్ లక్ష్యాలకు బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు. అనకాపల్లిలో ఏర్పాటు కానున్న ఈ ప్లాంట్ ఏడాదికి 8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యంతో దేశీయ అవసరాలను తీర్చడమే కాకుండా, మౌలిక సదుపాయాలు, ఉత్పత్తి పరిశ్రమలు, రక్షణ రంగాలకు అవసరమైన స్టీల్ ఉత్పత్తులను అందిస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌కు అనుగుణంగా రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి ఈ ప్లాంట్ తోడ్పడుతుందని మిట్టల్ ఆశాభావం వ్యక్తం చేశారు. అనకాపల్లిని ఉపాధి కేంద్రంగా, గ్రోత్ ఇంజిన్‌గా మార్చే ఈ ప్రాజెక్టు, ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి పైగా ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు నైపుణ్యాభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు. అర్సెలార్ మిట్టల్ సంస్థ 50 ఏళ్ల ప్రస్థానంలో ఇది తమకు ఒక మైలురాయి అని, అనకాపల్లిలో నిర్మించేది అత్యంత ఆధునిక స్టీల్ ప్లాంట్ అని ఆయన వెల్లడించారు. ఈ భారీ పరిశ్రమ సాకారానికి సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మిట్టల్ కృతజ్ఞతలు తెలిపారు.

## స్థానిక సంస్థల

## ఎన్నికలకు ప్రతి ఒక్కరు సిద్ధం కావాలి

**- పంచాయతీ గ్రామ కమిటీలు త్వరితగతిన పూర్తి చేయాలి.**

**- పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేసిన శాసన సభ్యులు అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు**





**అల్లూరి జిల్లా బ్యూరో (గూడెం కొత్తవీధి) మార్చి 23 ప్రజా ప్రతిభ**

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గం పాడేరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో శాసన సభ్యులు జిల్లా పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా అరకు పార్లిమెంట్ పరిశీలకులు చింతలపూడి వెంకట రామయ్య, పాడేరు అరకు నియోజకవర్గాల పరిశీలకులు ఏడువాక సత్యారావు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి శాసన సభ్యులు మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి కార్యకర్తలకోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసి ప్రతి కార్యకర్తకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గుర్తింపు ఉండాలని డిజిటలైజేషన్ ద్వారా కార్యకర్తలకు భద్రత కల్పించే విధంగా. దూరదృష్టితో వ్యక్తిగత గుర్తింపు కార్డ్ ఇస్తూ పార్టీ కేంద్ర కార్యాలయంలో నేరుగా సమస్యలు తెలియజేసే విధంగా జగన్మోహన్ రెడ్డి చర్యలు చేపట్టారు. పాడేరు నియోజకవర్గంలో 90% శాతం కమిటీలు పూర్తి చేసుకున్నాం. ఇంకా త్వరగా మిగతా కమిటీలు త్వరితగతిన పూర్తి చెయ్యాలని నాయకులకు ఆదేశాలు జారీ చేశారు. కావున ప్రతి ఒక్క కార్యకర్తను కమిటీల్లో భాగస్వాములు చేసి భద్రత కల్పించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు హామీలిచ్చి విఫలం అయ్యారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలు ఎండగట్టడానికి మండల స్థాయి నుంచి గ్రామ పంచాయితీ వరకు ప్రతి గ్రామాల్లో ప్రజలకు తెలియపరచి నాయకులకు సూచించారు. నాయకులందరూ పార్టీ సిద్ధాంతాలకు తూచతప్పకుండా పాటించి రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మెజారిటీతో గెలిపించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గాడి సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు సీధరి మంగ్లన్న దొరా, వంజరి సీతారాం నాయుడు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కురూస పార్వతమ్మ, మండల పార్టీ అధ్యక్షులు బిడిజన అప్పారావు, నుర్మాని మత్యకొండం నాయుడు, కంకిపాటి గిరి ప్రసాద్, ఎంపీపీలు, బడుగు రమేష్, బోయిన కుమారి, కోరభ అనూష దేవి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గుబ్బడి శేఖర్, పంచాయితీ రాజ్ విభాగం కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి బుసారి కృష్ణారావు, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి కూతంగి సూరిబాబు, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు లోచలి వర ప్రసాద్, క్రిస్టియన్ మైనారిటీ జిల్లా అధ్యక్షులు వసుపరి తిమోతి, రాష్ట్ర మహిళా సంయుక్త కార్యదర్శి జయితి రాజులమ్మ, యువజన విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొడుగు అచ్యుత్, మాజీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కిల్లో ఊర్వశి రాణి, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు శరభ సూర్యనారాయణ మరియు సర్పంచులు. ఎంపీటీసీలు. వివిధ అనుబంధ విభాగాల నాయకులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ పగడాల

# మృతి హత్యేనని అనుమానం

**- మాజీ ఎంపీ జివి హర్షకుమార్**



**రాజమహేంద్రవరం, మార్చి 23 (ప్రజా ప్రతిభ) :**

పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి ఘటనపై గత సంవత్సరం నుంచి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మాజీ ఎంపీ జివి హర్షకుమార్ పేర్కొన్నారు. ఈ ఘటన సాధారణ ప్రమాదం కాదని, ఇది ముమ్మాటికీ హత్యేనని తాము నమ్ముతున్నామని ఆయన స్పష్టం చేశారు. ప్రవీణ్ పగడాలను ఎక్కడో హత్య చేసి, అనంతరం రాజమండ్రి సమీపంలో పడేశారని అనుమానం వ్యక్తం చేశారు. ఈ కేసులో అనేక అనుమానాస్పద అంశాలు ఉన్నాయని, ముఖ్యంగా ప్రమాదం జరిగిందని చెబుతుంటే ల్యాప్‌టాప్, ఐఫోన్‌ను ఎందుకు స్వాధీనం చేసుకున్నారని ప్రశ్నించారు. ఇప్పటివరకు పోస్టుమార్టం నివేదికను బహిర్గతం చేయకపోవడం కూడా అనుమానాలకు తావిస్తోంది అని అన్నారు. సంస్మరణ సభ నిర్వహణకు పోలీసులు అనుమతి ఇవ్వడాన్ని స్వాగతిస్తూ, పోలీసు శాఖకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అయితే కేసులో పోలీసులు కొన్ని విషయాలను దాచిపెడుతున్నారనే అనుమానం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవీణ్ పగడాల విషయంలో చేసిన వ్యాఖ్యలు సరికావని, ఒక వ్యక్తిని తాగుబోతుగా అభివర్ణించడం తగదని హర్షకుమార్ విమర్శించారు. అలాగే, ఈ వ్యవహారంలో కోర్టును ప్రభావితం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. దేశంలో క్రైస్తవులపై దాడులు పెరుగుతున్నాయని, ఈ ఘటన కూడా అలాంటి పరిణామాల భాగమని ఆయన అభిప్రాయపడ్డారు. డిప్యూటీ స్పీకర్ రఘురామ రాజు కూడా క్రైస్తవులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ప్రవీణ్ పగడాల సంస్మరణ సభ ద్వారా ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక ఇవ్వాలని పిలుపునిచ్చిన హర్షకుమార్, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఐక్యతను చాటాలని కోరారు.

# వేసవి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయండి

## - జిల్లా యంత్రాంగానికి కీలక ఆదేశాలు

## - జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

**అల్లూరి జిల్లా బ్యూరో (పాడేరు ) : 23 మార్చి ప్రజా ప్రతిభ**



2026 జిల్లాలోని అన్ని జన సముదాయలు,కూడలిలో రాబోయే తీవ్రమైన ఎండలు, ఉష్ణగాలుల దృష్ట్యా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో 'సమ్మర్ అక్షన్ ప్లాన్' రూపొందించుకోని, చలివేంద్రాలు ఏర్పాటుకు ప్రతిష్టమైన చర్యల రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. సోమవారకలెక్టర్ తన చాంబర్ నుండి అల్లూరు పోలవరం జిల్లాల సంబంధించిన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఐటీడీఏ, కలెక్టరేట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ప్రజలు,జనాలు ఎక్కువగా మసిలే ప్రదేశాలను,చలివేంద్రాల ఏర్పాటు ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే సంతలు, ఆర్.టి.సి బస్టాప్‌లు, బస్సు షెల్టర్లు మరియు పర్యాటక ప్రాంతాల్లో తక్షణమే చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని,ఉపాధి హామీ, పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాల వద్ద, ఎన్.ఆర్.జి.ఎస్ పనులు చేసే కూలీలకు మరియు పాఠశాల విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా తగిన నీడ మరియు రక్షణ చర్యలు చేపట్టాలి.తాగునీటి సరఫరా సంబంధించి గ్రామాల్లో తాగునీటి కొరత తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించి, తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పశువులకు, మేకలకు గ్రామ స్థాయిలో ప్రత్యేకంగా వాటర్ పాంట్స్ (నీటి కుంటలు) ఏర్పాటు చేయాలి.వ్యవసాయం, ఉద్యానవనం సాగునీటి ఎద్దడి రాకుండా చెక్ డ్యామ్‌ల ద్వారా పంట పొలాలకు నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలి.వైద్య సౌకర్యాలు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వడదెబ్బ నివారణకు అవసరమైన ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, అత్యవసర మందులను అందుబాటులో ఉంచాలి.ప్రజలు కూడా ఎండలు ఎక్కువగా ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని, ఎండల తీవ్రత ఉన్నప్పుడు అందుకు తగిన ఏర్పాటు చేసుకొని, మధ్యాహ్నం వేళల్లో అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని కలెక్టర్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.అనంతరం వడదెబ్బ తాలకుండా తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించిన పోస్టర్ను ప్రారంభించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అల్లూరు, పోలవరం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, రెండు జిల్లాల ఐటిడిఏ ప్రాజెక్టు అధికారులు, డిపిఓ,డిఎంహెచ్ఓ, డిఈఓ, డిఎఫ్ఓస్, ఫైర్,





ఈఈ ఎస్ఎంఐ, ఈఈ ఆర్డబ్ల్యూఎస్, డిడి గ్రౌండ్ వాటర్, పిడి ఐసిడిఎస్ ఇరిగేషన్, ఎడి సిరికల్చర్, ఏడి ఆర్టికల్చర్, అగ్రికల్చర్, డీఎం,ఆర్ఎం ఆర్టీసీ,ఎస్సీ ట్రాన్స్కో,పిడి డిఆర్డిఏ డ్వామా తదితర శాఖలఅధికారులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**- వైఎస్ఆర్సిపి డిమాండ్**




**రాజమహేంద్రవరం, మార్చి 23 (ప్రజా ప్రతిభ) :**

యస్‌సి కులంపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పై వైఎస్సార్‌సీపీ యస్‌సి విభాగ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. రాజమండ్రి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో యస్‌సి విభాగం అధ్యక్షుడు తిరగాటి దుర్గ ఆధ్వర్యంలో సోమవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, సమకాలీన రాజకీయాలలో యస్‌సి వర్గాల పాత్ర అత్యంత కీలకమని, అలాంటి వర్గాన్ని చులకనగా మాట్లాడటం తీవ్రంగా ఖండనీయమన్నారు. ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన ఆడియోలో యస్‌సి కులంపై చేసిన వ్యాఖ్యలు వారి మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.మహానుభావుడు, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను అవమానించినట్లేనని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు అడిగే నాయకులు, తర్వాత అదే వర్గాలపై వివక్ష చూపడం దురదృష్టకరమని విమర్శించారు. "దళితులను ఇళ్లలోకి రానివ్వకూడదా? ఉద్యోగాలు తీసివేయిస్తామని బెదిరించడమా? ఇది ప్రజాస్వామ్య రాష్ట్రం కాదా లేక వ్యక్తిగత జాగీరా?" అంటూ ప్రశ్నించారు.దళిత ఉద్యోగిపై బెదిరింపులకు పాల్పడ్డారని, జాన్ అనే దళితుడిపై దాడి జరిగిన వీడియోలు కూడా ఉన్నాయని తెలిపారు. ఈ విషయాలపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. యస్‌సి, యస్‌టిపై అట్రాసిటీ కేసులతో పాటు హత్యాయత్నం (సెక్షన్ 307) కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ జాతి పిత స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు మార్గాని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది.

## పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, మార్చి 23 (ప్రజా ప్రతిభ) :**

రూరల్ మండలం రాజవోలు గ్రామంలో పశుసంవర్ధక శాఖ మరియు మార్కెట్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ మార్ని వాసుదేవ్ అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో పశువులకు గర్భకోశ సంబంధిత వ్యాధులపై ఉచిత పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, పాడి పరిశ్రమను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పశు సంపద అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, పశు భీమా, 50 శాతం సబ్సిడీపై పశుదాణ అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వంలో పాడి రైతులకు నాణ్యమైన మందులు విస్తృతంగా అందిస్తున్నామని పేర్కొన్నారు.గొర్రెలకు ఏప్రిల్ నెలలో నట్టల నివారణ మందుల పంపిణీ చేపట్టనున్నామని, ఈ నెలలో గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నామని తెలిపారు. రాష్ట్రంలో సెక్స్ సార్టెడ్ సెమన్ సాంకేతికతను అందుబాటులోకి తీసుకువచ్చి, మెరుగైన జాతి దూడల ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని, రైతులు దీనిని వినియోగించుకోవాలని సూచించారు.మార్కెట్ కమిటీ చైర్మన్ మార్ని వాసుదేవ్ మాట్లాడుతూ, పాడి రైతులు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటివారని అన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధి చెందితే రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉంటాయని పేర్కొన్నారు. పశువులలో కృత్రిమ గర్భధారణ విస్తరణకు ప్రభుత్వం మరింత చొరవ చూపాలని, అలాగే రోగ నిర్ధారణ కోసం కడియంలో ప్రత్యేక ప్రయోగశాల ఏర్పాటు చేయాలని కోరారు.ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి ఒంగోలు ఆవుల పాల ఉత్పత్తి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన రాజవోలు గ్రామానికి చెందిన రిమ్మలపూడి శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. అనంతరం పాడి రైతులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఉచిత మందులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నిమ్మలపూడి రామకృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గంగిన జాహ్నవి, బైరెత్తి సరోజినీ దేవి, మంద హిమబిందు, బండి శ్రీ జ్యోతి, మామిడిశెట్టి సువర్ణ కుమారి, మట్ట శ్రీను, పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డా. జి. రవి వర్మ, ప్రాంతీయ పశువైద్యశాల, డా. పి. వెంకట రావు, డా. జె.ఎస్.ఆర్.ఆర్. కిరణ్–వి.డి, డా.బి. భారత్–వి.డి, డా. కె. సౌమ్య– వి.డి, వల్లేపల్లి శ్రీరామ్ చౌదరి, గాలి వెంకటేశ్వరరావు పాడి రైతులు పాల్గొన్నారు.

## పండు ఆశయాలను ప్రెస్ క్లబ్ ద్వారా నెరవేర్చాలి

**- అధ్యక్షుడు మృతి పాత్రికేయ రంగానికి తీరని లోటు**

**- పాత్రికేయుల అభివృద్ధికి ఆఖరి రోజు వరకు కృషి చేసిన వ్యక్తి పండు**

**- ది గోకవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పండు సంతాప సభలో పలువురు కితాబు**



**గోకవరం మార్చి 23 (ప్రజా ప్రతిభ న్యూస్)**

ది గోకవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రౌతుపండు అకాల మరణం పాత్రికేయ రంగానికి తీరని లోటని, జిల్లా వ్యాప్తంగా తనకున్న పరిచయాలతో ది గోకవరం ప్రెస్ క్లబ్ అభివృద్ధికి పండు అహర్నిశలు కృషి చేశారని, పలువురు సీనియర్ పాత్రికేయులు గుర్తు చేశారు . సోమవారం గోకవరంలోని ప్రెస్ క్లబ్ ఆవరణలో ఏర్పాటుచేసిన సంతాప సభలో పండు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కుడుపూడి పార్థసారథి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని పాత్రికేయులందరినీ సంఘటితం చేసి, వారందరి అభివృద్ధికి పండు చేసిన కార్యాచరణ మరిచిపోలేనిదని అన్నారు. సామాజిక సేవ పట్ల పండు చూపించిన చొరవ గొప్పదని ప్రసంసించారు. ది గోకవరం ప్రెస్ క్లబ్ ద్వారా పండు ఆశయాలను నెరవేర్చే విధంగా పాత్రికేయ సభ్యులు మెలగాలని సూచించారు. గోకవరంలో ది గోకవరం ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసిన మొదటి రోజు నుండి సంఘ అభివృద్ధికి, సభ్యుల ప్రాథమిక హక్కులను కాపాడటానికి జిల్లా, రాష్ట్ర నాయకులతో తరచూ సంప్రదింపులు జరిపే వారిని, పండు అకాల మరణం తోటి పాత్రికేయులకు తీరని లోటని ఏపీడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి మండెల శ్రీరామ్మూర్తి అన్నారు. ఉన్నత ఆశయాలు ఉన్న పండు కుటుంబ సభ్యులకు పాత్రికేయులంతా అండగా ఉండాలని సూచించారు. ది గోకవరం ప్రెస్ క్లబ్ లో ఉన్న సభ్యులందరికీ కనీస అవసరాల కల్పనకు పండు శక్తి వంచన లేకుండా కృషి చేశారని , దాని ఫలితమే జిల్లాలోనే మంచి ప్రెస్ క్లబ్ ఏర్పాటు , జర్నలిస్టులకు నివాస స్థలాల కల్పన సాధ్యమైందని ది గోకవరం ప్రెస్ క్లబ్ కార్యదర్శి కర్రి శివరామకృష్ణ అన్నారు. తమ అధ్యక్షుడు మృతి తమకు తీరని దుఃఖాన్ని మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. గోకవరం, కోరుకొండ, దేవీపట్నం తదితర మండలాలకు చెందిన పాత్రికేయులు, పిఆర్వోలు, వివిధ జర్నలిస్టు సంఘ నాయకులు పండు సంతాప సభలో పాల్గొని, నివాళులర్పించారు.

## ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు

**గోకవరం మార్చి 23 (ప్రజా ప్రతిభ న్యూస్)**



తూర్పుగోదావరి జిల్లా, జగ్గంపేట నియోజకవర్గం, గోకవరం గ్రామంలోని తంటికొండ వెళ్లే రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్దవిశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ఆదేశాల మేరకుసోమవారం స్వాతంత్ర సమర యోధుడు భగత్ సింగ్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారుఆయన చిత్రపటానికి రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారుఈ కార్యక్రమంలో బత్తుల నానాజీ, కరిబండి వెంకటేశ్వరరావు, తాటికొండ సురేష్, నెల్లి శ్రీను, తుమ్మల బుజ్జి,కందికట్ల మూర్తి, కేబుల్ రాజు, ఆదం మణికంఠ, పదిలం చక్రారావు, గని రాజు, రామసేన సిబ్బంది, బీజేపీ దళిత యువత తదితరులు పాల్గొన్నారు..

## మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం శ్రీ రౌతు పండు

**- పాటంశెట్టి సూర్యచంద్రఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి**



**గోకవరం మార్చి 23 (ప్రజా ప్రతిభ న్యూస్)**

గోకవరం మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా సేవలందించిన శ్రీ రౌతు పండు గారు హార్ట్ స్ట్రోక్ కారణంగా ఇటీవల పరమపదించారు. ఆయన జర్నలిజం రంగంలో ఎంతోకాలం సేవలందిస్తూ, సమాజ సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చిన నిబద్ధత కలిగిన పాత్రికేయుడిగా అందరి మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించారు.మరణానికి ముందు చివరి క్షణాల్లో కూడా ఆయన చూపిన సేవాభావం అందరికీ ఆదర్శంగా నిలిచింది. తన మరణం అనంతరం తన శరీరాన్ని హాస్పిటల్‌కు దానం చేయాలని కుటుంబ సభ్యులకు సూచించారు. వైద్య విద్యార్థుల విద్యాభ్యాసానికి తన శరీరం ఉపయోగపడాలని భావించి, మరణానంతరం కూడా సమాజానికి ఉపయోగపడాలనే మహోన్నత ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నారు.అలాగే శ్రీ రౌతు పండు జ్ఞాపకార్థంగా, ఆయన నివాసానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ కుటుంబ సభ్యులు మరియు ప్రెస్ క్లబ్ సభ్యులు ఒక మొక్కను అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరినీ ఎంతో ఆలోచింపజేసింది.శ్రీ రౌతు పండు ఈ మహోన్నత నిర్ణయాలు మానవత్వానికి గొప్ప ఉదాహరణగా నిలిచాయి. ఆయన సేవాభావం, సమాజం పట్ల ఉన్న బాధ్యతాభావం అందరికీ స్ఫూర్తిదాయకం. గోకవరం మండలంలోని పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు, మిత్రులు మరియు అభిమానులు ఆయన మరణాన్ని తీవ్రంగా సంతాపం వ్యక్తం చేస్తున్నారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని జగ్గంపేట నియోజకవర్గం ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర ఆకాంక్షించారు

## సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం



**వాకాడు మార్చి 23 ప్రజా ప్రతిభ**

తిరుపతి జిల్లా. వాకాడు: మండల పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన చెమిరితీ పద్మమ్మ అనారోగ్యానికి గురి కావడంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 30 వేల రూపాయలు మంజూరు అయినాయి. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును టిడిపి సీనియర్ నాయకులు టి మోహన్ నాయుడు, ఎక్స్ ఎం పి టి సి విజయమ్మ బాధితురాలు అయిన పద్మమ్మకు ఆదివారం అందించారు. సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించినందుకు గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాసిం సునీల్ కుమార్ కు,సహకరించిన వాకాడు మండలం టిడిపి సీనియర్ నాయకుడు సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి లకు మోహన్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. అనారోగ్య పీడిత బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుచున్నారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

### బీసీలను అణిచివేయడానికే కూటమి

# ప్రభుత్వ చర్యలు: మార్గాని భరత్ ఆరోపణలు

**రాజమహేంద్రవరం, మార్చి 23 (ప్రజా ప్రతిభ) :**

బీసీ వర్గాలను అణిచివేయడానికే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆరోపించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యలు అహంకారపూరితంగా ఉన్నాయని విమర్శించారు.పాతకాలం పనిముట్లు అందజేస్తామన్న ప్రకటనల ద్వారా బీసీలు ఇంకా సంప్రదాయ వృత్తుల్లోనే కొనసాగాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు కనిపిస్తోందని అన్నారు. నేటి బీసీ యువత రాజకీయ, వ్యాపార, సాంకేతిక రంగాల్లో ముందుకు రావాలని ఆశిస్తున్నారని, వారి అభివృద్ధికి అనుగుణంగా విధానాలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వం నిజంగా చిత్తశుద్ధితో పనిచేస్తే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా 50 ఏళ్లు దాటిన బీసీ, ఎస్సీ మహిళలకు పెన్షన్, నిరుద్యోగ భృతి, గృహ స్థలాల పంపిణీ వంటి అంశాలను వెంటనే అమలు చేయాలని కోరారు. బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించి రుణాల పంపిణీ చేపట్టాలని సూచించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో బీసీ, ఎస్సీ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యాసంస్థల అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విధానాల వల్ల ప్రభుత్వ విద్యా వ్యవస్థ దెబ్బతింటోందని ఆరోపించారు.అలాగే, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పై తీవ్ర విమర్శలు చేశారు. దళితులను దూషించినందుకు ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ విషయాన్ని జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.ఒక కుటుంబ వివాదంలో దళితుడిపై దాడి జరిగిందని, బాధితుడు ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు కేసు నమోదు చేయలేదని ఆరోపించారు. ఇందుకు సంబంధించిన వీడియో ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఈ ఘటనలో నిందితులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం రాష్ట్రంలో పాలన సక్రమంగా సాగడం లేదని, ప్రజా ప్రతినిధుల వ్యవహారశైలి




ప్రశ్నార్థకంగా మారిందని విమర్శించారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఈ అంశాలను ప్రజల దృష్టికి తీసుకెళ్తున్నామని, తుది తీర్పు ప్రజలదేనని భరత్ రామ్ పేర్కొన్నారు.

# నెల్లూరు జిల్లా ప్రతి రైతునూ ఆదుకుంటాం అధైర్యపడొద్దు

### - రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

### నష్టపోయిన ప్రతి సెంటు భూమికి నష్టపరిహారం అందిస్తాం





**నెల్లూరు బ్యూరో మార్చి 23(ప్రజా ప్రతిభ):**

వడగండ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులకు మంత్రి ఆనం భరోసా ఇచ్చారు.అనంతసాగరం మండలంలో దెబ్బతిన్న పంటలను ప్రత్యక్షంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరిశీలించారు.
రెండు రోజుల్లో పూర్తిస్థాయి నష్టపరిహారం వివరాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.ఆత్మకూరు, మార్చి 23: పంట నష్టపోయిన ప్రతిఒక్క రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని, ప్రతి సెంటు భూమికి నష్టపరిహారం చెల్లిస్తామని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హామీ ఇచ్చారు.అనంతసాగరం మండలంలోని చిలకలమర్రి, కామిరెడ్డిపాడు, మంగుపల్లి గ్రామాల్లో ఇటీవల కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న వరి, పత్తి, మిరప తదితర పంటలను మంత్రి రైతులు, అధికారులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చేతికి వచ్చిన పంట పూర్తిగా నష్టపోయిందని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేయగా, ప్రతి రైతును ఆదుకుంటామని మంత్రి భరోసా ఇచ్చి ఓదార్చారు.అనంతరం అనంతసాగరం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, రెవెన్యూ శాఖల అధికారులు పంట నష్టం వివరాలను మంత్రికి తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యం కారణంగా అనంతసాగరం, మర్రిపాడు, కలువాయి, రాపూరు, సీతారాంపురం, లింగసముద్రం మండలాల్లోని 21 గ్రామాల్లో 1469 మంది రైతులు సుమారు 1289 హెక్టార్లలో పంటలను నష్టపోయినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. అనంతసాగరం మండలంలోనే అత్యధికంగా 1054 హెక్టార్లలో పంట నష్టం సంభవించిందని, ముఖ్యంగా వరి పంట తీవ్రంగా దెబ్బతిన్నదని మంత్రి తెలిపారు. మొక్కజొన్న, మిరప, నిమ్మ, పొగాకు పంటలు కూడా కొంత మేర ప్రభావితమయ్యాయని చెప్పారు.రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో తక్షణమే కచ్చితమైన ఎన్యుమరేషన్ పూర్తి చేసి నివేదికను కలెక్టర్‌కు అందించాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపించి, మార్గదర్శకాల మేరకు సకాలంలో నష్టపరిహారం అందిస్తామని పేర్కొన్నారు. కౌలు రైతులను కూడా ఆదుకుంటామని స్పష్టం చేశారు.ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడులతో పంట నష్టం అంశంపై చర్చించామని, రైతులకు సహాయం చేయడంలో వారు సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు.రైతులు ఎవరు అధైర్యపడొద్దని, వారి కష్టానికి తప్పకుండా న్యాయం చేసి త్వరలోనే నష్టపరిహారం అందజేస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి నర్సోజి రావు, ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఆర్డీవో పావని, తహసీల్దార్ పద్మజ, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు..

# నేటి యువత భగత్ సింగ్‌ని ఆదర్శంగా తీసుకోవాలి : పిడిఎస్ఓ

### - భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ర్యాలీ

**వెంకటగిరి, మార్చి 23(ప్రజా ప్రతిభ ):**

భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా వెంకటగిరి పట్టణంలోని రాణి పేట నుండి భ్రమరాంబహాల్ వద్ద వరకు పిడిఎస్ఓ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించడం జరిగింది..ఈ సందర్భంగా వెంకటగిరి ఏరియా పిడిఎస్ఓ ఏరియా కన్వీనర్ సి.హెచ్. పవన్ మాట్లాడుతూ భగత్ సింగ్ అమరులయ్యి నేటికీ 95 సంవత్సరాలు గడిచినప్పటికీ నేటికీ సామ్రాజ్యవాదుల దోపిడి కొనసాగుతూనే ఉందని తెలిపారు . ఒకప్పుడు బ్రిటిష్ సామ్రాజవాదులు ఎలా అయితే భారత ప్రజలను పట్టి పీడించారో అదేవిధంగా ఇప్పుడు అమెరికన్ సామ్రాజవాదులు ఇజ్రాయిల్ తో కలిసి ఇరాన్ పై అమానుష్యంగా యుద్దోన్మాద దాడులు చేయడనీ అందరూ ఖండించాలన్నారు.ఇటీవల వెనిజులా దేశ అధ్యక్షుడునీ ఆయన భార్యను అపహరించడం, మూడేళ్ల పాటు పాలసీనపై దాడి చేసి లక్షలాది మందిని పొట్టన పెట్టుకోవడం చూస్తే ఆధిపత్యం కోసం, ఆయిల్ దోపిడీ కోసం సాగించిన దారుణాలే అన్నారు.ప్రపంచం మొత్తం మీద ముడిచమురు, గ్యాస్ కొరత ఏర్పడినందున నిత్యావసర సరుకుల ధరలు పెరిగి పేద , మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని పేర్కొన్నారు . ఆనాడు భగత్ సింగ్ మన దేశ యువతరాన్ని స్వాతంత్ర పోరాటంలో పాల్గొనేందుకు ఎన్నో వ్యాసాలు రాసి చైతన్యవంతం చేశాడని అన్నారు. సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన భగత్ సింగ్ ని ఆదర్శంగా తీసుకొని యుద్ధాలకు వ్యతిరేకంగా ప్రపంచ శాంతి కోసం పోరాడాలని విద్యార్థులను కోరారు . ఈ కార్యక్రమంలో పి. డి. యస్. ఓ సభ్యులు తిరుమల, సుబ్బు, తేజు, సురేంద్ర, 200




పైగా విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ రామ నవమి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన గూడూరు ఎమ్మెల్యే

**నెల్లూరు బ్యూరో మార్చి 23(ప్రజా ప్రతిభ):**

తమ్మినపట్నం గ్రామములో వేంచేసియున్న శ్రీ కోదండ రామస్వామి వారి శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు మార్చి 25 నుండి మార్చి 31 వరకు అత్యంత వైభవముగా జరుగును. శ్రీ రామ నవమి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను గూడూరు నియోజకవర్గ శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ ఆవిష్కరిచారు. బ్రహ్మోత్సవాలు ఆహ్వానముకు పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం మాజీ చైర్మన్ తానంకి నానాజీ, మండల పార్టీ అధ్యక్షులు దువ్వూరు రాజశేఖర్ రెడ్డి మరియు గూడూరు రూరల్ సిఐ కిషోర్ బాబు, చిల్లకూరు మండలం సబ్ ఇన్స్పెక్టర్ సురేష్ బాబు అహ్వానించే కార్యక్రమంలో ఏపీ లైవ్ స్టాక్ డైరెక్టర్ గుండాల లీలావతి, తిక్కవరం సర్పంచ్ సతీష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కోట సతీష్ యాదవ్, కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ మరియు కమిటీ సభ్యులు భక్తాని రామయ్య, కొప్పాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



## మహిళ కుటుంబ సమస్యను రాజకీయంగా మలచడం దారుణం

### - టీడీపీ ఎస్సీ నాయకులు



**రాజమహేంద్రవరం, మార్చి 23 (ప్రజా ప్రతిభ) :**

ఒక మహిళ కుటుంబంలో నెలకొన్న వ్యక్తిగత వివాదంలో వైసీపీ నేతలు జోక్యం చేసుకుని రాజకీయ లాభాల కోసం వినియోగించడం దారుణమని తెలుగుదేశం పార్టీకి చెందిన ఎస్సీ నాయకులు విమర్శించారు. పాలచర్లకు చెందిన బాధిత మహిళ కుటుంబ సమస్యలో చోటుచేసుకున్న ఘటనను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.సోమవారం స్థానిక ఆనం రోటరీ హాల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్ మాట్లాడుతూ, బాధిత కుటుంబం సంప్రదించిన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాటలను ఎడిట్ చేసి సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. 2019--2024 ఎన్నికల తర్వాత రాజకీయ ఉనికిని నిలబెట్టుకునేందుకు తప్పుడు ప్రచారాలకు వైసీపీ నేతలు పాల్పడుతున్నారని విమర్శించారు.జగన్ పాలనలో దళితులు, మహిళలపై జరిగిన దాడులు, అన్యాయాలను వైసీపీ నేతలు మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ తురకల నిర్మల మాట్లాడుతూ, దళితులపై జరిగిన అన్యాయాలపై స్పందించని వారు ఇప్పుడు నాటకీయంగా స్పందించడం విచారకరమని అన్నారు.టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు మాట్లాడుతూ, కుటుంబ వివాదాలను రాజకీయ రంగంలోకి లాగడం సరికాదని, ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని వైసీపీ నేతలకు సూచించారు. ఈ సమావేశంలో దళిత నాయకులు కోరుమిల్లి విజయ శేఖరు, మొకమాటి సత్యనారాయణ, ఈతలపాటి రవి, తానేటి కృపామణి, మామిడి శ్రీను, బూరా రమణ, కానేటి ప్రభు, నాగేశ్వరరావు, మోత నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

### - 66 మంది లబ్ధిదారులకు 40 లక్షల ఆర్థిక సాయం అందజేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ





**కోరుకొండ మార్చి 23 ప్రజా ప్రతిభ న్యూస్**

సోమవారం కోరుకొండ మండల కేంద్రంలోని శాసనసభ్యులు వారి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వీరితో పాటు జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో ఆర్డినేటర్ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో అనారోగ్యం పాలై ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని హామీ ఇచ్చారు. గతంలో దరఖాస్తు చేసుకుని పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వెలికితీసి త్వరితగతిన నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తున్నట్లు తెలిపారుమొత్తం 66 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశామని, మంజూరైన మొత్తం సుమారు ?40 లక్షల రూపాయలు అని తెలియజేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నాం. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తాం అని ఎమ్మెల్యే పేర్కొన్నారురాజానగరం మండలం పుణ్యక్షేత్రం గ్రామానికి చెందిన యదవిల్లి శ్రీను కి రూ. 30786/-, గారపాటి అనంత లక్ష్మి అచ్చారావు కి రూ. 2,15,813/- చక్రద్వారబంధం గ్రామానికి చెందిన చాకలి చిన్న సుబ్బారావు కి రూ. 57,327/-, పితాని రుశిదేవి కి రూ. 12,000/- , బండారి నానాజీ కి రూ. 20,609/-తూర్పు గోనగుడెం గ్రామానికి చెందిన దాసరి దుర్గ దేవి కి రూ. 30,806/-కలవచర్ల గ్రామానికి చెందిన జల్లి సామ్యుల్ కి రూ. 60,895/-సీతారామపురం గ్రామానికి చెందిన సురపురెడ్డి సత్తిరాజు మనికంట కి రూ. 30,000/-, పల్లపు నర్సావేని కి రూ. 23,400/-కానవరం గ్రామానికి చెందిన పిల్లా అరుణ కి రూ. 23,920/- మల్లంపూడి గ్రామానికి చెందిన వీర్రోతు వరలక్ష్మి కి రూ. 18,000/-, కొండేపూడి సత్యనారాయణ కి రూ. 15,000/-నందరాడ గ్రామానికి చెందిన గొర్రెల శ్రీనివాస్ కి రూ. 26,084/-పాలచర్ల గ్రామానికి చెందిన గంగిశెట్టి గౌరిలక్ష్మి కి రూ. 48,984/- పుణ్యక్షేత్రం గ్రామానికి చెందిన కట్టిమేను సత్యవతి కి రూ. 33,147/- రాదేయపాలెం గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి శ్రీను కి రూ. 20,732/-, పితాని సూర్యనారాయణ కి రూ. 31,365/-రాజానగరం గ్రామానికి చెందిన అన్నపరెడ్డి నాగమణి కి రూ.1,09,634/-, కొల్లి సూర్యకాంతం కి రూ. 32,324/-, వంక గణేష్ కి రూ. 32,786/-సంపత్ నగరం గ్రామానికి చెందిన సమర్తకుర్తి దుర్గమ్మ కి రూ. 30,028/-, ఈలి సత్యనారాయణ కి రూ. 20,524/-, చెల్లురి వరనాగ ప్రసాద్ కి రూ. 54,091/-శ్రీరామపురం గ్రామానికి చెందిన మాదారపు దేవి కి రూ. 30,028/-, రామిసెట్టి వెంకట రమణ మూర్తి కి రూ.86,240/-తోకాడ గ్రామానికి చెందిన ఈగి సుమంత్ కి రూ. 2,29,763/-, గుబ్బల పెద్ద వెంకాయమ్మ కి రూ. 37,292/-వెలుగుబంధ గ్రామానికి చెందిన సుంకర చక్రం కి రూ. 37,205/-, ప్రగడ నాగదేవి కి రూ. 25,655/-, దాసరి మనికంట కి రూ. 71,084/-, ప్రగడ కృష్ణవేణి కి రూ. 23,920/-ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## గూడూరు గాంధీనగర్ లోని ఎంపీపీ స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ - ఎమ్మెల్యే సునీల్ కుమార్



**నెల్లూరు బ్యూరో మార్చి 23(ప్రజా ప్రతిభ):**

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మొదటి నారా లోకేష్ విద్యార్థిని విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారని మధ్యాహ్నం భోజనం కూడా ఎంతో రుచికరంగా ఉందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు గాంధీనగర్ లోని ఎంపీపీ స్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని ఎమ్మెల్యే సునిల్ కుమార్ తనిఖీ చేశారు. పిల్లలతో కలిసి భోజనాన్ని స్వీకరించారు. అనంతరం క్లాస్ రూమ్ లో పరిసర ప్రాంతాలను పరిశీలించారు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ పాఠశాలలో అనేక మౌలికవస్తులు కల్పిస్తున్నారని మధ్యాహ్నం భోజనం కూడా ఎంతో నాణ్యతగా ఉందని తెలిపారు. పేద బిడ్డలు కూడా చదువుకోవాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిల్లలను పాఠశాలలకు పంపించిన తల్లులకు సంవత్సరానికి 15000 రూపాయలు నగదు జమ చేస్తున్నారని యూనిఫార్మ్ పుస్తకాలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఉచితంగా అందిస్తున్నారని గుర్తు చేశారు. పిల్లలు ఆడుకునే వస్తువులు కావాలని తెలిపారని వెంటనే వాటిని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మరియు నాయకులు భాస్కర్ రెడ్డి, కాంద్ర వెంకటేశ్వరరాజు, సోమరాజు వెంకటేశ్వరరాజు, మల్లికార్జున్ రెడ్డి, మహిళా నాయకురాలు గుండాల లీలావతి, మట్టం శ్రావణి రెడ్డి, గుండాల భారతి, తదితరులు పాల్గొన్నరు.

## గ్యాస్ ను సకాలంలో ప్రజలకు అందించాలి

### - సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి.హెచ్. ప్రభాకర్




**నెల్లూరు బ్యూరో మార్చి 23(ప్రజా ప్రతిభ):**

గ్యాస్ ను సకాలంలో ప్రజలకు సరఫరా చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి. హెచ్. ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యక్రమంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా, ఇరాన్ ల మధ్య యుద్ధం సాకుతో దేశంలో గ్యాస్ ధరలను పెంచడం ఎంతవరకు సబబు అన్నారు. దేశంలో చమురు, గ్యాస్ నిక్షేపాలు కు ఎటువంటి డోకా లేదని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు కానీ క్షేత్ర స్థాయిలో ఇది అమలు కావడంలేదన్నారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మాకు కంపెనీ ల నుండి రావడం లేదని చెబుతున్నారన్నారు. బుకింగ్ చేసుకొని వారం రోజులు గడుస్తున్న గ్యాస్ సిలిండర్ ప్రజల దగ్గరికి చేరడం లేదన్నారు. బ్లాక్ మార్కెట్ లో గ్యాస్ సిలిండర్ రెండు వేలు నుండి నాలుగు వేల రూపాయలు పలుకుతుందన్నారు. ఇకనైనా గ్యాస్ బ్లాక్ మార్కెట్ ను అరికట్టి, ప్రజలకు సకాలంలో గ్యాస్ సిలిండర్ ను అందించాలని తెలిపారు. గ్యాస్ నెపంతో హోటల్ యజమానులు ఇష్టానుసారం ఆహారపదార్థాలు పై అధిక ధరలు వసూలు చేస్తున్నారన్నారు. గ్యాస్ సిలిండర్లను సకాలంలో సరఫరా చేయని పక్షంలో ధర్నా చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శశి కుమార్, సీపీఐ నియోజక వర్గ సహాయక కార్యర్శి జమాలుల్లా, సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్,చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్,
ఏ.ఐ.టి.యు.సి నియోజకవర్గ కార్యదర్శి నారాయణ, ప్రజా నాట్య మండలి నాయకులు గోపాల్, వెంకటేశ్వర్లు , వెంకటయ్య, రిజ్వాన్, తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్లలో డక్కిలి అభివృద్ధి రూ 60 కోట్లు కేటాయింపు : ఎమ్మెల్యే కురుగొండ్ల ...



**వెంకటగిరి, మార్చి 23(ప్రజా ప్రతిభ ):**

రాబోయే రెండేళ్లలో డక్కిలి మండల అభివృద్ధికి రూ.60 కోట్లు కేటాయిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల వినతులు స్వీకరించారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.పదవులు శాశ్వతం కాదు ప్రజల సమస్యలు తీర్చినప్పుడే వాళు నిజమైన నాయకులు గా ప్రజలే గుర్తిస్తారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు.డక్కిలి మండల కేంద్రంలో సోమవారం జరిగిన గ్రీవెన్సుకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్బంగా ఎమ్మెల్యే కురుగొండ్ల మాట్లాడుతూ మండలంలో 1480 అర్జీలు కేవలం ఇళ్లకొసమే వచ్చాయని,వీరందరికీ ఇల్లు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు.ప్రతి సమస్యను గడువులోగా పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాలు జారీ చేసారు.అలాగే డక్కిలి మండలంలోని దేవుడు వెల్లంపల్లి నందు ఏప్రిల్ నెల 5వ తేది నుండి జరుగనున్న శ్రీశ్రీశ్రీ స్థంబాలగిరీశ్వరస్వామి వారి తిరునాళ్ల మహోత్సవ ఆహ్వాన వాల్ పోస్టర్లు ను ఆయన ఆవిష్కరణ చేసారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, మాధవయ్యపాలెం పి. ఏ. సి. యస్ అధ్యక్షులు రామచంద్రయ్య నాయుడు , మండల అధ్యక్షులు పొలంరెడ్డి కోటేశ్వర రెడ్డి,మండల ఎంపీపీ, మండల వైస్ ఎంపీపీ, తహసీల్దార్, మండలం క్లస్టర్ ఇంచార్జీ, యూనిట్ ఇంచార్జీలు మండల ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, మండల ప్రజలు పాల్గొన్నారు .

### ఆంధ్రా ప్రాంత మత్స్యకారుల సంరక్షణ కోసం తమిళనాడు

# పుదుచ్చేరి ప్రాంతాల దాడులనెదుర్కోనేందుకు ఎందాకైనా సిద్ధం

**మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి.**

**మత్స్యకారులకు సంపూర్ణ అండగా ఎన్ డి ఎ కూటమి ప్రభుత్వం..**

**- మత్స్యకార వర్గాల చిరకాల సమస్యకు శాశ్వత పరిష్కారం**

**దిశగా అధికార యంత్రాంగం మాస్టర్ ప్లాన్.**

**మత్స్యకారుల సమస్య పై ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ప్రత్యేక దృష్టి.**

**అన్ని విధాలుగా ఆదుకుంటాం.రాష్ట్ర దేవాదాయ**

**శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఉద్ఘాటన..**

**నెల్లూరు జిల్లా కలెక్టరేట్లో అధికారులతో సమీక్షించిన మంత్రి ఆనం.**



**నెల్లూరు బ్యూరో మార్చి 23(ప్రజా ప్రతిభ):**

నెల్లూరు రాష్ట్రంలోని తీర ప్రాంత మత్స్యకార సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, శాశ్వత పరిష్కారానికై గట్టి చర్యలకు ఉపక్రమించినట్లు రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.సోమవారం కలెక్టరేట్ లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ అజితా వేజెండ్ల, శాసనమండలి సభ్యులు రాంగోపాల్ రెడ్డి, బీద రవిచంద్ర, శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, పాశం సునీల్ కుమార్, నెలవల విజయశ్రీ తదితర నాయకులతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మత్స్యకార సమస్యలపై సుదీర్ఘంగా సమీక్షించారు.అనంతరం మంత్రి ఆనం మీడియాతో మాట్లాడుతూ తీర ప్రాంతంలోని మత్స్యకారులకు చిరకాలంగా పోరుగు రాష్ట్రాలైన తమిళనాడు, పుదుచ్చేరిల తో సమస్యలు ఉన్నాయని, వాటికి శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మన రాష్ట్ర మత్స్య సంపదను పొరుగు రాష్ట్రాలకు చెందిన మత్స్యకారులు హై పవర్ బోట్ల సహాయంతో దోచుకుంటున్న నేపథ్యంలో, ఇతర రాష్ట్రాలకు చెందిన బంధించిన నాలుగు బోట్లను గుర్తు తెలియని వ్యక్తులు విడుదల చేయించిన వైనం జిల్లా మత్స్యకారుల ఆవేదనకు కారణమైందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి సముద్ర జలాలపై గస్తీ కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుందన్నారు. ఈ దిశగా వివిధ శాఖల అధికారులు ఇప్పటికే ప్రయోగాత్మకంగా గస్తీ బోటు ను పరీక్షించారన్నారు. మెరైన్ పోలీస్, అటవీ, మత్స్య శాఖ, అగ్నిమాపక శాఖ లకు చెందిన అధికారులతో రెండు బొట్లు 24ఇ7 విధానంలో సముద్రంలో ఏప్రిల్ 14 వరకు గస్తీ తిరుగుతాయన్నారు. ఏప్రిల్ 15 నుండి రెండు నెలలపాటు వేట నిషేధం అమల్లోకి వస్తున్నందున, ఈలోపు మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు.అందుకనుగుణంగా ముఖ్యమంత్రి ఆదేశాలతో రాష్ట్రస్థాయి ప్రత్యేక బృందం మంగళవారం జిల్లా కు విచ్చేస్తుందన్నారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రత్యేక బృందంతో సమావేశమై చర్చించి ప్రభుత్వానికి ఆచరణాత్మక నివేదిక సమర్పిస్తుందన్నారు. జిల్లాలోని మత్స్యకారులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని, కూటమి ప్రభుత్వానికి ఎల్లప్పుడూ అండగా ఉండే మత్స్యకారులకు తోడుగా ఉంటామని మంత్రి ఆనం ఉద్ఘాటించారు. మూడు రాష్ట్రాల చెందిన సమస్య అయినందున కేంద్రానికి సైతం నివేదిక అందించి శాశ్వత పరిష్కారం కొరకు తీవ్ర ప్రయత్నాలు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, నాయకులు గిరిధర్ రెడ్డి, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ శాంతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బాలికల గురుకుల కళాశాలను ఎమ్మెల్యే కురుగొండ్ల ఆకస్మిక తనిఖీ...

### - భోజన నాణ్యత లేకపోవడంపై సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం...






**డక్కిలి, మార్చి 23(ప్రజా ప్రతిభ ):**

డక్కిలి మండల కేంద్రం లోని బాలయోగి బాలికల గురుకుల కళాశాలలో విద్యార్థినులకు అందిస్తున్న భోజన నాణ్యత డొల్లతనం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అఖస్మిక తనిఖీ తో బట్టబయలైంది.సోమవారం డక్కిలి మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల దినం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మద్యహ్నం సమయానికి డక్కిలిలోని బాలికల గురుకుల కళాశాలను ఆకస్మికంగా కళాశాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కళాశాలలో జరుగుతున్న అనేక లోపాలు బహిర్గతం అయ్యాయి.విద్యార్థినులకు అందిస్తున్న ఆహారం అత్యంత నాసిరకంగా ఉండటంతో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.లి"ఇది పప్పా లేక రసమా? మీ పిల్లలకు ఇలాగే వడ్డిస్తారా?" అంటూ సిబ్బందిని నిలదీశారు. 450 మంది విద్యార్థినులు ఉన్నప్పటికీ వందమందికి సరిపడేలా మాత్రమే కూరలు వండుతున్నారని గుర్తించారు.చాలీచాలని పరిమాణంలో, తక్కువ తాళింపు తో వండిన ఆకుకూరలు, రసంలా ఉన్న పప్పు చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు.ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మెరుగైన మెనూను అమలు చేస్తున్నప్పటికీ, ఇక్కడ మాత్రం ఆచరణలో విఫలమవుతున్నారని విమర్శించారు. ఉదయం ఇవ్వాల్సిన పాలు, గుడ్లు, స్నాక్స్ విద్యార్థినులకు అందడం లేదని వెల్లడించారు. అంతేకాకుండా, రాత్రి మిగిలిన రసాన్ని మళ్లీ వడ్డిస్తున్నారని ఆరోపించారు.ఇంత జరుగుతున్నప్పటికీ ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, గురుకుల కళాశాలలో జరుగుతున్న దారుణాలపై సమగ్రంగా విచారణ జరిపించమని కోరుతామని తెలిపారు. గురుకులంలో పనిచేస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకుని, అవసరమైతే ప్రక్షాళన చేసి, సమర్థులైన ఉద్యోగులను నియమించాలని సూచించారు. ప్రస్తుత భోజన సరఫరా సంస్థను రద్దు చేసి, కొత్త సంస్థకు బాధ్యతలు అప్పగించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.విద్యార్థుల ఆరోగ్యంపై ఇలాంటి నిర్లక్ష్యం కొనసాగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, మాధవయ్యపాలెం పి. ఏ. సి. యస్ అధ్యక్షులు రామచంద్రయ్య నాయుడు ,మండల అధ్యక్షులు పొలంరెడ్డి కోటేశ్వర రెడ్డి,మండల ఎంపీపీ, మండల వైస్ ఎంపీపీ, తహసీల్దార్, మండలం క్లస్టర్ ఇంచార్జీ, యూనిట్ ఇంచార్జీలు పాల్గొన్నారు.

## శ్రీ శివలింగేశ్వర స్వామి పటప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న యువరాజా సర్వజ్ఞ...






**వెంకటగిరి, మార్చి 23(ప్రజా ప్రతిభ ):**

తిరుపతి జిల్లా వెంకటగిరి మండలశీ పారవోలు గ్రామపంచాయతీలోని శివలింగాపురం గ్రామంలో కి.శే రాజా వి వి, వి ఆర్ కె యాచేంద్ర జ్ఞాపకార్థంతో మనవడు యువరాజా వి. వి ఎస్ సర్వజ్ఞ కుమార కృష్ణ యాచెంద్ర తన సొంత నిధులతో శ్రీశ్రీశ్రీ శివలింగేశ్వర స్వామి ఆలయం నిర్మించడం జరిగింది. ఈ సందర్బంగా సోమవారం జరిగిన శ్రీశ్రీశ్రీ శివలింగేశ్వర స్వామి ఆలయం పటప్రతిష్ట ప్రారంభోత్సవ కార్యక్రమంలో వెంకటగిరి రాజా కుటుంబీకులు యువరాజ సర్వజ్ఞ కుమార కృష్ణ యాచెంద్ర పాల్గొన్నారు.గ్రామ పెద్దల తో నిర్మాణ మహా కుంభాభిషేక కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం యువరాజా మాట్లాడుతూ... భారతదేశంలో స్వాతంత్రం రాకముందు బ్రిటిష్ పరిపాలన కాకముందు రాజుల పాలనలో పారవోలు గ్రామ ప్రజలతో అనుబంధం గుర్తు చేసుకుంటూ మా కుటుంబానికి పారవోలు గ్రామం కు ఎంతో ప్రేమ అనుబంధం కలిగి ఉందని ఈ గ్రామ ప్రజలకు మా కుటుంబం ఎప్పుడు రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. పార్వతీ పరమేశ్వరుల ఆజ్ఞతో మా తాత గారి జ్ఞాపకార్థం ఈ గుడి నిర్మాణం చేపట్టడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారవోలు ఎంపిటిసి పి. శ్రీదేవి సదానంద రెడ్డి. మాజీ మండల అధ్యక్షుడు రామచంద్రయ్య. మాజీ సర్పంచ్ కోటేశ్వర్ రెడ్డి,ఆవుల వెంకటేశ్వరరావు. ధనుంజయ. మాజీ కౌన్సిలర్ లు ఢిల్లీ బాబు, యం. ఏ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అంతా నా ఇష్టం అన్న హాస్టల్ వ్యవహారం. పిల్లల భోజనంపై నిర్లక్ష్యం

**ప్రకాశం జిల్లా బ్యూరో / కుందూరు శ్రీనివాసరెడ్డి, మార్చి 23, (ప్రజా ప్రతిభ):**





మార్కాపురం జిల్లా, పెద్దారవీడు మండలం సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో జరుగుతున్న, పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ అమలు కాకపోవడం, పిల్లలకు సరిపడా ఆహారం అందకపోవడం వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. వసతి గృహాన్ని పరిశీలించిన సమయంలో సంక్షేమ అధికారి అక్కడ లేకపోవడం గమనార్హం. కేవలం వంట మనిషి మాత్రమే అక్కడ ఉన్నాడు. మొత్తం 90 మంది విద్యార్థులు ఉండాల్సిన హాస్టల్ లో కేవలం 20 మంది మాత్రమే ఉన్నారు. ఇదే పరిస్థితి హాస్టల్ నిర్వహణలో ఉన్న నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తోంది. ఆదివారం మెనూ ప్రకారం పలావు, చికెన్ కర్రీ, పెరుగు ఇవ్వాల్సి ఉండగా, వాస్తవానికి తెల్ల అన్నం, కొద్దిపాటి చికెన్, నీళ్ల మజ్జిగ మాత్రమే పిల్లలకు అందించారు. పిల్లలు ఒక్కసారి తీసుకున్నాకే చికెన్ అయిపోవడం గమనించబడింది. దీనిపై వంట మనిషిని ప్రశ్నించగా, పిల్లలు తక్కువగా ఉన్నందున తక్కువ వండామని, పలావు బదులు తెల్ల అన్నం వండామని చెప్పడం మరింత సందేహాలకు తావిస్తోంది. వార్డెన్ ఆదేశాల ప్రకారం ఇలా చేశారా, లేక స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకుంటున్నారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన మెనూను పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. హాస్టల్ పరిసరాల్లో అపరిశుభ్రత కూడా కనిపించింది. పిల్లలు భోజనం చేసే ప్రదేశంలో నీళ్లు, అన్నం మెతుకులు చిందరవందరగా ఉండడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బయట వాతావరణం కూడా శుభ్రంగా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ వ్యవహారంపై వార్డెన్ నిర్లక్ష్యం, సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణమా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పిల్లలకు అందాల్సిన సదుపాయాలు, పోషకాహారం అందకపోవడం బాధాకరం. ఇదిలా ఉండగా, సంబంధిత అధికారి ఫోన్ కు పలుమార్లు ప్రయత్నించినా స్పందించకపోవడం గమనించదగ్గ విషయం. ఈ ఘటనపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించి, బాధ్యులపై చర్యలు తీసుకుని, హాస్టల్ లో సరైన మెనూ అమలు అయ్యేలా చర్యలు చేపట్టాలని స్థానికులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

RNI: APTEL 2013/54721
https://prajaprathibha.com
ప్రజా ప్రతిభ
ప్రతి అక్షరం ప్రజా పక్షం
తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ జిల్లాలు
AndhrapradeshDistricts

# మల్లయ్య మృతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మార్చి 23 (ప్రజా ప్రతిభ):**

మార్కాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో,సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో, ఇడుపూరు గ్రామానికి చెందిన మల్లయ్య అనుమానాస్పద మృతి అంశం తీవ్ర చర్చకు దారి తీసింది.కాపు, బలిజ సంఘం నాయకులు జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులను కలిసి వినతిపత్రం సమర్పిస్తూ, మల్లయ్య మృతికి కారణమైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మార్కాపురం మండలం ఇడుపూరు గ్రామానికి చెందిన మల్లయ్య మూడు రోజుల క్రితం, అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై గ్రామంలో ఆందోళన, ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మల్లయ్య మృతి సాధారణం కాదని, దీనికి పక్కా కుట్ర ఉందని కాపు, బలిజ సంఘం నాయకులు ఆరోపించారు.మల్లయ్య మృతి ముందు అతనికి ఫోన్ ద్వారా ప్రాణహానీ హెచ్చరికలు వచ్చాయని నాయకులు పేర్కొన్నారు. టిడిపి రాష్ట్ర నాయకుడు డి. మస్తాన్, మల్లయ్యకు ఫోన్ చేసి చంపేస్తానని బెదిరించిన ఆడియో కాల్ రికార్డు తమ వద్ద ఉన్నట్లు తెలిపారు. ఆ రికార్డును జాయింట్ కలెక్టర్ కు వినిపించి తమ వాదనకు బలం చేకూర్చారు. ఈ ఆడియో కాల్ ఆధారంగా విచారణ జరిపితే అసలు నిజాలు బయటపడతాయని వారు అన్నారు.మల్లయ్య గతంలో భూమి వ్యవహారానికి సంబంధించి వివాదంలో ఉన్నాడని, అదే వివాదం ఈ ఘటనకు కారణమై ఉండొచ్చని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి నిజానిజాలు వెలికితీయాలని నాయకులు కోరారు. దర్యాప్తు ఆలస్యం చేస్తే ఆధారాలు మాయం అయ్యే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, కేసును వేగవంతంగా ముందుకు తీసుకెళ్లాలని, సంబంధిత అధికారులను బాధ్యతగా వ్యవహరించాల్సిందిగా నాయకులు విజ్ఞప్తి చేశారు. మల్లయ్య కుటుంబ సభ్యులు ప్రస్తుతం తీవ్ర ఆందోళనలో ఉన్నారని, వారికి భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ ఘటనపై జిల్లా యంత్రాంగం సీరియస్ గా స్పందించి నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని,



బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాపు, బలిజ సంఘం నాయకులు అందే నాసరయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొని మల్లయ్య కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

# లక్షన్నర భక్తులతో కాటంరాజు గంగాభవాని వైభవంగా తిరుణాలు.

## - ఆలయ కమిటీకి ఘన సన్మానం, సేవలకు ప్రశంసల వెల్లువ

**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మార్చి 23, (ప్రజా ప్రతిభ):**

మార్కాపురం జిల్లా, ఎర్రగొండపాలెం, మార్కాపురం నియోజకవర్గాల పరిధిలో నిర్వహించిన, వేణుతల కాటంరాజు గంగాభవాని తిరుణాలు ఈసారి అపూర్వమైన భక్తి, భక్తజన సందోహంతో అద్భుతంగా సాగాయి. సుమారు లక్షన్నర మందికి పైగా భక్తులు తరలి రావడంతో గ్రామం పండుగ వాతావరణంతో కళకళలాడింది. భక్తుల రాకతో ప్రతి వీధి సందడి నిండగా, తిరుణాల ప్రాంగణం నిత్యం కోలాహలంగా మారింది.ఇంత భారీ స్థాయిలో భక్తులు తరలి వచ్చినప్పటికీ, ఎటువంటి అంతరాయం లేకుండా పండుగను సజావుగా నిర్వహించడంలో ఆలయ కమిటీ విశేష పాత్ర పోషించింది. భక్తుల కోసం వసతి సౌకర్యాలు, తాగునీరు, అన్నదాన కార్యక్రమాలు, పారిశుద్ధ్య ఏర్పాట్లు, భద్రతా చర్యలు వంటి అన్ని అంశాలలో కమిటీ ముందుచూపుతో వ్యవహరించింది. దీనితో భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తిరుణాలను ఆనందంగా దర్శించుకున్నారు.ఈ క్రమంలో సేవలను గుర్తిస్తూ ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు పి ఎల్ పి యాదవ్, అధ్యక్షుడు గుమ్మా గంగరాజు యాదవ్ లను బీసీవై పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. పూలమాలలు వేసి, శాలువాలతో కప్పి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎర్రగొండపాలెం, మార్కాపురం నియోజకవర్గాల బీసీవై పార్టీ ఇన్చార్జులు ఆత్మానంద్ యాదవ్, న్యాయవాది విజయవర్ధన్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆత్మానంద్ యాదవ్ మాట్లాడుతూ, కాటంరాజు గంగాభవాని తిరుణాలు ప్రతి సంవత్సరం జరుగుతున్నప్పటికీ, ఈసారి జరిగిన ఉత్సవాలు ప్రత్యేకంగా నిలిచాయని అన్నారు. కమిటీ సభ్యుల అంకితభావం, భక్తుల సహకారం, దాతల ఆర్థిక సహాయం కలిసి ఈ విజయానికి కారణమయ్యాయని వివరించారు. పండుగ నిర్వహణలో రాజకీయ భేదాలు లేకుండా అన్ని వర్గాల వారు కలిసి పనిచేయడం విశేషమని పేర్కొన్నారు.తిరుణాల్లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభలు భక్తులను ఆకట్టుకున్నాయి. తెలుగుదేశం పార్టీ రెండు ప్రభలు, బీసీవై పార్టీ ఒక ప్రభ, వైయస్సార్సీపీ ఒక ప్రభ ఏర్పాటు చేయడంతో ప్రాంగణం వెలుగులతో మెరిసిపోయింది. ప్రతి ప్రభ వద్ద ప్రత్యేక అలంకరణలు, విద్యుత్ దీపాల అద్భుత ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో భక్తులు గంటల తరబడి ఆస్వాదించారు.ప్రత్యేకంగా బీసీవై పార్టీ ఏర్పాటు చేసిన ఎలక్ట్రికల్ ప్రభ వద్దకు సుమారు ఇరవై ఐదు వేల మంది అభిమానులు, యాదవులు, భక్తులు విచ్చేసి కార్యక్రమాలను తిలకించారు. సంగీత నృత్య ప్రదర్శనలు, భక్తి గీతాలు, నాట్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది.ఇతర ప్రభలను సందర్శించినట్లుగానే తమ ప్రభ వద్దకు కూడా ఆలయ కమిటీ సభ్యులు విచ్చేసి సహకరించాలని కోరినట్లు నాయకులు తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం అన్ని వర్గాల వారు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా న్యాయవాది విజయవర్ధన్ యాదవ్ మాట్లాడుతూ, కాటంరాజు గంగాభవాని ఆలయం అభివృద్ధికి తమ వంతు సహకారం



అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. పార్టీ అధినేత బోడే రామచంద్ర యాదవ్ తో చర్చించి ఆలయ బోనర్ నిర్మాణానికి భారీ స్థాయిలో సహకారం అందించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. భక్తుల సౌకర్యాల కోసం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.తిరుణాల సమయంలో భక్తుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ నియంత్రణ, జనసందోహం నియంత్రణ, అత్యవసర సేవల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయడం జరిగింది. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అవసరమైన వారికి చికిత్స అందించారు. తాగునీటి ట్యాంకర్లు, మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పారిశుద్ధ్యం మెరుగుపడింది.అన్నదాన కార్యక్రమాలు తిరుణాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేలాది మంది భక్తులకు రోజూ అన్నప్రసాదం అందించారు. దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందించడం గమనార్హం. గ్రామస్థులు, యువకులు స్వచ్ఛంద సేవకులుగా పనిచేసి పండుగ విజయానికి తోడ్పడ్డారు.మొత్తం మీద ఈసారి కాటంరాజు గంగాభవాని తిరుణాలు భక్తి, సేవ, ఐక్యతకు ప్రతీకగా నిలిచాయి.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా శాంతియుతంగా, విజయవంతంగా ముగియడం విశేషంగా చెప్పుకోవచ్చు. భక్తుల స్పందన, కమిటీ కృషి, దాతల సహకారం కలిసి ఈ తిరుణాలను మరపురాని వేడుకగా నిలిపాయి.

# అకాల వర్షాలతో రైతులపై భారీ నష్టం.





**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మార్చి 23 (ప్రజా ప్రతిభ):**

మార్కాపురం పరిసర ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షాలు రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. ముఖ్యంగా అర్ధవీడు మండలం నాగులవరం గ్రామానికి చెందిన మొక్కజొన్న రైతులు భారీ నష్టాలను చవిచూశారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలు, ఈదురు గాలులు పంటలను పూర్తిగా నేలమట్టం చేశాయి.పంట కోతకు సిద్ధమైన సమయంలో వచ్చిన ఈ విపత్తు రైతుల ఆశలను చిదిమేసింది. పొలాల్లో నిలువగా ఉన్న మొక్కజొన్న పంట గాలులకు వంగిపోయి, వర్షపు నీటిలో కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. రైతులు పెట్టిన పెట్టుబడులు తిరిగి రావడం కష్టమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ ప్రాంతంలో చాలా మంది రైతులు అప్పులు తీసుకుని పంటలు సాగు చేశారు. ప్రస్తుతం పంట నష్టంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుటుంబాలను పోషించుకోవడం కూడా కష్టమవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నష్టపోయిన పంటలను అధికారులు వెంటనే పరిశీలించి, తగిన పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే గ్రామానికి చేరుకుని పంట నష్టాన్ని అంచనా వేసి నివేదిక సమర్పించాలని స్థానికులు కోరుతున్నారు. రైతులను ఆదుకునే చర్యలు వెంటనే ప్రారంభించకపోతే పరిస్థితి మరింత విషమిస్తుందని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

# మార్కాపురం జిల్లా పోలీస్ కార్యాలయానికి స్థలం పరిశీలన ఎస్పీ.





**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మార్చి 23 (ప్రజా ప్రతిభ):**

నూతన మార్కాపురం జిల్లా కేంద్రంలో పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో జిల్లా పోలీస్ కార్యాలయ నిర్మాణానికి చర్యలు వేగం పుంజుకున్నాయి. ఈ క్రమంలో మార్కాపురం– –పొదిలి ప్రధాన రహదారిపై రాయవరం గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని జిల్లా పోలీస్ అధికారి వి హర్షవర్ధన్ రాజు సోమవారం పరిశీలించారు.సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూమి పోలీస్ కార్యాలయ నిర్మాణానికి అనుకూలమా అనే అంశంపై సమగ్రంగా సమీక్ష జరిగింది. భూమి స్థితిగతులు, రహదారి సౌకర్యాలు, రవాణా సదుపాయాలు, భద్రతా పరమైన అంశాలు, ప్రజలకు సులభంగా చేరుకునే వీలున్నదా వంటి అంశాలను అధికారులు వివరిస్తూ నివేదికలు అందించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విస్తరణకు అవకాశం ఉన్నదా అనే విషయాన్ని కూడా పరిశీలించారు.జిల్లా పోలీస్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయం, పరేడ్ గ్రౌండ్, ఆర్మ్డ్ రిజర్వ్ విభాగాల ఏర్పాటు కోసం అవసరమైన స్థల వినియోగంపై అధికారులతో చర్చ జరిగింది. ఒకే ప్రాంగణంలో అన్ని విభాగాలను సమీకరించడం ద్వారా పరిపాలనలో వేగం పెరగడంతో పాటు ప్రజలకు త్వరితగతిన సేవలు అందే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తమైంది.అయితే ప్రస్తుతంగా పరిశీలించిన స్థలం మాత్రమే కాకుండా, మరింత చదునుగా ఉండే, అన్ని విధాలుగా అనుకూలమైన ప్రత్యామ్నాయ ప్రదేశాలను కూడా గుర్తించి పరిశీలించాలని రెవెన్యూ శాఖ, పోలీస్ అధికారులకు సూచనలు ఇచ్చారు. తుది నిర్ణయం తీసుకునే ముందు అన్ని కోణాలను పరిశీలించాలని స్పష్టం చేశారు.ఈ పరిశీలన కార్యక్రమంలో డిఎస్పీ నాగరాజు, ప్రత్యేక శాఖ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, సీఐ సుబ్బారావు, రూరల్ ఎస్సై వేమన, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.జిల్లా పోలీస్ కార్యాలయ నిర్మాణం పూర్తయితే మార్కాపురం జిల్లాలో పోలీస్ సేవలు మరింత సమర్థవంతంగా, ప్రజలకు అందుబాటులో ఉండేలా మారనున్నాయి.

# ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెంచాలి, ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు



**ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మార్చి 23, (ప్రజా ప్రతిభ):**

మార్కాపురం జిల్లా, ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని, వెంటనే విచారణ చేపట్టి బాధితులకు ఆలస్యం లేకుండా న్యాయం అందించాల్సిన అవసరం ఉందని మార్కాపురం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ వ్యవస్థ మరింత స్పందనతో పని చేయాలని ఆయన స్పష్టం చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ ఈ సూచనలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా వినిపించారు. మొత్తం 41 ఫిర్యాదులు ఈ కార్యక్రమంలో స్వీకరించబడ్డాయి. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, భూ వివాదాలు, ఆర్థిక మోసాలు, ఆన్‌లైన్ మోసాలు, ఉద్యోగ సంబంధిత సమస్యలు వంటి విభిన్న అంశాలపై ఫిర్యాదులు వచ్చాయి. ప్రతి ఫిర్యాదును సవివరంగా నమోదు చేసి, సంబంధిత అధికారులకు పంపించారు.ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ, వారి సమస్యలను ఓర్పుతో విని, వెంటనే చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించారు. చట్టపరమైన ప్రక్రియను వేగవంతం చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రజలు పోలీస్ శాఖపై నమ్మకం ఉంచేలా వ్యవహరించడం ప్రతి అధికారికి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి, వచ్చిన ఫిర్యాదుల వివరాలను తెలియజేశారు. ప్రతి కేసును గడువు లోపల పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై స్పష్టమైన నివేదికలను సమర్పించాలని చెప్పారు.నిర్లక్ష్యం చేసిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజలు పోలీస్ కార్యాలయానికి వచ్చే సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ముఖ్యంగా వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, మహిళలు వంటి వారికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా మాట్లాడి, వారి సమస్యలను అర్థం చేసుకోవడం ద్వారా పోలీస్ శాఖపై విశ్వాసం పెరుగుతుందని తెలిపారు.జిల్లా పోలీస్ కార్యాలయానికి రావడానికి సాధ్యంకాని వారు తమ సమీప పోలీస్ స్టేషన్లు, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో కూడా ఫిర్యాదులు సమర్పించవచ్చని ఎస్పీ తెలిపారు. ప్రజలు ఎక్కడ ఉన్నా తమ సమస్యలకు పరిష్కారం లభించేలా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు.మీకోసం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా వినడం, వెంటనే పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం వల్ల పోలీస్ శాఖ పనితీరుపై సానుకూల అభిప్రాయం పెరుగుతోందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రజలకు ఒక నమ్మకమైన వేదికగా మారిందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో ఒంగోలు డిఎస్పీ నాగరాజు, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, మార్కాపురం సీఐ సుబ్బారావు, పామూరు సీఐ శ్రీనివాసరావు, త్రిపురాంతకం సీఐ అస్సన్, మార్కాపురం టౌన్ ఎస్సై సైదుబాబు, రూరల్ ఎస్సై వేమన తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మోదీ దీర్ఘకాల పాలనపై జగన్ అభినందనలు. చారిత్రాత్మక రికార్డు నమోదు.



**ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మార్చి 23 (ప్రజా ప్రతిభ):**

నరేంద్ర మోదీ సుదీర్ఘ ప్రజాసేవలో అరుదైన మైలురాయిని అధిగమించగా, దీనిపై వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అభినందనలు తెలిపారు. ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తూ, పరిపాలనలో స్థిరత్వం చూపుతూ ఇంతటి కాలం అధికారంలో కొనసాగడం ఒక విశిష్ట ఘట్టమని ఆయన పేర్కొన్నారు. సోమవారం సామాజిక మాధ్యమ వేదికగా స్పందించిన జగన్, మోదీ సాధించిన ఈ ఘనత ఆయన పట్టుదల, క్రమశిక్షణ, సంకల్పానికి ప్రతీక అని అన్నారు.దేశ సేవలో ఎప్పటికీ అలుపెరగని సేవాభావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. దేశ అభివృద్ధి కోసం మరింత శక్తి, ఆరోగ్యం కలగాలని కోరుతూ తన శుభాకాంక్షలు తెలిపారు. మోదీ రాజకీయ ప్రస్థానం సాధారణ స్థాయి నుంచి ప్రారంభమై, క్రమంగా ఉన్నత స్థానాలకు ఎదిగిన విధానం ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తోంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి అభివృద్ధి దిశగా అనేక నిర్ణయాలు తీసుకుని రాష్ట్రాన్ని ముందుకు నడిపించారు. అనంతరం దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించి, పరిపాలనలో కొత్త విధానాలు అమలు చేస్తూ దేశ రాజకీయాల్లో ప్రత్యేక ముద్ర వేశారు. మొత్తం 8,931 రోజులపాటు ప్రభుత్వాధినేతగా కొనసాగడం ద్వారా మోదీ స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యధిక కాలం అధికారంలో ఉన్న నాయకుడిగా నిలిచారు. ఈ క్రమంలో ఆయన ఇప్పటివరకు ఉన్న రికార్డును అధిగమించి కొత్త చరిత్ర సృష్టించారు. ఈ సాధనతో దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారారు. ఇంతకుముందు ఈ రికార్డు పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట ఉండేది. ఆయన సిక్కిం ముఖ్యమంత్రిగా 8,930 రోజులపాటు పదవిలో కొనసాగి దీర్ఘకాల పాలనకు ఉదాహరణగా నిలిచారు.ప్రస్తుతం ఆ రికార్డును మోదీ అధిగమించడం విశేషంగా నిలిచింది.దీర్ఘకాలం అధికారంలో కొనసాగడం అనేది కేవలం రాజకీయ అదృష్టం మాత్రమే కాకుండా ప్రజల విశ్వాసం, నాయకత్వ సామర్థ్యం, పరిపాలనా దృక్పథం వంటి అంశాల సమ్మేళనమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పాలనలో స్థిరత్వం, నిర్ణయాలలో దృఢత్వం, ప్రజలతో అనుసంధానం వంటి లక్షణాలు మోదీకి ఈ స్థాయిని తీసుకువచ్చినట్లు భావిస్తున్నారు.దేశవ్యాప్తంగా ఈ ఘనతపై పలువురు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రముఖులు అభినందనలు తెలుపుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో కూడా మోదీ సాధించిన ఈ మైలురాయి విస్తృతంగా చర్చకు దారితీసింది.మోదీ సాధించిన ఈ అరుదైన రికార్డు భారత రాజకీయ చరిత్రలో ఒక ముఖ్యమైన అధ్యాయంగా నిలిచిపోనుంది. దీర్ఘకాల ప్రజాసేవ, పరిపాలనా అనుభవం కలిగిన నాయకుడిగా ఆయన మరింత కాలం దేశానికి సేవలు అందించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

# మార్కాపురంలో తీరిన ట్రాఫిక్ సమస్య

**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మార్చి 23,(ప్రజా ప్రతిభ ):**

మార్కాపురం జిల్లా కేంద్రంగా ఏర్పడిన తర్వాత వేగంగా అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయి. అయితే అదే సమయంలో పట్టణంలో వాహనాల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్ సమస్య, రోజురోజుకు తీవ్రమై ప్రజలకు ఇబ్బందులను కలిగించింది. ముఖ్యంగా రద్దీ కూడళ్ల వద్ద గంటల తరబడి నిలిచిపోయే పరిస్థితులు నెలకొనడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యాన్ని అనుభవించారు. వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు రోజువారీ పనుల్లో ఆలస్యం ఎదుర్కొన్నారు. అత్యవసర సేవలకైనా రాకపోకలు కష్టతరమయ్యాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ప్రజల నుంచి వచ్చిన వినతులు అధికారుల దృష్టికి వెళ్లాయి. జనవరి 5న నిర్వహించిన ప్రజా వినతుల కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ట్రాఫిక్ సమస్యపై వినతిపత్రాన్ని సమర్పించారు. పట్టణ అభివృద్ధికి ట్రాఫిక్ నియంత్రణ అత్యంత అవసరమని ఆయన అప్పట్లోనే స్పష్టం చేశారు.సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న జిల్లా పోలీసు యంత్రాంగం వెంటనే స్పందించింది.జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టి సమగ్ర ప్రణాళిక రూపొందించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లను గుర్తించి, అక్కడ ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ మార్చి 16న ఆధునిక ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను అమల్లోకి తీసుకువచ్చారు. ఈ వ్యవస్థలో సమయానుసారం మారే సిగ్నల్స్, వాహన రద్దీకి అనుగుణంగా నియంత్రణ వంటి ప్రత్యేకతలు ఉన్నాయి.అదేవిధంగా ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పోలీసు సిబ్బందిని కీలక ప్రాంతాల్లో నియమించారు. రోడ్లపై అనధికార పార్కింగ్‌పై చర్యలు తీసుకున్నారు. రహదారులపై నిలిచిపోయే వాహనాలను తొలగించే చర్యలు చేపట్టారు. ముఖ్య కూడళ్ల వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు వివరించారు. ఫలితంగా కొద్ది రోజుల్లోనే పట్టణంలో ట్రాఫిక్ పరిస్థితులు మెరుగుపడ్డాయి.ఈ చర్యల ఫలితంగా ప్రస్తుతం మార్కాపురం పట్టణంలో వాహన రాకపోకలు గణనీయంగా సులభమయ్యాయి. గతంలో గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితులు తగ్గి, ఇప్పుడు తక్కువ సమయంలోనే గమ్యస్థానాలకు చేరుకునే వీలవుతోంది.వ్యాపార కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు సమయానికి తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. అత్యవసర సేవలకు కూడా మార్గం సులభమైంది.ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీని కలిసిన డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పోలీసు యంత్రాంగం చూపిన చురుకుదనాన్ని ప్రశంసించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను ఆలస్యం చేయకుండా పరిష్కరించడం మంచి పరిపాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో తీసుకున్న చర్యలు ఇతర పట్టణాలకు ఆదర్శంగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు.అలాగే భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్య మళ్లీ తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెరుగుతున్న వాహనాల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని మరిన్ని కూడళ్ల వద్ద సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. రోడ్డు



భద్రతపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై కట్టుదిట్టమైన చర్యలు కొనసాగించాలని అభిప్రాయపడ్డారు.ప్రజల సౌకర్యం కోసం ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా తెలిపారు. పట్టణ అభివృద్ధి అనేది కేవలం మౌలిక వసతులపైనే కాకుండా, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాదం కిషోర్, మురళి తదితరులు పాల్గొన్నారు. వారు కూడా ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై సంతోషం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు ఇలాగే స్పందించాలని కోరారు.మొత్తంగా చూస్తే, మార్కాపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు లభించిన ఈ పరిష్కారం ప్రజలకు ఊరటనిచ్చింది. సమన్వయంతో తీసుకున్న నిర్ణయాలు, వేగంగా అమలు చేసిన చర్యలు ఫలితాన్నిస్తాయని ఈ పరిణామం స్పష్టం చేసింది.భవిష్యత్తులో కూడా ఇలాంటి చర్యలు కొనసాగితే మార్కాపురం పట్టణం మరింత సౌకర్యవంతమైన నగరంగా అభివృద్ధి చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## కలెక్టరేట్‌కు చేరిన దోర్నాల టోల్ ప్లాజా పేరు వివాదం



**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మార్చి 23, (ప్రజా ప్రతిభ):**

మార్కాపురం జిల్లా, దోర్నాల మండలం హసనాబాద్ -- జమ్మి దోర్నాల గ్రామాల మధ్య నిర్మించిన టోల్ ప్లాజా పేరు వివాదం జిల్లా స్థాయికి చేరింది. సోమవారం మార్కాపురం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో హసనాబాద్ గ్రామస్థులు సమూహంగా హాజరై అర్జీ సమర్పించారు.టోల్ ప్లాజా నిర్మాణానికి తమ గ్రామ పరిధిలోని విలువైన వ్యవసాయ భూములు ఇచ్చామని గ్రామస్థులు తెలిపారు. భూములు కోల్పోయిన తమ గ్రామానికి గుర్తింపు రావాలంటే టోల్ ప్లాజాకు హసనాబాద్ పేరు పెట్టాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న పేరును మార్చి తమ గ్రామం పేరును అధికారికంగా నిర్ణయించాలని కోరారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరగాలంటే కనీసం పేరు రూపంలో అయినా గుర్తింపు ఇవ్వాలని అన్నారు. స్థానికుల భావోద్వేగాలను పరిగణనలోకి తీసుకుని అధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఇక ఆదివారం సాయంత్రం టోల్ ప్లాజా వద్ద గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ప్లాజా పేరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో స్థానిక అధికారులు జోక్యం చేసుకుని గ్రామస్థులను శాంతింపజేశారు.విషయం తీవ్రత దృష్ట్యా అధికారులు నివేదిక సేకరించి పైస్థాయికి పంపే అవకాశమున్నట్లు సమాచారం. రెండు గ్రామాల మధ్య వివాదం మరింత ముదరకుండా పరస్పర చర్చల ద్వారా పరిష్కారం కనుగొనే దిశగా చర్యలు తీసుకునే సూచనలు కనిపిస్తున్నాయి.

## పొదిలిలో ఆగని గ్యాస్ ‘దందా’.. నిమ్మకు నీరెత్తినట్లు అధికారులు!





**మార్కాపురం జిల్లా ప్రతినిధి / కొండ్రు వెంకటేశ్వర్లు, మార్చి 23,( ప్రజా ప్రతిభ)**

పొదిలి పట్టణంలో గ్యాస్ సిలిండర్ల అక్రమ విక్రయాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని దళారులు బహిరంగంగానే దోపిడీకి తెరలేపారు. ప్రభుత్వ అధికార యంత్రంగం నిద్రావస్థలో ఉందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.బ్లాక్‌లో రూ. 3,000 వరకు వసూలుగృహ అవసరాలకు వినియోగించాల్సిన సిలిండర్లను దళారులు అక్రమంగా నిల్వ చేస్తూ, ఒక్కో సిలిండర్‌ను రూ. 2,000 నుండి రూ. 3,000 వరకు విక్రయిస్తున్నారు. నిత్యావసర వస్తువుల ధరలతో అల్లాడుతున్న సామాన్యుడిపై ఈ అదనపు భారం మరింత కుంగదీస్తోంది.చిరువ్యాపారుల పరిస్థితి దారుణంవ్యాపార అవసరాలకు వినియోగించే సిలిండర్లు సకాలంలో అందకపోవడం, గృహ అవసరాల సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో కొనలేక చిరు హోటళ్ల యజమానులు, తోపుడు బండ్ల వ్యాపారులు విలవిలలాడుతున్నారు. గిట్టుబాటు కాక ఇప్పటికే అనేక చిరు హోటళ్లు మూతపడ్డాయి. దళారుల దెబ్బకు చిరువ్యాపారులు సమిధలవుతున్నారు.అక్రమ గ్యాస్ దందాపై ప్రజలు నెత్తీనోరు బాదుకుంటున్నా, అధికారులు మాత్రం నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. “దళారుల ప్రైవేట్ గోదాములపై దాడులు చేస్తే పెద్ద ఎత్తున నిల్వలు బయటపడతాయి.. కానీ అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు” అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీల వివరణ మేము న్యూ ఆధారంగానే పంపిణీ చేస్తున్నామని, ప్రజల ఇబ్బందులు దృష్ట్యా ఆదివారం కూడా సేవలు అందిస్తున్నామని గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులు చెబుతున్నారు. అయితే, ఏజెన్సీల నుంచి దళారుల చేతికి సిలిండర్లు ఎలా వెళ్తున్నాయనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్యాస్ దళారుల గుట్టు రట్టు చేయాలని, కఠిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు తప్పవని పట్టణ ప్రజలు హెచ్చరిస్తున్నారు.

## ఆవుల కోటి రెడ్డిని పరామర్శించిన కెపి నాగార్జున రెడ్డి



**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మార్చి 23 (ప్రజా ప్రతిభ):**

మార్కాపురం జిల్లా, బేస్తవారిపేట మండలం మోక్షగుండం గ్రామానికి చెందిన ఆవుల కోటి రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో గిద్దలూరు నియోజకవర్గ ఇంచార్జ్ కెపి నాగార్జున రెడ్డి పరామర్శించారు. సోమవారం ఆయన నివాసానికి వెళ్లిన నాగార్జున రెడ్డి, కోటి రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అవసరమైన వైద్యసేవలు అందించేందుకు తగిన సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడి, చికిత్స విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తెలియజేయాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం ముఖ్యమని, అవసరమైనప్పుడు పార్టీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేగనాటి ఓసురరెడ్డి, పిటికాయ గుళ్ళ ఎంపిటిసి మల్లెల శేఖర్ రెడ్డి, టౌన్ కన్వీనర్ మిట్ట చంద్రశేఖర్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, హరి, ఇతర వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యతోనే శాశ్వత మార్పు సాధ్యం

### - దొమ్మేటి వెంకట రెడ్డి జయంతి సందర్భంగా వైయస్ జగన్ నివాళులు



**ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మార్చి 23 (ప్రజా ప్రతిభ):**

విద్య ద్వారానే సమాజంలో శాశ్వత మార్పు సాధ్యమని,వందేళ్ల క్రితమే విశ్వసించి ఆ ఆలోచనను ఆచరణలో పెట్టిన, మహనీయుడు దొమ్మేటి వెంకట రెడ్డి అని వైయస్ఆర్సీపీ అధినేత, మాజీ సిఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. దొమ్మేటి వెంకట రెడ్డి జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని బోడసకుర్రు గ్రామంలో జన్మించిన దొమ్మేటి వెంకట రెడ్డి, సామాజిక చైతన్యానికి విద్యే బాట అని నమ్మి జీవితాన్ని ఆ దిశగా అంకితం చేశారని జగన్మోహన్ రెడ్డి తెలిపారు. 1905లోనే బర్మాలో నివసిస్తున్న శెట్టిబలిజ సోదరులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి శెట్టిబలిజ సంక్షేమ సంఘాన్ని స్థాపించి విద్యా విస్తరణకు పునాది వేశారని గుర్తు చేశారు. ప్రాథమిక పాఠశాలలు, గ్రంథాలయాలు, రాత్రి పాఠశాలలు స్థాపించి వయోజన విద్యకు మార్గం సుగమం చేసిన ఆయన కృషి అపారమని చెప్పారు. విద్య అందరికీ చేరాలి అన్న సంకల్పంతో సామాజికంగా వెనుకబడిన వర్గాలకు జ్ఞానదీపం వెలిగించిన దొమ్మేటి వెంకట రెడ్డి సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజ అభ్యున్నతికి విద్యే ప్రధాన సాధనమని ఆయన చూపిన మార్గం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని జగన్ అభిప్రాయపడ్డారు. విద్యకు మరింత ప్రాధాన్యత ఇస్తూ సమాజం ముందుకు సాగాల్సిన అవసరం ఉందని సూచించారు. దొమ్మేటి వెంకట రెడ్డి ఆలోచనలు, సేవలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజంలో సమానత్వం, అభివృద్ధి సాధ్యమవుతాయని జగన్ పేర్కొన్నారు.

## కొనకనమిట్లలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక



**మార్కాపురం జిల్లా ప్రతినిధి / కొండ్రు వెంకటేశ్వర్లు, మార్చి 23 ( ప్రజా ప్రతిభ):**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కొనకనమిట్ల మండలంలో జరిగిన పనులపై ఈనెల 25వ ఉదయం 10:00 గంటలకు ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీవో బులేన్ రావు తెలిపారు. 01.04.2024 నుండి 31.03.2025 వరకు మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులపై ఈ తనిఖీ జరిగింది.గత ఏడాది నవంబర్ 17 నుండి జనవరి 05 వరకు జరిగిన 17వ విడత సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై ఈ ప్రజావేదికలో చర్చించనున్నారు.మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ కార్యక్రమం జరుగుతుంది.ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## పొదిలి పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ






**మార్కాపురం జిల్లా ప్రతినిధి / కొండ్రు వెంకటేశ్వర్లు, మార్చి 23 ( ప్రజా ప్రతిభ)**

మార్కాపురం జిల్లా ఎస్పీ శ్రీ వి.హర్షవర్ధన్ రాజు, సోమవారం పొదిలి పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కార్యాలయానికి చేరుకున్న ఆయన, సర్కిల్ పరిధిలోని పలు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, శాంతిభద్రతల పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సర్కిల్ పరిధిలో నమోదైన హత్యలు, మహిళలపై జరుగుతున్న నేరాలు మరియు ఇతర గ్రేవ్ కేసుల దర్యాప్తులో జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. కేసుల ఛేదనలో వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితులను త్వరగా పట్టుకోవాలని, తద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూర్చాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నాన్-బైలబుల్ వారెంట్లను వేగవంతంగా అమలు చేయాలని సూచించారు.ముఖ్యంగా మహిళలు మరియు పిల్లల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అత్యవసర సమయాల్లో ‘శక్తి యాప్’ వినియోగంపై మహిళల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అలాగే, వలస కూలీల వివరాలను సేకరించి, లైవ్ స్కానర్ సహాయంతో వారి వేలిముద్రలను తప్పనిసరిగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం, రాంగ్ రూట్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడపడం వంటి చట్ట వ్యతిరేక చర్యలపై కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకోవాలని, విజిబుల్ పోలీసింగ్ మరియు పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలన్నారు. గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ గారు సూచించారు.ఈ కార్యక్రమంలో పొదిలి సీఐ ఎం. రాజేష్ కుమార్, ఎస్ బి ఇన్స్పెక్టర్ ఎం. శ్రీనివాసరావు, ఎస్సై రాజేష్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వార్నర్, స్టీవ్ స్మిత్‌కు బెదిరింపులు..





## విదేశీ క్రికెటర్లకు పాక్ ఉగ్రసంస్థ వార్నింగ్

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ సూపర్ లీగ్ టీ20 టోర్నమెంట్ నిర్వహణ అగమ్యగోచరంగా ఉంది. ఆ టోర్నీ జరుగుతుందో లేదో ఇంకా తెలియడం లేదు. అయితే ఆ టోర్నీలో పాల్గొనేందుకు వస్తున్న విదేశీ క్రికెటర్లకు బెదిరింపులు వస్తున్నాయి. పాకిస్థాన్‌కు చెందిన ఓ సాయుధ గ్రూపు తాజాగా వార్నింగ్‌లు జారీ చేసింది. విదేశీ ఆటగాళ్లను పంపవద్దు అని బోర్డులకు హెచ్చరిక చేసింది. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో ఆడేందుకు ఆసక్తిగా ఉన్న ఆసీస్ క్రికెటర్లు డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్‌కు సాయుధ గ్రూపు వార్నింగ్ వచ్చినట్లు తెలుస్తోంది. మార్చి 26వ తేదీ నుంచి పీఎస్ఎల్‌ను నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

పాకిస్థాన్‌కు క్రికెటర్లను పంపవద్దు అంటూ సంబంధిత బోర్డులకు సలహా ఇస్తున్నామని, ఒకవేళ వాళ్లకు ఏదైనా జరిగినా, అది తమ బాధ్యత కాదు అని, మేం ముందే వార్నింగ్ ఇస్తున్నామని తెహ్రిక్ ఈ తాలిబన్ పాకిస్థాన్(టీటీపీ) సీనియర్ కమాండర్ అసద్ మన్సూర్ తెలిపారు. సోషల్ మీడియా టీటీపీ కమాండర్ జారీ చేసిన వార్నింగ్ వైరల్ అవుతోంది. పీఎస్ఎల్‌లో విదేశీ ప్లేయర్లు పాల్గొవద్దు అని హెచ్చరిక చేశారు. పీఎస్ఎల్ ఫ్రాంచైజీ కరాచీ కింగ్స్ తరపున డేవిడ్ వార్నర్ సారధ్య బాధ్యతలు చేపట్టనున్నాడు. ఇక ఈ టోర్నీలో తొలిసారి స్టీవన్ స్మిత్ అరంగేట్రం చేయనున్నాడు. అతను ముల్తాన్ సుల్తాన్స్ తరపున ఆడనున్నాడు.

తాజా సమాచారం ప్రకారం స్మిత్ ఇప్పటికే పాకిస్థాన్‌కు బయలుదేరినట్లు తెలుస్తోంది. వార్నర్, స్మిత్ తో పాటు పీఎస్ఎల్‌లో ఆడే విదేశీ క్రికెటర్లలో మార్నస్ లబుషేన్, మొయిన్ అలీ, దేవాన్ కాన్వే, ఆడమ్ జంపా ఉన్నారు. ఈసారి టోర్నీ మొత్తాన్ని కేవలం రెండు వేదికల్లో నిర్వహించనున్నట్లు పీసీబీ ఛైర్మెన్ మోషిన్ నక్వీ తెలిపారు. పశ్చిమాసియా ఇంధన సంక్షోభం కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. మార్చి 26వ తేదీన ప్రారంభం అయ్యే టోర్నీలో మొత్తం 44 మ్యాచ్‌లు ఆడనున్నారు. లాహోర్, కరాచీ వేదికల్లో ఆ మ్యాచ్‌లు ఉంటాయి. ఓపెనింగ్ సెర్మనీని కూడా రద్దు చేశారు. మ్యాచ్‌లకు ప్రేక్షకులను అనుమతించబోమన్నారు.

# ట్రంప్ ప్రకటన ఎఫెక్ట్..

### ఒక్కసారిగా పడిపోయిన క్రూడాయిల్ ధరలు




**న్యూఢిల్లీ:** ఇరాన్‌తో యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో, అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు అమాంతం పడిపోయాయి. ఈరోజు ఉదయం 110 డాలర్లకు పైగా పలికిన బ్రెంట్ క్రూడాయిల్ ధర ట్రంప్ ప్రకటన తర్వాత 96 డాలర్లకు పడిపోయింది. ట్రంప్ ప్రకటించిన నిమిషాల్లోనే క్రూడాయిల్ 10 శాతానికి పైగా క్షీణించింది. ఆ తర్వాత కాస్త పుంజుకున్నప్పటికీ ఉదయంతో పోలిస్తే క్షీణించింది.

హర్మూజ్ జలసంధిని తెరవాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు అల్టిమేటం జారీ చేశారు. ఇరాన్ కూడా ధీటుగా స్పందించింది. దీనితో చమురు ధరలు ఉదయం భారీగా పెరిగాయి. మే డెలివరీ బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్‌కు 1 శాతం పెరిగి 113 డాలర్ల వద్ద, డబ్ల్యూటీఐ క్రూడాయిల్ 2.8 శాతం పెరిగి 101 డాలర్లు పలికింది. క్రూడ్ ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమైంది.

ఈ క్రమంలో రెండు రోజులుగా జరుగుతున్న చర్చలు సానుకూలంగా ముగిశాయని, అందుకే యుద్ధాన్ని ఐదు రోజుల పాటు తాత్కాలికంగా ఆపేస్తున్నామని ట్రంప్ ప్రకటించడంతో క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టాయి. గత నెల 28 ప్రారంభమైన ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం 24 రోజుల పాటు కొనసాగింది. యుద్ధాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని ట్రంప్ చేసిన ప్రకటనపై ఇజ్రాయెల్ స్పందించవలసి ఉంది.

# అమెరికా హెచ్చరిక.. ఇరాన్ ప్రతిస్పందన..

### కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు!




**ముంబై:** అమెరికా, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు భారత స్టాక్ మార్కెట్లను కుదిపేశాయి. సోమవారం ట్రేడింగ్‌లో అమ్మకాల సునామీ వెల్లువెత్తడంతో ఇన్వెస్టర్లు తీవ్రంగా నష్టపోయారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితి కారణంగా సూచీలు భారీ పతనాన్ని నమోదు చేశాయి. ఈ భారీ పతనం ఫలితంగా బీఎస్ఈ సెన్సెక్స్ 1,836.57 పాయింట్లు నష్టపోయి 72,696.39 వద్ద ముగిసింది. అలాగే, ఎన్ఎస్ఈ నిఫ్టీ 601.85 పాయింట్లు కోల్పోయి 22,512.65 వద్ద స్థిరపడింది. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిణామాలే ఈ పతనానికి ప్రధాన కారణంగా నిలిచాయి. హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తిరిగి తెరవకపోతే తీవ్ర చర్యలు తప్పవని ఇరాన్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. దీనికి ప్రతిగా మధ్యప్రాచ్యంలోని ఇంధన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ బెదిరించింది. ఈ పరిణామాలతో ముడి చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 2.37 శాతం పెరిగి 108.73 డాలర్లకు చేరింది.

ఈ ఆందోళనలతో మార్కెట్లలో అస్థిరత తీవ్ర స్థాయికి చేరింది. ఇండియా వీఐఎక్స్ సూచీ ఏకంగా 17 శాతానికి పైగా ఎగబాకి 26.73 వద్ద ముగిసింది. బెంచ్‌మార్క్ సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్లలో నష్టాలు మరింత ఎక్కువగా ఉన్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 3.69 శాతం, స్మాల్‌క్యాప్ 4.16 శాతం చొప్పున పతనమయ్యాయి. రంగాల వారీగా చూస్తే, నిర్మాణ రంగ షేర్లు అత్యధికంగా 5 శాతానికి పైగా నష్టపోయాయి. రియల్టీ, మెటల్ స్టాక్స్‌లో కూడా భారీ అమ్మకాలు కనిపించాయి. అయితే, ఐటీ రంగ షేర్లు మాత్రం తక్కువ నష్టాలతో పోల్చిచూస్తే నిలకడగా నిలిచాయి.

ఈ పరిణామాల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభలో మాట్లాడుతూ.. హర్మూజ్ జలసంధి ద్వారా ఇంధన సరఫరాకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం నిరంతరం ప్రయత్నిస్తోందని హామీ ఇచ్చారు. ఇంధన భద్రత, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు పెరగడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తున్నారు.

# ఈపీఎఫ్ఓ కీలక నిర్ణయం...

### క్లెయిమ్ చేయని డబ్బులు నేరుగా ఖాతాల్లోకి!




**న్యూఢిల్లీ:** ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) ఖాతాదారులకు ఊరటనిచ్చే దిశగా కీలక నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతోంది. చాలా కాలంగా వాడకంలో లేకుండా మూతపడిన (ఇన్‌యాక్టివ్) పీఎఫ్ ఖాతాల్లోని క్లెయిమ్ చేయని నిధులను ఆటోమెటిక్‌గా సెటిల్ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నట్లు సమాచారం. దీని కోసం ప్రత్యేకంగా ఆటోమేటెడ్ సెటిల్‌మెంట్ వ్యవస్థను తీసుకురానుంది.

ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, ఖాతాదారులు ఎలాంటి క్లెయిమ్ దాఖలు చేయాల్సిన అవసరం లేకుండానే వారి ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా డబ్బులు జమ అవుతాయి. నివేదికల ప్రకారం, తొలి దశలో భాగంగా ఆధార్ వెరిఫై అయిన సుమారు 8 లక్షల ఇన్‌యాక్టివ్ ఖాతాలను ప్రాసెస్ చేయనున్నారు. ఈ ఖాతాల్లో దాదాపు రూ. 5,200 కోట్ల నిధులు ఉన్నట్లు అంచనా. వీటిలో 14,000 ఖాతాల్లో రూ. 5 లక్షలకు పైగా, 38,000 ఖాతాల్లో రూ. 1 లక్ష నుంచి రూ. 5 లక్షల మధ్య బ్యాలెన్స్ ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 31 లక్షల ఇన్‌యాక్టివ్ ఖాతాల్లో రూ. 10,181 కోట్ల డిపాజిట్లు క్లెయిమ్ చేయకుండా ఉన్నట్లు ఈపీఎఫ్ఓ గుర్తించింది. వీటిలో 7 లక్షల ఖాతాలు 20 ఏళ్లకు పైబడినవి కాగా, 18 లక్షల ఖాతాలు 10 నుంచి 20 ఏళ్ల మధ్య కాలానికి చెందినవి. ఒక ఉద్యోగి 55 ఏళ్ల వయసులో పదవీ విరమణ చేసి, వరుసగా మూడేళ్లపాటు ఎలాంటి కంట్రిబ్యూషన్ చేయకపోతే ఆ ఖాతాను ఇన్‌యాక్టివ్‌గా పరిగణిస్తారు. ఇలాంటి ఖాతాలపై వడ్డీ జమ ఆగిపోతుంది.

ఇప్పటికే రూ. 1,000 లోపు బ్యాలెన్స్ ఉన్న ఇన్‌యాక్టివ్ ఖాతాలను ఆటోమేటిక్‌గా సెటిల్ చేసేందుకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఆమోదం తెలిపింది. తాజా ప్రతిపాదన దీనికి కొనసాగింపుగా భావిస్తున్నారు. అయితే ఈ నివేదికలపై ఈపీఎఫ్ఓ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను పీఎఫ్ డిపాజిట్లపై 8.25 శాతం వడ్డీ రేటును ఈపీఎఫ్ఓ ఇప్పటికే ఖరారు చేసిన విషయం తెలిసిందే.

# ఏబీడీ మెచ్చిన ఆటగాడు..




**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి మరికొన్ని రోజులే మిగిలి ఉన్న నేపథ్యంలో రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై అందరి దృష్టి నెలకొంది. కేవలం 14 ఏళ్ల వయసులోనే గత సీజన్‌లో ఐపీఎల్ సెంచరీ బాది రికార్డు సృష్టించిన ఈ ఎడమచేతి వాటం బ్యాటర్, ఆ తర్వాత భారత అండర్-19 జట్టు తరఫున కూడా అద్భుత ప్రదర్శన చేశాడు. దీంతో అతనిపై అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ క్రమంలో అతని ఆటతీరు, ప్రొఫెషనలిజంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దక్షిణాఫ్రికా దిగ్గజం, మిస్టర్ 360 ఏబీ డివిలియర్స్.. వైభవ్‌ను ప్రశంసలతో ముంచెత్తుతుండగా, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఆటగాడు జితేశ్ శర్మ మాత్రం సరదాగా చురకలు అంటించాడు. ఏబీ డివిలియర్స్ తన యూట్యూబ్ ఛానల్‌లో జితేశ్‌తో మాట్లాడుతూ వైభవ్ గురించి ప్రస్తావించాడు. "వైభవ్ గొప్ప ఆటగాడు. అండర్-19లో అతని ఆటను చూశాను. ఐపీఎల్ లాంటి పెద్ద లీగ్‌లలో ఆడిన తర్వాత అదే స్థాయిని కొనసాగించడం సులభం కాదు. కానీ, అతను ప్రపంచకప్‌లో ఆడిన తీరు నన్ను చాలా ఆకట్టుకుంది. చాలా ప్రొఫెషనల్‌గా ఆడాడు. తన వయసుకు మించిన పరిణతి అతనిలో ఉంది. ఐపీఎల్‌లో ఎలా ఆడాడో, అదే ఆటతీరును కొనసాగించాడు. బౌలర్ల పట్ల దురుసుగా ప్రవర్తించలేదు. అతను కచ్చితంగా మంచి ప్రొఫెషనల్‌గా ఎదుగుతాడు" అని డివిలియర్స్ కొనియాడాడు.

అయితే, జితేశ్ శర్మ మాత్రం వైభవ్ మైదానం బయట అలవాట్లపై భిన్నంగా స్పందించాడు. "అతను ప్రొఫెషనల్ కాదు. ఈ విషయం నేను కచ్చితంగా చెప్పగలను" అంటూ నవ్వుతూ వ్యాఖ్యానించాడు. "అందరూ అతడిని ప్రొఫెషనల్‌గా మార్చాలని ప్రయత్నిస్తున్నారు. కానీ, అతను ఎప్పటికీ మారడని నేను అనుకుంటున్నాను, కనీసం మైదానం బయట అయినా, నేను నా వంతు ప్రయత్నం చేస్తున్నాను. రాత్రిపూట ఐస్‌క్రీమ్ తినొద్దని చెబుతున్నాను. కానీ, అతను అస్సలు వినడు" అని జితేశ్ సరదాగా చెప్పాడు.

మైదానంలో అద్భుత ప్రతిభ కనబరుస్తూ, బయట ఇలాంటి చిన్న చిన్న సరదాలతో గడిపే వైభవ్ తీరు అతని స్టార్‌డమ్‌కు కొత్త ఆకర్షణ తెచ్చిపెడుతోంది. అయితే, క్రికెట్‌లో సుదీర్ఘకాలం రాణించాలంటే కఠినమైన ఆహార నియమాలు, ఫిట్‌నెస్ అత్యంత కీలకమని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మరో 5 రోజుల్లో ప్రారంభంకానున్న ఐపీఎల్



**చెన్నై:** ఈ యేటి ఇండియన్ ప్రీమియర్ లీగ్ మరో 5 రోజుల్లో ప్రారంభంకానున్నది. అయితే ఆ సీజన్ ప్రారంభానికి ముందు.. చెన్నైలోని చిదంబరం స్టేడియంలోలో సీఎస్కే జట్టు ఫ్యాన్ ఎంగేజ్మెంట్ ఈవెంట్‌ను ఆర్గనైజ్ చేసింది. చెన్నై సూపర్ కింగ్స్ తన తొలి మ్యాచ్‌ను గౌహతితో రాజస్థాన్ రాయల్స్‌తో ఆడనున్నది. అయితే ఆదివారం చెపాక్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో చెన్నై మాజీ ప్లేయర్లతో పాటు ప్రజెంట్ ప్లేయర్లు క్రికెట్ అభిమానుల్ని థ్రిల్ చేశారు. లెజెండరీ బౌలర్ ముత్తయ్య మురళీధరన్, సీఎస్కే ప్లేయర్ ధోనీ, సంజూ శాంసన్ మైదానంలో హల్ చల్ చేశారు. చెన్నై జట్టుకు కొత్తగా రిక్రూట్ అయిన శాంసన్.. మురళీధరన్ బౌలింగ్‌ను ఎదుర్కొన్నాడు. ఆ ఓవర్‌కు ధోనీ కీపింగ్ చేశాడు. అయితే తొలి రెండు బంతుల్ని డిఫెన్స్ ఆడిన శాంసన్.. ఆ తర్వాత భారీ హిట్‌కు ప్రయత్నించాడు. ముందుకు వచ్చి ఆ బంతిని కొట్టబోయాడు. కానీ శాంసన్ బ్యాట్ నుంచి బంతి మిస్సైంది. కీపర్ ధోనీ ఆ బంతిని అందుకుని స్టంప్ చేయబోయాడు. కానీ స్టంప్స్‌ను కొట్టకుండా కావాలని మిస్ చేశాడు. ఇక ఆ తర్వాత బంతిని కూడా శాంసన్ కనెక్ట్ చేయలేకపోయాడు. ఇక ఫైనల్ బంతికి మాత్రం భారీ సిక్సర్ కొట్టాడు. ఆ బంతి స్టాండ్స్‌లోకి వెళ్లి పడింది. దీంతో చెపాక్ మైదానంలోని ప్రేక్షకులు ఫుల్ చీర్స్ కొట్టారు. ఆ ఘటనకు చెందిన వీడియో వైరల్ అవుతోంది.

# ఐపీఎల్‌లో ఆ ఒక్క నిబంధనే నాకు నచ్చదు..




**న్యూఢిల్లీ:** పొట్టి ప్రపంచకప్‌లో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన అక్షర్ పటేల్ ఐపీఎల్‌లోనూ జోరు చూపించేందుకు సిద్ధమవుతున్నాడు. టైటిల్ కోసం నిరీక్షిస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ కలను సాకారం చేసేందుకు అవసరమైన వ్యూహాలు పన్నుతున్నాడీ కెప్టెన్. మరో ఐదు రోజుల్లో పంతొమ్మిదో సీజన్ మొదలవ్వనున్న నేపథ్యంలో సహచరులతో కలిసి నెట్స్‌లో ప్రాక్టీస్‌తో బిజీగా ఉన్న అక్షర్ పటేల్.. 'ఇంప్యాక్ట్ ప్లేయర్' నిబంధనపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఐపీఎల్‌లో అన్నీ ఒకే.. కానీ, ఈ ఒక్క నిబంధనే తనకు నచ్చదని అంటున్నాడీ పొడగరి క్రికెటర్. పంతొమ్మిదో సీజన్ ఐపీఎల్ సన్నద్ధత గురించి, జట్టులో తన పాత్ర గురించి అక్షర్ పటేల్ మాట్లాడాడు. గత సీజన్‌లో తాను తక్కువగా బౌలింగ్ చేయడానికి కారణం ఇంప్యాక్ట్ ప్లేయర్ నియమం కారణంగా కాదని చెప్పిన ఢిల్లీ కెప్టెన్.. ఈ నిబంధన తనకు అస్సలు నచ్చదని అంటున్నాడు. 'ఇంప్యాక్ట్ ప్లేయర్ నిబంధన నాకు నచ్చదు. ఎందుకంటే నేను ఆల్‌రౌండర్‌ను కాబట్టి. మొదట్లో బ్యాటింగ్, బౌలింగ్‌కు పనికొస్తారని ఆల్‌రౌండర్లను తీసుకునేవారు. ఇంప్యాక్ట్ ప్లేయర్ నిబంధన వచ్చాక స్పెషలిస్ట్ బ్యాటర్, బౌలర్‌ను మాత్రమే

ఎంచుకుంటున్నారు. అలాంటప్పుడు ఆల్‌రౌండర్ల అవసరం ఏముంది? అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. అందుకే.. నేను ఒక ఆల్‌రౌండర్‌ను అయినందు వల్ల నాకు ఈ నియమం అంటే ఇష్టముండదు. అయితే.. నియమాలేమీ మనం పాటించడానికేగా. కానీ, వ్యక్తిగతంగా చెప్పాలంటే ఇంప్యాక్ట్ ప్లేయర్ రూల్‌ను వ్యతిరేకిస్తాను' అని అక్షర్ పటేల్ వెల్లడించాడు.

పద్దెనిమిదో సీజన్‌లో తాను ఎక్కువగా బౌలింగ్ చేయకపోవడానికి తన వేలి గాయమే కారణమని అక్షర్ పటేల్ చెప్పాడు. 'ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలో బంతిని తిప్పేందుకు ఉపయోగపడే నా వేలికి గాయమైంది. బౌలింగ్ చేస్తున్నప్పుడు ఆ గాయం మరింత పెద్దదైంది. దాంతో.. ఐపీఎల్‌లో జట్టుకు అవసరమైనప్పుడే బౌలింగ్ చేసి నా వేలిని కాపాడుకున్నా. ఏడు మ్యాచ్‌ల తర్వాత నా వేలి గాయం పూర్తిగా మానింది.

ఆ తర్వాత బౌలింగ్ చేయడం మొదలెట్టా. అంతే తప్ప ఇంప్యాక్ట్ ప్లేయర్ నిబంధన వల్ల కాదు అని అక్షర్ పటేల్ స్పష్టతనిచ్చాడు. అయితే.. హెడ్‌కోచ్ హేమంగ్ బదాని మాత్రం ఇంప్యాక్ట్ ప్లేయర్ నిబంధనను సమర్థించాడు. పంతొమ్మిదో సీజన్ తొలి మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు ఏప్రిల్ 1న లక్నో సూపర్ జెయింట్స్‌ను ఢీకొట్టనుంది.

# బైకర్ ట్రైలర్‌కు ప్రభాస్ ప్రశంసలు



**టాకీస్:** టాలీవుడ్ ఛార్మింగ్ స్టార్ శర్వానంద్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రం బైకర్ ఇప్పటికే సినీ వర్గాల్లో సాలిడ్ బజ్ క్రియేట్ చేసింది. ఇండియాలోనే తొలి మోటోక్రాస్ రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా తన కాన్సెప్ట్‌తో ప్రత్యేక గుర్తింపును సంపాదించింది. తాజాగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలుస్తోంది. ఈ ట్రైలర్‌పై పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ స్పందించడం మరింత ఆసక్తిని రేకెత్తించింది. తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రభాస్ 'బైకర్ ట్రైలర్ వైబ్ అదిరిపోయింది' అంటూ ప్రశంసలు కురిపించాడు. ట్రైలర్ చాలా ఎంగేజింగ్‌గా ఉందని, సినిమా టీమ్‌కు తన శుభాకాంక్షలు తెలియజేశాడు. ముఖ్యంగా శర్వానంద్‌తో పాటు నిర్మాణ సంస్థకు కూడా విజయాన్ని కోరుకున్నాడు. ఈ ట్రైలర్‌లో హై-ఆక్టేన్ రేసింగ్ సీన్స్, ఎమోషనల్ ఎలిమెంట్స్, ఫ్యామిలీ బ్యాక్‌డ్రాప్ అన్నీ బ్యాలెన్స్‌డ్ చూపించడం విశేషం. శర్వానంద్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపిస్తూ, రేసర్ పాత్రలో తన ట్రాన్స్‌ఫర్మేషన్‌తో ఆకట్టుకుంటున్నాడు. మరోవైపు సీనియర్ నటుడు రాజశేఖర్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుండటం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మాళవిక నాయర్ నటిస్తుండగా, భారీ తారాగణం ఈ ప్రాజెక్ట్‌లో భాగమైంది. దర్శకుడు అభిలాష్ రెడ్డి ఈ చిత్రాన్ని స్టైలిష్ రేసింగ్ డ్రామాగా రూపొందిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ మూవీ టెక్నికల్‌గా కూడా హై స్టాండర్డ్స్‌తో తెరకెక్కుతున్నట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. మోటోక్రాస్ రేసింగ్ వంటి కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు ఒక ఫ్రెష్ ఎక్స్‌పీరియెన్స్ ఇవ్వనుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే ట్రైలర్‌కు వస్తున్న స్పందనను బట్టి, ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి ఓపెనింగ్స్ సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ 3న గ్రాండ్‌గా విడుదల కానున్న 'బైకర్' మూవీ, శర్వానంద్ కెరీర్‌లో ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది.

# నాపేరుతో ఎలాంటి వ్యాపారాలు లేవు

## గాయని మంగ్లీ ప్రకటన విడుదల



**టాకీస్:** ప్రఖ్యాత ఫోక్ సింగర్ మంగ్లీ పేరుతో మైక్రో ఫైనాన్స్ వ్యాపారం జరుగుతోందని వస్తున్న వార్తలపై ఆమె ఘాటుగా స్పందించారు. తనకు అలాంటి వ్యాపారాలతో సంబంధం లేదని స్పష్టం చేస్తూ, సోషల్ మీడియా వేదికగా ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కొందరు వ్యక్తులు మంగ్లీ పేరును ఉపయోగిస్తూ మైక్రో ఫైనాన్స్ పేరిట డబ్బులు వసూలు చేస్తున్నారనే వార్తలు వెలుగులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె స్పందిస్తూ, 'నా పేరుతో డబ్బులు సేకరిస్తున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అసత్యం. నాకు ఆ వ్యక్తులతో గానీ, వార్ని ÷నాన్స్ వ్యాపారాలతో గానీ ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. మంగ్లీ తన ప్రకటనలో , తనను మరియు తన కుటుంబ సభ్యులను చాలా మంది ప్రొఫెషనల్ ఈవెంట్స్ కోసం సంప్రదిస్తుంటారని చెప్పారు. అయితే, ఆ ఈవెంట్స్‌కు సంబంధించిన ఆహ్వానాల వరకే తమకి పరిచయం ఉంటుందని, వారి వ్యక్తిగత వ్యాపారాల గురించి తాము ఎలాంటి బాధ్యత వహించబోమని స్పష్టం చేశారు. అలాగే, తన పేరును ఉపయోగించి మోసాలకు పాల్పడటం అన్యాయమని, ఇది తన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కరెన్సీ వీడియోలు, ఫైనాన్స్ వ్యవహారాలకు తమ కుటుంబానికి ఎలాంటి సంబంధం లేదని ఆమె మరోసారి క్లియర్ చేశారు.

# మే 1న రిలీజ్ కానున్న గాయపడ్డ సింహం

**టాకీస్:** టాలీవుడ్ యాక్టర్ కమ్ డైరెక్టర్ తరుణ్ భాస్కర్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'గాయపడ్డ సింహం మూవీ కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఫరియా అబ్దుల్లా, మానసా చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. డైరెక్టర్ పవన్ సాధినేని సమర్పకుడిగా వ్యవహరిస్తున్నాడు. రీసెంట్‌గా ఈ సినిమాకు సంబంధించి టీజర్, ట్రైలర్ కలయికతో 'ట్రైజర్'ను తాజాగా విడుదల చేయగా.. మంచి స్పందన వస్తోంది. ట్రైజర్ సైటైరికల్ కామెడీ బ్యాక్ డ్రాప్‌లో యాక్షన్ ఎలిమెంట్స్ తో కలయికతో ఫన్‌గా సాగుతూ మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. అమెరికా వెళ్లాలని కలలు కనే ఓ యువకుడి జీవితంలో చోటుచేసుకునే సంఘటనల చుట్టూ సినిమా తిరుగుతుందని ట్రైజర్‌తో హింట్ ఇచ్చాడు. ఆ యువకుడు వీసా రిజెక్ట్ కావడంతో అతడు ఎదుర్కొనే నిరాశ, ఫ్రస్ట్రేషన్, ఆ తర్వాత తీసుకునే నిర్ణయాలు కథకు ప్రధానాంశాలుగా ఉంటాయని ట్రైజర్ హింట్ ఇచ్చేస్తుంది. మధ్య మధ్యలో వచ్చే యాక్షన్ ఎపిసోడ్‌లు, కేజీఎఫ్ స్పూఫ్ సన్నివేశాలు, అమెరికా వెళ్లకపోయినా హీరో ఇచ్చే బిల్డప్ డైలాగులు వినోదాన్ని పంచుతున్నాయి.

ప్రత్యేకంగా ట్రైజర్‌లో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సూచించే విధంగా చూపించిన సన్నివేశాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. అమెరికా వీసా నిబంధనల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న యువత ఆవేదనను ప్రతిబింబించే ప్రయత్నం చేసినట్లు అనిపిస్తోంది. మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న విడుద తేదీపై మేకర్స్ క్లారిటీ ఇచ్చేశారు.







# ఏం ప్లాన్ చేశారు సామీ..


## పెద్ది కోసం రంగంలోకి కల్ట్ హీరోయిన్..

టాకీస్: మెగా ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా పెద్ది. ఇప్పుడు టాలీవుడ్ ఇండస్ట్రీలో భారీ హైప్ ఉన్న సినిమా ఇది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రలో సెన్సేషనల్ డైరెక్టర్ బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న ఈసినిమా పై ఇప్పటికే ఎన్నో అంచనాలు ఉన్నాయి. స్పోర్ట్స్ డ్రామాగా రాబోతున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్, కన్నడ స్టార్ శివ రాజ్ కుమార్ కీలకపాత్రలలో నటిస్తున్న సంగతి తెలిసిందే. అలాగే విలక్షణ నటుడు జగపతి బాబు ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఇదివరకే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ లుక్ పోస్టర్స్ ఆకట్టుకున్నాయి. మరోవైపు పెద్ది చిత్రంలోని సాంగ్స్ యూట్యూబ్ లో దూసుకుపోతున్నాయి. ఈ సినిమాలో ఊర మాస్ లుక్ లో కనిపించనున్నారు రామ్ చరణ్. ప్రస్తుతం ఈ సినిమాను నుంచి విడుదలైన చికిరీ చికిరీ, రైరై రారా పాటలు మరింత హైప్ పెంచేశాయి.

ఇదిలా ఉంటే.. ఇప్పుడు ఈ సినిమా గురించి ఓ ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో వైరలవుతుంది. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్ ఉంటుందట. అయితే ఈ పాట కోసం టాలీవుడ్ కల్ట్ హీరోయిన్ ను ఎంపిక చేశారట మేకర్స్. ఏఆర్ రెహమాన్ క్రియేట్ చేసిన ఈ సాంగ్ కోసం బాలీవుడ్ బ్యూటీ మృణాల్ ఠాకూర్ ను సెలక్ట్ చేశారట. ఈ సినిమాకు అటు మృణాల్ సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని టాక్. అలాగే ఈ పాటలో మృణాల్, రామ్ చరణ్ ఇద్దరితోపాటు జాన్వీ కపూర్ సైతం ఎంట్రీ ఉంటుందని సమాచారం. ఈ పాటకు థియేటర్లలో బాక్సులు షేక్ అవ్వడం ఖయమని అంటున్నారు. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమాను ఏప్రిల్ 30న థియేటర్లలో గ్రాండ్ గా రిలీజ్ చేయనున్నారు. ఉప్పెన సినిమా తర్వాత డైరెక్టర్ బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న సెకండ్ మూవీ ఇదే. దీంతో ఈ ప్రాజెక్ట్ పై మెగా అభిమానులలో మంచి హైప్ నెలకొంది.

## రౌడీ జనార్ధన్ మూవీ కోసం

# విజయ్ కసరత్తు




**టాకీస్:** టాలీవుడ్ యాక్టర్ విజయ్ దేవరకొండ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడు. వీటిలో ఒకటి రాహుల్ సంకీర్త్యన్‌తో చేస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా. విజయ్ మరోవైపు దిల్ రాజు నిర్మాణంలో రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ రూరల్ మాస్ డ్రామాకు కమిటవగా.. ఈ చిత్రానికి రౌడీ జనార్ధన అనే టైటిల్ కూడా ఖరారు చేశారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో గ్రాండ్ స్కేల్‌లో ఉండబోయే యాక్షన్ సీక్వెన్స్‌ను విజయ్ టీం డిజైన్ చేస్తుందట. ముంబై స్లమ్స్ ఏరియాలో రాబోయే హై ఆక్టేన్ ఫైట్ సీక్వెన్స్ సినిమాకే హైలెట్‌గా నిలువబోతుందట. ఇంటెన్స్, రియలిస్టిక్ యాక్షన్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా ఈ ఎపిసోడ్ ఉండనుందిని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విజయ్ దేవరకొండ ట్రాన్స్‌ఫార్మేషన్ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తుంది. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో రియల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రంలో విజయ్ పాత్ర పేరు జనార్ధన్ కాగా, ఆయన నాన్న పేరు కూడా జనార్ధనేనని ఇన్‌సైడ్ టాక్. విజయ్ దేవరకొండకు 'రౌడీ' అనే ట్యాగ్ ఎప్పటి నుంచో ఉంది. ఇప్పుడు రౌడీ టైటిల్‌తో సినిమా వస్తుండడంతో ఫ్యాన్స్ అంతా ఫుల్ ఖుషీ అవుతున్నారు. ఈ సినిమాతో విజయ్ తన విశ్వరూపం చూపించనున్నాడని కామెంట్ చేస్తున్నారు.

# రీ ఎంట్రీ ఇస్తున్న నటి రోజా

## 12 ఏళ్ల తరవాత తమిళ మూవీతో స్టార్ట్

**టాకీస్:** తమిళ సినీ పరిశ్రమలో సీనియర్ నటీమణుల రీఎంట్రీ ట్రెండ్ కొనసాగుతోంది. ఇటీవల శోభన తిరిగి కోలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఇప్పుడు మరో ఫైర్‌బ్రాండ్ నటి, రాజకీయ నాయకురాలు ఆర్కే రోజా కూడా మళ్లీ తమిళ సినిమాల్లో బిజీ అవుతున్నారు. గత కొంతకాలంగా రాజకీయాల్లో చురుకుగా ఉన్న రోజా, ప్రస్తుతం సినిమాలపై మళ్లీ ఫోకస్ పెట్టారు. 12 ఏళ్ల విరామం తర్వాత ఆమె తమిళ ఇండస్ట్రీలోకి రీఎంట్రీ ఇస్తుండటం విశేషం. ఇప్పటికే ఆమె నటించిన



లెనిన్ పాండ్యన్ షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. ఇదే సమయంలో రోజా నటిస్తున్న మరో చిత్రం అన్బే దయానా కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. పారి ఎలవళగన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో రమ్య రంగనాథన్ హీరోయిన్‌గా కనిపించ నున్నారు. చెన్నైలోని పెరంబూర్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ రొమాంటిక్ లవ్ స్టోరీలో రోజా కీలక పాత్రలో, ముఖ్యంగా హీరో తల్లి పాత్రలో కనిపించబోతున్నారు. ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన 'పెరంబూర్ గానా' సాంగ్ మంచి స్పందన అందుకుంటోంది. ముఖ్యంగా ఈ పాటలో రోజా చేసిన మాస్ స్టెప్పులు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చాలా గ్యాప్ తర్వాత కూడా తన ఎనర్జీ తగ్గలేదని మరోసారి నిరూపించారు. ఈ పాట వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మిలియన్ డాలర్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తవగా, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ప్రమోషన్స్‌లో భాగంగా లిరికల్ వీడియోలు విడుదల చేస్తూ సినిమాపై అంచనాలు పెంచుతున్నారు. ఇటీవల సీనియర్ నటి రాధిక నటించిన 'తాయి కిళవి' భారీ విజయాన్ని సాధించడంతో, ఇప్పుడు రోజా రీఎంట్రీ మూవీపై కూడా కోలీవుడ్‌లో మంచి బజ్ నెలకొంది. సుదీర్ఘ విరామం తర్వాత రోజా మళ్లీ తెరపై కనిపించబోతుండటంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ రీఎంట్రీతో కోలీవుడ్‌లో రోజా మరోసారి తన సత్తా చాటుతారా అన్నది చూడాలి.

Printed published and own by him Dr. kongarapu Ganapathi, Phone number: 9494451230, D.No 1/164 Balanki street, paalakonda-532440.
Officeaddress D-NO: 8-33-13, Near Kalabarathi opp com office, pithapuram colony, Maddilapalem visakhapatnam-530003. RNI:APTEL 2013/54721.
Editor in Chief: Danuri Srinivas - 9441500341